ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 18.01.2026 | సంపుటి :12 సంచిక : 179 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## జేఈఈ పరీక్షల అడ్మిట్ కార్డుల విడుదల



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం విడుదల చేసింది. జనవరి 21, 22, 23, 24 తేదీల్లో జరగనున్న పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డుల్ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. దేశవ్యాప్తంగా జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్-1

మిగతా 2లో..

## నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల



**హైదరాబాద్(జనంసాక్షి)** ప్రభుత్వ హాస్పిటళ్లలో ఖాళీల భర్తీ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే 1257 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి

మిగతా 2లో..

# పదేళ్లలో ఏం పూర్తి చేశారో చెప్పండి



## పాలమూరు అభివృద్ధిపై సీఎం రేవంత్ సవాల్

- ఈ గడ్డ బిడ్డల శ్రమతోనే దేశవ్యాప్తంగా ప్రాజెక్టులు
- ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేసిన కేసీఆర్
- బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం
- పదేళ్లపాటు ప్రాజెక్టులు కట్టకుండా తీవ్ర నిర్లక్ష్యం
- పేదలకు పంచేందుకు భూమి లేదు..
- విద్యార్థులకు మంచి విద్య అందిస్తాం
- ఎంపీ డీకే అరుణ మద్దతుతో జిల్లాకు ఐఐఎం తీసుకొస్తాం
- మహబూబ్‌నగర్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- జిల్లాలో రూ.1,284 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

"ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు తెచ్చేందుకే ప్రధాని మోదీని కలుస్తున్నా. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేస్తాం. తర్వాత ప్రజల కోసం కలిసి పనిచేస్తాం. నాకు ఎవరూ శత్రువులు లేరు. రాజకీయ ప్రత్యర్థులను ఎన్నికల్లోనే ఓడించాను. ఎన్నికల తర్వాత నాకు ఎవరి మీద కోపం లేదు, శత్రుత్వం లేదు. పేదరికం, నిరక్షరాస్యత మాత్రమే మనకు శత్రువులుగా భావిస్తా. - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి):** కష్టపడే తత్వం. నమ్మకం, విశ్వాసంగా పని చేసే పాలమూరు జిల్లా వెనుకబడడానికి కాంగ్రెస్ ఆనాటి పాలకులు, గత ప్రభుత్వాలేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పాలమూరు జిల్లాకు చేయాల్సిన న్యాయం చేయలేదని, ఇవ్వాల్సిన నిధులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు ప్రారంభించుకున్న ఈనాటికి అవి పూర్తి కాలేదన్నారు. శనివారం మహబూబ్ నగర్ పట్టణంలోని ఎం.వి.ఎస్. డిగ్రీ కళాశాల మైదానంలో మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ పరిధిలో త్రాగునీటి సరఫరా పథకంకు, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థకు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు నూతన

మిగతా 2లో..

### నేడు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో సీఎం పర్యటన

- సీపీఐ శతవార్షికోత్సవ సభలో పాల్గొననున్న రేవంత్
- జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- మేడారంలో ఆలయాన్ని ప్రారంభించనున్న సీఎం
- అక్కడే కేబినెట్ భేటీకి ఏర్పట్లు పూర్తి

2లో..

## కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారు




### 121 మున్సిపాలిటీల్లో 5 ఎస్టీ, 17 ఎస్సీ, 38 బీసీలకు కేటాయింపు

- ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- మున్సిపల్ ఎన్నికల్లో కీలక ముందడుగు
- ఎన్నికల సంఘానికి అందనున్న జాబితా

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. శనివారం సాయంత్రానికి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల రిజర్వేషన్ల పక్రియ పూర్తి కానుంది. రాత్రికి లేదాఆదివారం ఉదయానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి రిజర్వేషన్ల జాబితా అందజేసే అవకాశం ఉంది. ప్రభుత్వం జీవో ఇచ్చిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు ఎస్ఈసీ సిద్ధంగా ఉంది. ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. 10 కార్పొరేషన్లలో ఎస్సీ-1, ఎస్టీ-1, బీసీ-3 (ఒకటి మహిళ)లకు కేటాయించారు. జనరల్ కేటగిరీ లో ఐదు స్థానాలకు గానూ ఏకంగా నాలుగు స్థానాలను మహిళలకు కేటాయించారు. 121 మున్సిపాలిటీల్లో ఎస్సీ-17, ఎస్టీ-5, బీసీ-38, జనరల్-61 కేటాయించడం జరిగింది. కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లు... ఇలా ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ - ఎస్టీ (జనరల్), రామగుండం కార్పొరేషన్- ఎస్సీ (జనరల్), మహబూబ్‌నగర్ కార్పొరేషన్- బీసీ మహిళ, మంచిర్యాల కార్పొరేషన్- బీసీ (జనరల్), కరీంనగర్ కార్పొరేషన్ - బీసీ (జనరల్), ఖమ్మం కార్పొరేషన్- మహిళ (జనరల్), నిజామాబాద్ కార్పొరేషన్- మహిళ (జనరల్), వరంగల్ కార్పొరేషన్- జనరల్, జీహెచ్ఎంసీ - మహిళ (జనరల్) నల్లగొండ కార్పొరేషన్- మహిళ (జనరల్) కు కేటాయించారు.

## ఐపీఎస్ అధికారుల బదిలీ




రాష్ట్ర వ్యాప్తంగా 20 మందిని స్థానచలనం చేస్తూ సీఎస్ ఉత్తర్వులు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో 20 మంది ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. గజారావు భూపాల్ (ఐజీ), అభిషేక్ మొహంతి (విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీ), భాస్కరన్ (ఇంటెలిజెన్స్ డీఐజీ), చందనా దీప్తి (ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ అదనపు సీపీ), టి. అన్నపూర్ణ (అడ్మిన్, సైబరాబాద్ డీసీపీ),

మిగతా 2లో..

## సికింద్రాబాద్ అస్తిత్వం దెబ్బతీసేందుకు కుట్ర



- ప్రభుత్వ చర్యలపై పోరాటం ఆపేది లేదు
- మండిపడ్డ బీఆర్ఎస్ నేత కేటీఆర్
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్, సికింద్రాబాద్ కు ఎంతో చరిత్ర ఉందని.. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని తొలగించే విధంగా చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తుగ్లక్ గురించి పుస్తకాల్లో చదువుకున్నాం.. ప్రత్యక్షంగా తుగ్లక్ అంటే ఎలా ఉంటాడో కనిపిస్తుందని విమర్శించారు. మొట్టమొదటి పని టీఎస్‌ను టీజీగా చేశారు.. దీనివల్ల ఏ పేదవాడికి న్యాయం జరిగిందో తెలియదు.. తెలంగాణ తల్లిని తీసేసి కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చి పెట్టారన్నారు. ప్రజల దగ్గరికి పాలన పోవాలని అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాలని వీకేంద్రీకరణను ఒక విశాల దృక్పథంతోనే కేసీఆర్ ప్రారంభించారని.. కొత్త గ్రామాలు మండలాలు రెవెన్యూ డివిజన్లు జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చారని.. హైదరాబాదులోనూ వార్డులను జోన్లను పెంచడం జరిగిందన్నారు. వాటికి అభివృద్ధి నిధులను కూడా అధికంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ సికింద్రాబాద్ అనేది తెలంగాణ ప్రజల గొప్ప అస్తిత్వం చిహ్నాలు.. కానీ రేవంత్ రెడ్డి తీసుకున్న తుగ్లకు నిర్ణయం వలన సికింద్రాబాద్‌కి చారిత్రక గుర్తింపు పూర్తిగా పోయేటట్లు ఉన్నదని అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్లోని అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా సంఘటితమై.. మా పార్టీని ఆహ్వానించడం జరిగిందని.. అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు

మిగతా 2లో..



### గణతంత్ర దినోత్సవ వేళ రాష్ట్రాలకు హై అలర్ట్

ఉగ్రదాడుల నేపథ్యంలో కేంద్రం అప్రమత్తం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** గణతంత్ర దినోత్సవం-2026 సందర్భంగా అన్ని రాష్ట్రాలకు భద్రతా సంస్థలు హై అలర్ట్ ప్రకటించాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీని లక్ష్యంగా చేసుకుని ఉగ్రదాడి జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేసే ఉగ్ర గ్రూపులు ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, ముంబై, హైదరాబాద్ సహా పలు ప్రధాన నగరాల్లో దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరించింది. ఆయా నగరాల్లోని

## ఇరాన్ అల్లర్ల వెనుక ట్రంప్



### దేశంలో నిరసనలకు, ప్రాణ నష్టానికి ఆయనే కారణం

- ఇటీవల ఆందోళనల వెనుక అమెరికా కుట్ర
- ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడం వారి లక్ష్యం
- అందుకే ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నాం
- నిరసనల్లో పాల్గొన్నవారు అమెరికా కోసం పనిచేసిన వారే
- విధ్వంసానికి కారణమైన వారిని విడిపెట్టం
- మండిపడ్డ సుప్రీం లీడర్ ఖమేనీ

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్న ఆయన.. ఇరాన్‌లో ఆందోళనలకు, ప్రాణ నష్టానికి ఆయనే కారణమని ఆరోపించారు. ఇటీవల చోటుచేసుకున్న ఆందోళనల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఖమేనీ తొలిసారి ప్రస్తావించారు. "ఇటీవల ఆందోళనల వెనుక అమెరికా కుట్ర దాగుంది. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడం వారి లక్ష్యం. ఆందోళనల వేళ అమెరికా అధ్యక్షుడు స్వయంగా వ్యాఖ్యలు చేస్తూ నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. అందుకే ఆయన్ను నేరస్థుడిగా పరిగణిస్తున్నాం. నిరసనల్లో పాల్గొన్నవారు అమెరికా కోసం పనిచేసిన వారే. విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేశారు. ఎంతో మందిని గాయపరిచారు" అని సుప్రీం లీడర్ ఖమేనీ పేర్కొన్నారు. ఆందోళనకారులు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న మందుగుండు సామగ్రిని వినియోగించారని ఖమేనీ ఆరోపించారు. యుద్ధం వైపు దేశాన్ని

మిగతా 2లో..

### ఎటు చూసినా ఆందోళనలే

- ఇరాన్ పరిస్థితులను వివరించిన భారతీయులు
- రెండు విమానాల్లో పలువురి తరలింపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇరాన్‌లో పరిస్థితులు క్షీణించడంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను విదేశాంగ శాఖ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. తొలివిడతలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి తర్వాత

మిగతా 2లో..





## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

### ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టుల మృతి

**చర్ల(జనంసాక్షి):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో శనివారం ఎన్‌కౌంటర్ జరిగింది. జిల్లాలోని జాతీయ ఉద్యానవనంలో మావోయిస్టులు భద్రతా బలగాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టుతో సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇక్కడి నేషనల్ పార్క్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతానికి డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు చేరుకుని ఆపరేషన్ చేపట్టాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ కొనసాగుతోందని ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ఘటనా స్థలం నుంచి రెండు ఏకే 47 రైఫిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా మృతి చెందినట్లు గుర్తించారు.

మిగతా 2లో..

## మళ్లీ 'వందేభారత్'ను ప్రారంభించిన మోదీ

**కోల్‌కతా(జనంసాక్షి):** భారత్‌లో తొలి వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో జరిగిన కార్యక్రమంలో ఈ అధునాతన రైలును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్లీపర్ రైల్లో ప్రయాణించే విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. రైలు లోపలికి వెళ్లి అందులోని సౌకర్యాలను ప్రధాని పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌లోని హావ్‌డా- అస్సాంలోని గువాహటి మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది. వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య తుది పరీక్షలు నిర్వహించగా రైలు ఈ వేగాన్ని చేరుకుంది. గాజు గ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్‌లో ఉంచినా.. రైలు గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం నీళ్లు తొణకకపోవడాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతంలో సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ రైల్లో 16 కోచ్‌లు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్

మిగతా 9లో..




### బెంగాల్ అభివృద్ధికి మమతే ప్రధాన అడ్డంకి

- తృణమూల్‌ను సాగనంపే సమయం వచ్చింది
- చొరబాటు దారులకు ఆ పార్టీ అండతో నష్టం
- అవినీతి కారణంగా ప్రజలకు చేరని పథకాలు
- బీహార్ తరవాత ఇప్పుడు బెంగాల్ వంతు
- మాల్దా సభలో ప్రధాని మోదీ

2లో..

## వనజాతరకు వేళాయే..

మేడారం జాతర జనవరి 28 నుండి 31వరకు

**ములుగు(జనంసాక్షి):** రెండేళ్లకోమారు జరిగే మేడారం జాతర ఈ యేడు జనవరి 28 నుండి 31 వ తేదీ వరకు జరుగుతుంది. జాతర మొదటి రోజైన 28న కన్నేపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకు వస్తారు. అదే రోజు కొండాయి నుండి గోవిందరాజులును, పూనుగుండ్ల నుండి పడిగిద్దరాజులను గద్దెలపై ప్రతిష్టింప చేస్తారు. రెండవ రోజున 29నసమ్మక్కను చిలుకల గుట్ట నుండి పూజార్లు తీసుకోని వచ్చి గ్దదెపై ప్రతిష్టింప చేస్తారు. మూడో రోజున శుక్రవారం పూర్తి మొక్కుల చెల్లింపు, నాలుగవ రోజు సాయంత్రం

మిగతా 2లో..



## యుద్ధం ఇప్పుడే మొదలైంది

- ముంబయిని తాకట్టు పెట్టాలని చూస్తున్నారు
- మహాయతి కుట్ర పూరిత గెలుపు
- భాజపాపై ఉద్ధవ్ ఠాక్రే ఆగ్రహం



**ముంబై(జనంసాక్షి):** యుద్ధం ముగియలేదని.. ఇప్పుడే మొదలయ్యిందని శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. బిజెపి వారి కుట్రలను త్వరలోనే బయటపెడతామన్నారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికంగా బలంగా ఉన్న పవార్, ఠాక్రే కుటుంబాలను వెనక్కి నెట్టి భాజపా నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తమ కార్యకర్తలతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో అవకతవకలు జరిగినందువల్లే భాజపా గెలుపొందిందని ఆరోపించారు. కుట్రపూరితంగా, అక్రమంగా విజయం సాధించిందన్నారు. ముంబయిని పూర్తిగా తాకట్టు పెట్టాలని ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఈ ఒక్క గెలుపుతో తమను నిర్వీర్యం చేశామని భాజపా నేతలు భావిస్తున్నారని,

మిగతా 9లో..



తెలంగాణ సంగీత నాటక అకాడమి ఆధ్వర్యంలో హైదరాబాద్ చౌమహల్లా ప్యాలెస్‌లో అనిత సింఫ్నీ గజల్ ,సంగీత విభావరి కార్యక్రమం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు.

## నేడు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో సీఎం పర్యటన

**వరంగల్(జనంసాక్షి):**ఖమ్మం వరంగల్ జిల్లాల్లో సిఎం రేవంత్ రెడ్డి నేడు పర్యటించనున్నారు. ఖమ్మంలో సిపిఐ వందో వార్షికోత్సవంలో పాల్గొననున్నారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతారు. మద్దులపల్లిలో జెఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపనతో పాటు, నర్సింగ్ కాలేజీని ప్రారంభిస్తారు. వ్యవసాయ మార్కెట్ ప్రారంభంతో పాటు మున్నేరు లింక్ కెనాల్ ప్రారంభిస్తారు. కూసుమంచిలో వందపడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తారు. ఇకపోతే వరంగల్ పర్యటనలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. మేడారంలో అమ్మవారి గద్దెలను ప్రారంభిస్తారు. అనంతరం మేడారంలో కేబినేట్ భేటీ ఉంటుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రులంతా అక్కడికి చేరుకుంటారు. మేడారంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఇప్పటికే పరిశీలించారు. జాతర పనులు తుది దశకు చేరుకున్నాయని ఆమె వెల్లడించారు. ఆ తల్లుల దర్శనం కోసం అన్నివర్గాల ప్రజలు ఈ జాతరకు తరలివస్తారన్నారు. దాదాపు రెండు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని సీతక్క చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామని వివరించారు. మేడారం భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందన్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డికి.. సమ్మక్క సారలమ్మ తల్లులతో ఎంతో భావోద్వేగ బంధం ఉందని గుర్తుచేశారు. అందుకే రూ.260 కోట్లతో మేడారం అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పుకొచ్చారు. జనవరి 18న మేడారంలో దేవాలయాన్ని ప్రారంభించేందుకు సీఎం విచ్చేయనున్నారని తెలిపారు. ఇక్కడే కేబినెట్ సమావేశం సైతం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేబినేట్‌లో పలు కీలక అంశాలు చర్చించనున్నారు. అలాగే మున్సిపల్ ఎన్నికలపైనా చర్చిస్తారని సమాచారం. ఇకపోతే మేడారం వాట్సప్ చాట్ బాత్‌తోపాటు మొబైల్ యాప్‌నూ విడుదల చేశారు. వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో హెల్త్ క్యాంప్, టాయిలెట్ బాక్సులు, రూట్ మ్యాప్‌లు, ట్రాఫిక్ అప్‌డేట్‌లు, సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక వ్యవస్థ, నీటి సౌకర్యం తదితర అన్ని సౌకర్యాల సమాచారం కోసం వాట్సాప్ నంబర్ 7658912300 అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సీతక్క వివరించారు.

## సికింద్రాబాద్ అస్తిత్వం దెబ్బతీసేందుకు కుట్ర

మొత్తం మా పార్టీకి చెందిన వార అన్నారు. సికింద్రాబాద్లో పుట్టిన బిడ్డలుగా సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడాలని పోరాటం చేస్తున్నారు.. అధికారం ఇచ్చింది పట్టణాల అస్తిత్వాలను ప్రజల అస్తిత్వాలను గుర్తు లేకుండా చేరుపడం కోసం కాదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.. 'అధికారం ఇచ్చింది గ్యారెంటీలను అమలు చేయడానికి అధికారం ఇచ్చింది ప్రజలు వారికి మంచి చేయాలని.. కానీ ఇలాంటి ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేయడం లేదు.. హైదరాబాద్ నగరంలో రెండు సంవత్సరాలుగా ఒక్క ఇటుక కూడా పెట్టలేదు.. ఒక్క రోడ్డు కూడా వేయలేదు ఒక ఇల్లు కూడా కట్టలేదు.. కానీ నగరం మొత్తం తన విధ్వంసం ప్రణాళికలతోని ముందుకు పోతున్నారు.. ఈరోజు శాంతి ర్యాలీ పేరుతో సికింద్రాబాద్ ప్రజలు ప్రజాప్రతినిధులు ఒక కార్యక్రమాన్ని శాంతియుతంగా చేపట్టారు.. ప్రజల కోరిక మేరకు ప్రజాప్రతినిధులని కోరిక మేరకు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి వెళ్తామని సిద్ధంగా ఉన్నాం.. కానీ నిన్న రాత్రి వరకు అనుమతి ఉందని చెప్పి, ఇప్పుడు అనుమతి లేదని చెప్పి వేలాది మందిని కార్పొరేటర్లను, మాజీ కార్పొరేటర్ లను పార్టీ సీనియర్ నాయకులను సాధారణ ప్రజలను ఎక్కడికి అక్కడ అరెస్టు చేశారు.. ఇంత అరాచకంగా అక్రమంగా పనిచేస్తున్న ప్రభుత్వం అధికారం శాస్వతంగా కాదని గుర్తుపెట్టుకోవాలి.. ఇప్పుడున్న పదవిలో ఎల్లకాలం కొనసాగరని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాసయాదవ్, కాలె యాదయ్య, కెపి వివేకానంద, ఎమ్మెల్సీలు దేశపతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఎస్ అధికారుల బదిలీ

రాహుల్ హెగ్డే (హైదరాబాద్ సిటీ ట్రాఫిక్-3 డీసీపీ), అపూర్వారావు (ఇంటెలిజెన్స్ ఎస్పీ), బి.బాలస్వామి (విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ), వెంకటేశ్వర్లు అవినాష్ కుమార్ (క్రైమ్స్, డీసీపీ)గా బదిలీ అయ్యారు.

## వనజాతరకు వెళాయే..

దేవ దేవతలను తిరిగి వన ప్రవేశం చేస్తారు. వంశపారంపర్యంగా వస్తున్న ఆదివాసులే పూజార్లు కావడం ఈ జాతర పూర్తిగా ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం నిర్వహించడం ప్రత్యేకత. తమ కోర్కెలు తీర్చమని భక్తులు అమ్మవార్లకు బంగారం (బెల్లము) నైవేద్యంగా సమర్పించుకుం టారు. తెలంగాణ రాష్ట్రంలో ములుగు జిల్లాలో జరిగే అతిపెద్ద, విశిష్ట ఆదివాసిల జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రతి రెండు సంవత్సరాల కొకసారి జరుగుతుంది. ఈ సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్టాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి సుమారు కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇది ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరొందింది. 12వ శతాబ్దంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాతంలోని పొలవాసను పాలించే ఆదివాసి దొర మేడరాజు ఏకైక కుమార్తె సమ్మక్కను ఆయన మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజు కిచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు సారలమ్మ, జంపన్న ఇద్దరు సంతానం. కాకతీయులకు ప్రతీ సంవత్సరం చెల్లించే కప్పం కట్టలేదన్న కారణంతో కాకతీయ ప్రభువు మొదటి ప్రతాపరుద్రుడు పొలవా సపై దండెత్తుతాడు. ఆయన దాడికి తట్టుకోలేక మేడరాజు మేడారం పోయి అజ్ఞాత వాసం గడుపుతుంటాడు. మేడారాన్ని పాలించే పగిడిద్దరాజు కాకతీయుల సామం తునిగా వుంటూ కరువు కాటకాల కారణంగా కప్పం కట్టలేక పోతాడు. కప్పం కట్టకపోవడం, మేడరాజుకు ఆశ్రయం కల్పించడం, కోయ ఆదివాసిల సార్వభౌమునికి వ్యతిరేకంగా తిరుగుబాటు భావాజాలాన్ని నూరిపోసి రాజ్యాధికారాన్ని ధిక్కరిస్తున్నాడనే కారణాలతో పగిడిద్దరాజుపై ఆగ్రహం చెందిన ప్రతాపరుద్రుడు అతడిని అణచివేయడానికి తన ప్రధానమంత్రి యుగంధరుడితో మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంపై దండెత్తుతాడు. సాంప్రదాయ ఆయుధాలు ధరించి పోరాడిన పగిడిద్దరాజు, సమ్మక్క, సారక్క, జంపన్న, గోవిందరాజులు విరోచితంగా పోరాటం చేసినప్పటికీ సుశిక్షుతులైన అపార కాకతీయ సేనల ధాటికి తట్టుకోలేక పగిడి ద్దరాజు, సార లమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు యుద్ధంలో మరణిస్తారు. పరాజయ వార్త విన్న జంపన్న అవమానాన్ని తట్టుకోలేక సంపెంగ వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడతాడు.

## పదేళ్లలో ఏం పూర్తి చేశారో చెప్పండి



భవన నిర్మాణాలు, నూతన నర్సింగ్ కళాశాల భవనం, , సమగ్ర అభివృద్ధికి పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంఖుస్థాపనలు చేశారు. 10 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గిరిజన బాలుర వసతి గృహ భవన నిర్మాణం, గిరిజన బాలుర వసతి గృహ భవన నిర్మాణాలకు శంఖుస్థాపనలు చేశారు. అనంతరం అక్కడే నిర్వహించిన బహిరంగసభలో పాల్గొని ప్రసంగించారు. ఆనాటి తెలంగాణ రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి ఒక్క కొత్త ప్రాజెక్టు అయినా పాలమూరు జిల్లాకు మంజూరు చేశారా అని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. ఈ జిల్లాలోని ప్రాజెక్టుల నిర్మాణంలో అర్ధాంతరంగా ఆగిపోయాయి అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు నారాయణపేట-కోడంగల్ ఎత్తిపోతల పథకం 2014 కంటె ముందే ఉమ్మడి రాష్ట్రంలో మంజూరు అయ్యాయాని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులను పది సంవత్సరాలలో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కాంట్రాక్టర్లకు 25 వేల కోట్ల రూపాయలు ఇచ్చారు తప్ప.. ఉదండాపూర్ రిజర్వాయర్ భూసేకరణకు నష్టపరిహారంకు పైసలు ఇవ్వలేదు. సంగంబండలో 12 కోట్ల ఇచ్చి ఒక బండ పగులగొట్టేందుకు ముందుకు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ బండ పగులగొట్టి పది వేల ఎకరాలకు, పది గ్రామాలకు నీరందించామన్నారు. కల్వకుర్తి శాసనసభ నియోజకవర్గంలో కృష్ణా నది జరాలు పారాలి.. మాడుగులకు నీళ్లు ఇచ్చేందుకు 75 కోట్ల రూపాయలు మంజూరు చేశామని, ఉదండాపూర్ రిజర్వాయర్ కు భూసేకరణకు నిధులు మంజూరు చేసి పనుల పురోగతి తీసుకువచ్చామన్నారు.




నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకం ఆశా మాశిగా రాలేదని... దివంగత నేత చిట్టెం నర్సిరెడ్డి అడుగుతే ఏడున్నర టీఎంసీలతో ఆనాడు 2014 లో 15 వంద కోట్ల రూపాయలుతో ఉమ్మడి రాష్ట్రంలో చివరి జీవోగా ఎత్తిపోతల పథకం తెచ్చుకున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి శాసనసభ్యులు, ఎంపీలు గెలిచినా ప్రాజెక్ట్ గురించి మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకా.. నారాయణపేట మక్తల్ కోడంగల్ ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేసి 96% భూమి పోయిన రైతులను ఒప్పించి, మెప్పించి నూటికి నూరు శాతం 100 రోజుల్లో నష్టపరిహారం ఇప్పించామన్నారు. ఈరోజు ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసి ప్రాజెక్ట్ కు అనుకూలంగా ఆమోదింప చేశామన్నారు. ఈ జిల్లా వాడిని కాబట్టే ఈ ప్రాంత సమస్యలు, రైతులు కష్టాలను అర్థం చేసుకొని జూరాల దగ్గర కొత్త బ్రిడ్జ్ నిర్మాణానికి 123 కోట్ల ను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆనాడు ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు ఏ ఒక్కరోజైనా కెసిఆర్ దగ్గరికి వెళ్లి ఈ ప్రాజెక్టులు పూర్తిచేయండని, పాలమూరుకు నిధులు ఇవ్వండని అడిగారా.. అడిగే ధైర్యం మీకున్నదా, కనీసం ఫామ్ హౌస్‌కు అయిన పోయారా అని ప్రశ్నించారు. ఇవాళ మేము వచ్చి పనులు చేస్తుంటే మమ్మల్ని తప్పులు పట్టే ప్రయత్నం చేయడమంటే చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆ చెత్త ప్రచారాన్ని మా మీద చేయడానికి మీరు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపీ డీకే అరుణ మద్దతుతో మహబూబ్‌నగర్ జిల్లాకు ఐఐఎం తీసుకురావాలి జిల్లాలోనే ఏర్పాటు చేసుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దగ్గరికి వెళ్లి తెలంగాణకు నిధులు సాధించుకునేందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర పంచడానికి భూములు లేవు... ఉచితంగా ఏమిచ్చినా అది శాశ్వతం కాదు.. విద్య ఒక్కటే శాశ్వతం అదే ఇస్తామన్నారు. పండిత్ జవహార్ లాల్ నెహ్రూ స్ఫూర్తితో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ మా మొదటి ప్రాధాన్యత అన్నారు.

## విద్యే సమాజంలో అత్యున్నత గౌరవాన్ని అందిస్తుంది

**జడ్చర్ల మండలంలో ట్రిబుల్ ఐటి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ**

జడ్చర్ల (జనంసాక్షి):విద్యార్థుల లక్ష్యం ఉన్నతంగా ఉండాలని.. ఆ లక్ష్య సాధన కోసం కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో కూడిన విద్యే మిమ్మల్ని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యతోనే ఉజ్వ ల భవిష్యత్ ఉందని, తెలంగాణ విద్యార్థులు ఐఏఎ స్ లు, ఐపిఎస్ లు కావాలని సూచించారు. అనాడు ఉమ్మడి జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణ తొలి ముఖ్యమంత్రి అయ్యారని, మళ్ళీ 75 సంవత్సరాల తర్వాత మన జిల్లా కు సీఎం గా అవకాశం వచ్చిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టబోయిన పల్లి వద్ద గల సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో శనివారం సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశు సంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, ఎంపీలు డీకే అరుణ, మల్లు రవి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ట్రిబుల్ ఐటీ క్యాంపస్ భవన నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన చేశారు.

## నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

- 1:1.5 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక
- ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- అనంతరం సెలక్షన్ లిస్ట్ విడుదల చేయనున్న బోర్డు
- భర్తీకానున్న 2,322 పోస్టులు

సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను శనివారం విడుదల చేసింది. రాత పరీక్షకు హాజరైన ప్రతి అభ్యర్థి సాధించిన మార్కులు, ఇతరత్రా వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. మొత్తం 2322 పోస్టులకుగానూ 1:1.5 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. ఈ లిస్టులో ఉన్న వారికి ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకూ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించి, అనంతరం సెలక్షన్ లిస్ట్ విడుదల చేయనున్నారు. వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుండగా, ఎవరెవరు ఎప్పుడు వెరిఫికేషన్‌కు రావాలనే వివరాలను వెబ్‌సైట్‌లో చూసుకోవాలని బోర్డు సూచించింది. 2024లో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, ఇప్పుడు మరో 2322 పోస్టులను భర్తీ చేస్తోంది. దీంతో ప్రభుత్వ హాస్పిటళ్లలో నర్సింగ్ ఆఫీసర్ల కొరత పూర్తిగా తీరిపోనుంది. రికార్డు స్థాయిలో నియామకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైద్యారోగ్య శాఖలో ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రి దామోదర్ రాజనర్సింహా బాధ్యతలు చేపట్టిన తర్వాత రికార్డు స్థాయిలో 9,572 పోస్టుల భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం భర్తీ పూర్తయిన వాటితో సరిపెట్టుకోకుండా, 2026లో మరో 7,267 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ వేగవంతం చేసింది. ఇందులో నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫీమేల్) పోస్టులు, స్పెషలిస్ట్ డాక్టర్లు (టీవీవీపీ) పోస్టులు, ఫార్మసిస్టులు (గ్రేడ్-2) పోస్టులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, డెంటల్ అసిస్టెంట్ సర్జన్, తదితర పోస్టులు ఉన్నాయి. నాడు 18 వేలకుపైగా ఖాళీలు ప్రభుత్వ హాస్పిటళ్లలో సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నది రేవంత్ సర్కార్ లక్ష్యం. ఇప్పటివరకు భర్తీ చేసినవి, ప్రస్తుతం ప్రక్రియలో ఉన్నవి కలుపుకుని ఈ ఏడాది జూన్ నాటికి సుమారు 16,839 పోస్టులు భర్తీ కానున్నాయి. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కార్, 2020లో కోవిడ్ వచ్చే వరకూ అసలు ప్రభుత్వ వైద్య వ్యవస్థను పట్టించుకోలేదు. కోవిడ్‌లో ప్రభుత్వ హాస్పిటళ్ల డొల్లతనాన్ని ప్రజలు సోషల్ మీడియా వేదికగా ఎండగట్టడం, ప్రతిపక్షాల నుంచి తీవ్రమైన విమర్శలు రావడంతో.. చివరి మూడు సంవత్సరాలు హాస్పిటళ్ల అప్‌గ్రెడేషన్‌కు భారీగా జీవోలు ఇచ్చారు. అక్కడక్కడ కొత్త భవనాల నిర్మాణ పనులను మొదలు పెట్టి, పూర్తి చేయలేకపోయారు. ఇక డాక్టర్లు, సిబ్బంది రిక్రూట్‌మెంట్ సంగతి అసలు పట్టించుకున్న పాపాన పోలేదు. వెరసి 2023 డిసెంబర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి, ప్రభుత్వ హాస్పిటళ్లలో ఖాళీ పోస్టుల సంఖ్య 18 వేలు దాటింది. అనంతరం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో, ఆరోగ్యశాఖ మంత్రిగా సీనియర్ నాయకుడు దామోదర్ రాజనర్సింహ బాధ్యతలు తీసుకున్నారు.

## బంగ్లాలో ఆగని హింస

**మరో హిందూ యువకుడి దారుణ హత్య**

**ఢాకా(జనంసాక్షి):**బంగ్లాదేశ్‌లో మైనారిటీలే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. తాజాగా మరో హిందువును కారుతో తొక్కించి మరీ దారుణంగా హత్య చేశారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. మీడియా కథనాల ప్రకారం రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా (30) పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బిఎన్‌పి) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హషేమ్ పెట్రోల్ కోసం వచ్చాడు. పెట్రోల్ కొట్టించుకున్నాక డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించాడు. రిపోన్ డబ్బు ఇవ్వాల్సిందిగా హషేమ్‌ను అడగ్గా అతడిపైకి కారుతో దూసుకెళ్లాడు. కారు తనపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాల పాలైన రిపోన్ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అబుల్ హషేమ్‌ను, అతడి కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గణతంత్ర దినోత్సవ వేళ రాష్ట్రాలకు హై అలర్ట్

రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఉగ్రమూకలు గగనతలం నుంచి డ్రోన్ల ద్వారా దాడులు జరిపే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని ముఖ్య ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ నిఘా పెంచారు అధికారులు. ఇప్పటికే సుమారు 50,000 మందికి పైగా పోలీసులు, 65 కంపెనీల పారామిలిటరీ దళాలు ఢిల్లీలో మోహరించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల భద్రతా బలగాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో పేర్కొంది.

## జీవితంలో సంగారెడ్డిలో పోటీ చేయను..

**ఇదే నా శపథం: జగ్గారెడ్డి**

**సంగారెడ్డి(జనంసాక్షి):**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సంగారెడ్డికి పిలిచి ఇన్సల్ట్ చేశానేమోనని తాను ఫీల్ అయ్యానని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తన కోసం రాహుల్ గాంధీ సంగారెడ్డికి వచ్చి.. తనను గెలిపించాలని ప్రచారం చేస్తే ఇక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సంగారెడ్డిలో తాను ఎమ్మెల్యేగా జీవితంలో పోటీ చేయనని శపథం చేశారు. ఇళ్ల జాగా లేని పేదలతో సంగారెడ్డిలోని గంజి మైదానంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ తన భుజంపై చేయి వేసి జగ్గారెడ్డిని గెలిపించాలని అడిగితే.. ఇక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు.తన జీవితంలో ఇది మరిచిపోలేనిదని అన్నారు. తన ఓటమికి కారణం పేద ప్రజలు కాదని.. ఇక్కడి మేధావులు.. పెద్దలు అని పేర్కొన్నారు. సంగారెడ్డిలో తన భార్య నిర్మల పోటీ చేసినా.. తాను ప్రచారానికి కూడా రానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తా కానీ.. సంగారెడ్డిలో మాత్రం చేయనని తేల్చి చెప్పారు.

## ఎటు చూసినా ఆందోళనలే

### ఇరాన్ అల్లర్ల వెనుక ట్రంప్

పలువురు భారతీయులు దిల్లీకి చేరుకున్నారు. అనంతరం వారు ఇరాన్‌లో పరిస్థితుల గురించి మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌లో ఎక్కడ చూసినా ఆందోళనకారులే ఉన్నారని.. ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితులే లేవన్నారు. వీధుల్లో నిరసనకారుల మృతదేహాలు, ప్రజల హాహాకారాలతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు.ఇంటర్నెట్ సదుపాయం నిలిపివేయడంతో తమ పరిస్థితిని కుటుంబసభ్యులకు వివరించే అవకాశం లేక తీవ్ర భయాందోళనకు గురయ్యామన్నారు. విదేశాంగశాఖ అధికారులను సంప్రదించడానికి కూడా వీలు కాలేదన్నారు. ఈ రెండు వారాలపాటు క్షణమొక యుగంలా గడిచిందన్నారు. తిరిగి భారత్‌కు వస్తామనుకోలేదని.. ఇటువంటి క్లిష్ట సమయంలో తమను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. తమ వారి కోసం విమానాశ్రయానికి చేరుకున్న కుటుంబసభ్యులు మాట్లాడుతూ.. చాలా రోజులుగా తమ వారితో ఎటువంటి సంప్రదింపులు లేవన్నారు. ఇరాన్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో వారి పరిస్థితిపై తాము ఆందోళన చెందామని.. కానీ మోదీ ప్రభుత్వం చొరవతో తమ కుటుంబసభ్యులు తిరిగి వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇరాన్‌లో ప్రస్తుతం 10 వేలమందికి పైగా భారతీయులు (విద్యార్థులు సహా) నివసిస్తున్నట్లు అంచనా. వివిధ ప్రాంతాల్లో ఉన్న వీరిని సంప్రదించేందుకు టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయ సిబ్బంది ప్రయత్నాలు చేస్తోంది. అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడం, మరి కొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు పనిచేస్తుండడం ఇందుకు ఇబ్బందికరంగా మారినట్లు తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారిని చేరుకునేందుకు ఎంబసీ సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అందుబాటులో ఉన్న మార్గాల్లో దేశాన్ని వీడాలని విదేశాంగ శాఖ వారికి సూచించింది. స్వదేశానికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నవారిని సురక్షితంగా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోంది. తీసుకెళ్లాలని అనుకోవడం లేదన్నారు. నేరుస్థుల్లో విదేశీయులూ ఉన్నారన్నారు. నేరస్థులెవరినీ విడిచిపెట్ట బోమని, కేసులను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

**3 వేల మంది మృతి..**

ఆందోళనల్లో పాల్గొన్న వారిలో దాదాపు 800 మందికి ఇరాన్ మరణశిక్ష అమలు చేస్తుందనే వార్తలు వచ్చాయి. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో గల్ఫ్ దేశాలు జోక్యం చేసుకోవడం తదితర పరిణామాల తర్వాత ఇరు దేశాలు వెనక్కి తగ్గినట్లు కనిపించింది. ఈ నేపథ్యంలో ఖమేనీ స్పందిస్తూ అమెరికాపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు ఇరాన్ హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3వేలకు పైగా మరణించినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.

## బెంగాల్ అభివృద్ధికి మమతే ప్రధాన అడ్డంకి

- తృణమూల్‌ను సాగనంపే సమయం వచ్చింది
- చొరబాటు దారులకు ఆ పార్టీ అండతో నష్టం
- అవినీతి కారణంగా ప్రజలకు చేరని పథకాలు
- బీహార్ తరవాత ఇప్పుడు బెంగాల్ వంతు
- మాల్దా సభలో ప్రధాని మోడీ

**కోల్‌కతా(జనంసాక్షి):**బెంగాల్ ప్రజల పట్ల ఏమాత్రం కనికరం లేని అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇక్కడి చొరబాట్లకు తృణమూల్ అండగా నిలవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. బీజేపీ అభివృద్ధి మోడల్‌ను జెన్‌జీ తరం విశ్వసిస్తోందని.. ఈసారి బెంగాల్ ప్రజలు మార్పు కోరుతూ బీజేపీకి పట్టం కడతారనే నమ్మకం తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. బృహన్ ముంబై ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం అనంతరం తొలిసారి పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రథమార్ధంలో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. రాష్ట్రంలో అవినీతి కారణంగా కేంద్ర పథకాల ప్రయోజనాలు.. పేద ప్రజలకు చేరడం లేదని ప్రధాని ఆరోపించారు. బెంగాల్‌లోని పేదలందరికీ సొంత ఇళ్లు, ఉచిత రేషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలన్నదే తన కోరిక అని అన్నారు. పేద ప్రజల కోసం పంపిన సొమ్ములను టీఎంసీ నేతలు లూటీ చేస్తున్నారన్నారు. 'టీఎంసీ ప్రభుత్వం నాకు, బెంగాల్ ప్రజలకు శత్రువుగా మారుతోంది' అని తీవ్రంగా ఆక్షేపించారు మోదీ. బెంగాల్ విజన్‌తోనే 2047 నాటికి అభివృద్ధి భారత్ విజన్ సాకారమవుతుందని ప్రధాని అన్నారు. ఒడిశా, త్రిపుర, అస్సాం, బిహార్‌లో బీజేపీ వరుస విజయాలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు బెంగాల్‌లో సుపరిపాలనకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ఇటీవల చారిత్రక విజయం



సాధించిందని, ముఖ్యంగా ముంబై పురపోరు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిందని గుర్తుచేశారు. 'ఈసారి బెంగాల్లో మార్పు అవసరముందని నేను చెబుతాను.. బీజేపీ సర్కార్ కావాలి' అని మీరు చెప్పండి.. అంటూ సభికులను మోదీ ఉత్సాహపరిచారు. కేంద్ర పథకాలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని అడ్డుకోవడంపై విమర్శలు గుప్పిస్తూ.. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అడ్డుకున్న ఏకైక రాష్ట్రం బెంగాల్ అని, పేద ప్రజలకు ఎలాంటి పథకాలు అందనీయడం లేదని మోదీ చెప్పారు. ఇలాంటి క్రూర ప్రభుత్వానికి గుడ్‌బై చెప్పే సమయం వచ్చిందన్నారు. మాల్దాలో ఫ్యాక్టరీలు లేకపోవడంతో మాల్దా, ముర్షిదాబాద్ ప్రజలు ఉద్యోగాల కోసం వలసలు వెళున్నారని, మామిడి రైతులు ప్రభుత్వ విధానాలు, వరదల సమయంలో చూపిస్తున్న నిర్లక్ష్యంతో ఎంతో నష్టపోతున్నారని అన్నారు. గంగా, ఫులాహార్ నదీ తీర కోత కారణంగా వేలాది మంది ఇళ్లు కోల్పోయారని, రక్షణ గోడ కోరుతూ ప్రజలు చేస్తున్న ఆర్తనాదాలను టీఎంసీ సర్కార్ ఖాతారు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం పంపిన వరద సహాయక నిధులు లబ్దిదారులకు చేరలేదని కాగ్ నివేదకలు కూడా చెబుతున్నాయని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ అనుచిత విధానాలకు స్వస్తి చెప్పి, వరదల నివారణకు సమగ్ర పరిష్కారం కల్పిస్తామని, మామిడి సాగు చేసే మాల్దా రైతుల కోసం కోల్డ్ స్టోరేజీ సౌకర్యం కల్పించి ఆర్థికంగా బలపడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని, బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే భాజపా ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. బిహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని.. వీటి కారణంగానే మాల్దా, ముర్షిదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని, వీటిని అరికట్టడానికి తృణమూల్ కాంగ్రెస్ ఎటువంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40 సార్లు అందించామని, అయినా అవి అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్రం నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతోందని.. ఆ పార్టీ అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే పార్టీ అని అన్నారు. టీఎంసీ అధికారం కోల్పోయి.. భాజపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తూర్పు భారత్ దశాబ్దాలుగా వెనకబడి ఉందన్నారు.

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

మరో ముగ్గురిని గుర్తించాల్సి ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో భౌగోళిక పరిస్థితులు క్లిష్టంగా ఉండటంతో బలగాలు వెనక్కి తిరిగి వచ్చిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఎస్పీ తెలిపారు.

# కృష్ణానగర్‌లో పేలిన వాషింగ్ మెషిన్

- పేలుడు ధాటికి ముక్కలైన మెషిన్



హైదరాబాద్, జనవరి 17 (జనంసాక్షి) : నగరంలో వాషింగ్ మెషిన్ పేలుడు ఘటన కలకలం రేపింది. ఇటీవల.. అమీర్‌పేటలోని ఓ ఇంట్లో వాషింగ్ మెషిన్ పేలిన ఘటన మరువక ముందే కృష్ణానగర్‌లో అలాంటి ఘటనే చోటు చేసుకుంది. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో రన్నింగ్‌లో ఉన్న వాషింగ్ మెషిన్ ఒక్కసారిగా పేలింది. బట్టలు ఉతకేందుకు.. మెషిన్ ఆన్ చేసి ఉంచగా.. అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. రన్నింగ్‌లో ఉండగానే భారీ శబ్దంతో పేలిపోయింది. పేలుడు ధాటికి ఆ వాషింగ్ మిషన్ ముక్కలు ముక్కలైంది. అయితే.. ఘటనా సమయంలో వాషింగ్ మెషిన్ దగ్గర ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పేలుడు ప్రభావంతో ఇంట్లోని వస్తువులు దెబ్బతిన్నాయి. ఒక్కసారిగా వాషింగ్ మెషిన్ పేలడంతో ఇంట్లోని వారు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కాగా.. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు హైదరాబాద్‌లో తరుచుగా చోటు చేసుకున్న విషయం తెలిసిందే. గత నవంబర్‌లోనూ అమీర్‌పేట్‌లోని ఒక ఇంటి బాల్కనీలో వాషింగ్ మెషిన్ రన్నింగ్‌లో ఉండగా భారీ శబ్దంతో పేలి తునాతునకలైంది. ఆ ఘటనలోనూ ఎవరూ మెషిన్ దగ్గర లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అలాగే.. డిసెంబర్ 2025లో ఎస్ఆర్ నగర్ పరిధిలో వాషింగ్ మెషిన్ పేలిన ఘటనలో కంపెనీపై కేసు నమోదైంది. ఇలా తరచుగా వాషింగ్ మెషిన్‌లు పేలుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్న పరిస్థితి నెలకొంది.

# వార్డుల రిజర్వేషన్లపై ఉత్కంఠ

- ఆయా వార్డులపై నేతల్లో ఆందోళన
- సమాచారం కోసం నేతలతో సంప్రదింపులు

కామారెడ్డి, జనవరి17 (జనంసాక్షి): ఉమ్మడి జిల్లా మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సందడి మొదలైంది. నిజామబాద్ జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యింది. అయతే వార్డులు, ఇతర మున్సిపాలిటీల వివరాలు అందాల్సి ఉంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు రిజర్వేషన్లపై ఆందోళన చెందుతున్నారు. గతానికి భిన్నంగా ఇప్పుడు రిజర్వేషన్లు కేటాయించే అవకాశం ఉండడంతో తమకు కలిసి వస్తుందో లేదోనని ఉత్కంఠకు గురవుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అధికారులు సోమవారం తుది ఓటరు జాబితాను ప్రకటించగా, ఇక రిజర్వేషన్ల ఖరారు మాత్రమే మిగిలి ఉండంతో అంతా ఎదురుచూశారు. ఇప్పుడు అవికూడా ఖరారు కావడంతో మెల్లగా రంగంలోకి దిగుతున్నారు. వారం రోజుల క్రితం ఓటరు జాబితా డ్రాఫ్ట్‌ను విడుదల చేసిన అధికారులు, సోమవారం ఫొటోలతో కూడిన తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురించారు. మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ల వివరాలు, బూత్‌లను ప్రకటించునున్నారు. ఓటర్లు, వార్డులు, పురుష, మహిళా ఓటర్ల వివరాలను ప్రకటించిన అధికారులు ఇప్పుడు రిజర్వేషన్లకు సంబంధించిన వివరాల సేకరణలో నిమగ్నమైనట్లు సమాచారం. ఉన్నతాధికారులు సమాచారం అడిగిన వెంటనే ఇవ్వడానికి వారు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన సమగ్ర సమాచారం తీసుకున్న రాష్ట్ర స్థాయి అధికారులు రాజధానిలోనే వాటిని ఖరారు చేయనున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో అమలుచేసిన రిజర్వేషన్లు, జనాభా లెక్కల సమాచారాన్ని క్రోడీకరించి నిబంధనల ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లను ప్రకటిస్తారని తెలుస్తున్నది.ప్రతి మున్సిపల్‌లో వార్డులకు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పటికే సంబంధిత జిల్లా అధికారులు తీసుకున్నారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు ఆయా మున్సిపాలిటీల్లో గత పాలక వర్గంలో ఉన్న రిజర్వేషన్లు, ఇప్పుడు ఉన్న ఓటర్ల వివరాల ఆధారంగా ఖరారు చేసే అవకాశం ఉన్నదని అధికారులు చెబుతున్నారు. ఆయా వార్డుల్లో పెరిగిన ఓటర్ల సంఖ్య, పెరిగిన కులాల వారీగా ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఇప్పటి రిజర్వేషన్లు ఉండనున్నాయి. పెరిగిన మున్సిపాలిటీల్లో వార్డుల సంఖ్య పెరుగుతుంది. దీని ఆధారంగా అక్కడ వార్డుల రిజర్వేషన్లు పూర్తిగా మారే అవకాశం ఉన్నదని అధికారులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో బీసీ, ఎస్సీ, ఎస్టీల వారీగా ఓటర్ల వివరాలను సేకరించడంలో అధికారులు బిజీగా ఉన్నారు.

# మంత్రి వివేక్ ఒంటెద్దు పోకడలు

- పార్టీకి రాజీనామా చేసిన కాంగ్రెస్ నేత



మంచిర్యాల, జనవరి17 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి పార్టీలో ఒంటెద్దు పోకడలు, ఏకపక్ష నిర్ణయాలు, నియంత పరిపాలన తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొంటూ కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. త్వరలో తాను అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు రాజిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా రాజీనామాకు గల కారణాలను లేఖ ద్వారా వివరించారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, చెన్నూర్ మేనిఫెస్టోకు ఆకర్షితుడినై గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ , స్థానిక శాసన సభ్యుడు గడ్డం వివేక్ విజయానికి విశేష కృషి చేశానని తెలిపారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీలో ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. మంత్రి వివేక్ చెన్నూరు నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోలో ఒక్క హామీని నెరవేర్చ లేదని దుయ్యబట్టారు. దీనికి తోటు నియోజకవర్గంలో 45 వేల మంది యువకులకు ఉద్యోగాలు, మైనింగ్ ఇన్సిట్యూట్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, అగ్రిరీసెర్చ్ సెంటర్, అగ్రికల్చర్ మినీ యూనివర్సిటీ, కరకట్టల నిర్మాణం హామీ ముందడుగు పడలేదని వెల్లడించారు. ఎమ్మెల్యే వివేక్‌పై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత, వివేక్ విడుదల చేసి మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోవడంతోనే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

# ప్లానిటోరియం పునరుద్ధరణ పనులను పూర్తి చేయండి

- కమిషనర్‌తో కలిసి ప్లానిటోరియం పనుల పరిశీలన



వరంగల్ ఎంజీఎం, జనవరి 17(జనంసాక్షి): ప్లానిటోరియం పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు.శనివారం బల్దియా ఆవరణలో గల ప్లానిటోరియం అభివృద్ధి పనులను కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయుటకు అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా పనుల పురోగతి స్థితి గతులను మేయర్, కమిషనర్ లకు అధికారులు వివరిస్తూ మొత్తం పనులు చివరి దశకు చేరుకున్నాయని,ఇంటీరియర్ పనులు పూర్తి అయ్యాయని సివిక్ పనులు కూడా పూర్తి కావోచ్చాయని, 20 రోజుల్లో పనులు పూర్తి కానున్నాయని తెలుపగా మేయర్ మాట్లాడుతూ మిగతా పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఈ ఈ రవి కుమార్, డి ఈ లు రాజ్ కుమార్, రాగి శ్రీకాంత్, ఏ ఈ లు సంతోష్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌ను యూటీ చేస్తే..

# తెలంగాణ అస్తిత్వానికి దెబ్బ

- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమవుతుంది
- నగరాన్ని రెండో రాజధానిగా చేయాలనే ఆలోచనను విరమించుకోవాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తల డిమాండ్







హైదరాబాద్, జనవరి 17 (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం వెంటనే హైదరాబాద్‌ను రెండవ రాజధాని (యుటి)గా చేయాలనే ఆలోచనలను విరమించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గత రెండు, మూడు నెలలుగా వివిధ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం హైదరాబాద్‌ను రెండవ రాజధానిగా చేసి, కేంద్ర పాలిత ప్రాంతం (యు.టి)గా ప్రకటించేందు కావాల్సిన ఏర్పాట్లను చాపకింద నీరులా చకచకా చేసుకుంటూ పోతున్నట్లు చెప్పారు. అదే జరిగితే కొట్లాడి సాధించిన తెలంగాణ పూర్తిగా తన అస్తిత్వాన్ని కోల్పోనున్నదని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (టిఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ప్రొ. వినాయగ్రెడ్డి అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం వెంటనే హైదరాబాద్‌ను రెండవ రాజధాని (యుటి)గా చేయాలనే ఆలోచనలను విరమించుకోవాలి అనే అంశంపై ఖైరతాబాద్ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సామాజిక ఉద్యమకారుడు బక్క జడ్సన్, సిపిఐ (యం-యల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జెవి చలపతిరావు, సిపిఐ (యం-యల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి విజయ్, ఎంసిపిఐయు నాయకులు గాదగోని రవి, ఆరెస్పీ నాయకులు జానకిరాములు, టిఎస్‌ఎఫ్ నాయకులు నైనాల గోవర్ధన్, సిపిఐ (యం-యల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె. గోవర్ధన్, తెలంగాణ విద్యావంతుల వేదిక (టివివి) నాయకులు అంబటి నాగయ్య, పీడీయసు రాష్ట్ర అధ్యక్షులు మహేష్, బి. కొండల్రెడ్డి మాజి అధ్యక్షులు టిపిటిఎఫ్), సి. హెచ్, రాములు(రిటైర్డ్ లెక్చరర్), షెహబాజ్ అహ్మద్ఖాన్ (అసోసియేట్ ప్రొఫెసర్), ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సరళ, ప్రొ, వినయ్ బాబు, సయ్యద్ అజీం మరియు తెలంగాణ ఉద్యమ నాయకులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఎస్టీపీలో 70 శాతం ఆదాయం హైదరాబాద్ నుండే వస్తున్నది, దీనిని కొల్లగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకారమే ఈ చర్యలకు పూనుకుంటున్నటున్నదని అన్నారు. దీనిని తెలంగాణ ప్రజలు వ్యతిరేకిస్తారన్నారు. తెలంగాణ ఉద్యమం బలంగా ఉన్నప్పుడు, తెలంగాణ ఇచ్చే అవకాశం కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉందని తెలిసి, ఆంధ్రా పాలకవర్గాలు యు.టి.ని ప్రతిపాదించారు. యుటిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆంధ్రా లాబీని సంతృప్తి పరచడానికి 10 సంవత్సరాలు హైదరాబాదును ఉమ్మడి రాజధానిగా ప్రకటించారని వివరించారు. నేడు తెలంగాణకు గుండెకాయ అయిన రాష్ట్ర రాజధానిని తెలంగాణ నుండి వేరు చేసి తమ లాబీని, దోపిడీని కొనసాగించేందుకు కుట్ర సాగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. దీనిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రులు, కేంద్ర ప్రభుత్వ పెద్దలందరూ కలిసి యుటిగా చేసేందుకు పావులుకదుతున్నట్టు ఆరోపించారు. ఇదే గనక జరిగితే తెలంగాణ మరోసారి అగ్ని గుండంగా మారుతుందని హెచ్చరించారు. ఆనాడు బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పిన పరిస్థితులు వేరు నేడున్న పరిస్థితులు వేరని, అందుకే యుటీ ప్రతిపాదనను ఎవరూ అంగీకరించకూడదని కోరారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాల సంగతి ఇంకా తేలలేదన్నారు. ధనిక రాష్ట్రంగా వున్న తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టివేశారని అన్నారు. భూములను ఆక్రమిస్తూ కోట్ల రూపాయలు కాజేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని కార్పోరేటు శక్తులకు కట్టబెట్టడాన్ని నిరసించారు. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు, యువజనులు, సబ్బండ వర్గాలు, అన్ని రాజకీయ, వామపక్ష పార్టీలతో పాటు ప్రజాస్వామికవాదులు, కవులు, కళాకారులు పెద్దఎత్తున ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. తెలంగాణలోని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. యూటీ ఆలోచనకి వ్యతిరేకంగా పల్లె నుండి ఢిల్లీ దాకా నిర్మాణాత్మకమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరముందని తెలియజేశారు.

# పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




పరకాల, జనవరి 17 (జనం సాక్షి): పార్టీలకతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో పరకాల టౌన్, పరకాల,నడికూడ మండలాలకు చెందిన 123 మంది లబ్ధిదారులకు 1కోటి23 లక్షల 14వేల 268 రూ విలువ గల కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం కళ్యాణ లక్ష్మి ద్వారా 2576 మందికి 25కోట్ల 78లక్షల 98వేల816 రూ విలువగల చెక్కులను పంపిణీ చేశామని అన్నారు.పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని,కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడబిడ్డల పెళ్ళికి వరంగా మారిందన్నారు.పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు.పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని అన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆలస్యం అయ్యాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సకాలంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందేలా కృషి చేస్తున్నామని అన్నారు.పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని అన్నారు. అనంతరం పరకాల పట్టణ కేంద్రంలో అమరవీరుల భవనం నందు వయోవృద్ధుల డేకేర్ సెంటర్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల, నడికూడ తహసిల్దార్లు విజయలక్ష్మి, రాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# బదిలీపై అదనపు ఎస్పీ కాజల్ సింగ్



ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) : 23 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలలో భాగంగా జిల్లాకు చెందిన ఉట్నూరు అదనపు ఎస్పి కాజల్ సింగ్ బదిలీ అయ్యారు. గత సంవత్సరం జనవరి ఒకటవ తేదీన ఆదిలాబాద్ జిల్లాకు ఉట్నూర్ ఏఎస్పి గా బాధ్యతలను స్వీకరించిన కాజల్ సింగ్ సెప్టెంబర్ 19న అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది శనివారం జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ డిసిపి 2 గా బదిలీ అయ్యారు.

### కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో

# వైభవంగా త్రిశూల స్థానం



భీమదేవరపల్లి, జనవరి 17 (జనం సాక్షి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం, కొత్తకొండలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం భక్తిశ్రద్ధలతో పలు విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఖడ్గాలు, శూలాలతో పవిత్ర కోనేరు చేరుకుని పుష్కరార్చన గావించి త్రిశూల స్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సీఐ పులి రమేష్,ఎస్ఐలు రాజు, దివ్య పాల్గొన్నారు.దేవస్థానం చైర్మన్ బొజ్జపురి అశోక్ ముఖర్జీ,ఆలయ ఈవో కిషన్ రావు,కొలుగూరి రాజు,డబ్బా శంకర్, భగవాన్,ధర్మకర్తలు, ప్రజాప్రతినిధులు,ముఖ్య అర్చకులు మొగిలిపాలెం రాంబాబు,అర్చకులు వినయ్ శర్మ,ఆలయ సిబ్బంది రాజు తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# తండాలను గ్రామ పంచాయతీలు చేసి అభివృద్ధి చేసింది కేసీఆర్


- కాంగ్రెస్ ప్రభుత్వం తండాలలో చేసిన అభివృద్ధి శూన్యం
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



చెన్నారావుపేట, జనవరి 17 (జనంసాక్షి) : తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ అని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బాపునగర్ గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాపునగర్ గ్రామపంచాయతీ అభివృద్ధికి కావలసిన బీటీ రోడ్లను నేను మంజూరు చేస్తే ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తన సొంత కాంట్రాక్టు ఏజెన్సీ కోసం రోడ్లను రద్దు చేశాడన్నారు. నిధులను పోగేసుకుని పెద్ద రోడ్లుగా మార్చుకున్నాడని విమర్శించారు. చెన్నారావుపేట మండలంలోని ప్రతి తండా, గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యేగా నేను అహర్నిశలు కృషి చేశానన్నారు. తండాలలో ఐక్యంగా ఉన్న గిరిజనులను రాజకీయాల పేరుతో విడగొట్టి అభివృద్ధిని అడ్డుకుంటున్నదీ కాంగ్రెస్ పార్టీ అని ఎద్దేవా చేశారు. ఉద్యోగాల పేరుతో గిరిజనులను యువకులను మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి ఒక్క ఉద్యోగాన్ని కూడా గిరిజనులకు ప్రత్యేకంగా ఇవ్వలేకపోయిందన్నారు. రెండు సంవత్సరాలలో మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని తండాలను నేనే అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నే వెంకన్న, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్, మండల అధికార ప్రతినిధి కంది కృష్ణ చైతన్య, అమీనాబాద్ సొసైటీ మాజీ చైర్మన్ మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అనుముల కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి మాదారపు శ్రీనివాస్, మండల యూత్ ప్రెసిడెంట్ మంచోజు మనోజ్ కుమార్, మండల సీనియర్ నాయకులు జున్నుతుల మహేందర్ రెడ్డి, ములుక సాంబయ్య కవి, భూక్య శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచ్ బాదావత్ మంగమ్మ మేగ్య నాయక్, గ్రామ అధ్యక్షులు దప్పు వీరన్న, భూక్య కిషన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో మారుతి సుజుకీ భారీ పెట్టుబడి

- రూ.35 వేల కోట్లతో కొత్త కార్ల తయారీ పరిశ్రమ



గాంధీనగర్, జనవరి17 (జనంసాక్షి) : ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ గుజరాత్‌లో మరో ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. ఖోరజ్ వద్ద రూ.35 వేల కోట్ల వ్యయంతో కొత్త కార్ల తయారీ పరిశ్రమను నెలకొల్పనుంది. ఏటా 10 లక్షల కార్ల తయారీ లక్ష్యంగా ఏర్పాటువుతున్న ఈ ప్లాంట్ ద్వారా 12 వేలమందికి నేరుగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇందుకోసం గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 1750 ఎకరాలను మారుతీ సుజుకీకి కేటాయించింది. గాంధీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఎండీ హితాచీ తకేయూచీ పెట్టుబడుల ధ్రువీకరణ పత్రాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు అందజేశారు. భారత ఆటోమొబైల్ హబ్స్‌లో గుజరాత్ ఒకటిగా నిలిచిందని, ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని సీఎం 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్-జపాన్ భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ, మారుతీ సుజుకీ ప్రతినిధులు పాల్గొన్నారు. 1983లో మారుతీ సుజుకీ దేశీయంగా తన కార్యకలాపాలను ప్రారంభించింది. హరియాణాలోని గురుగ్రామ్‌లో తొలి ప్లాంట్‌ను నెలకొల్పింది. తర్వాత తన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటూ వచ్చింది. గుజరాత్‌లో ఇది వరకే ఒక ప్లాంట్ నెలకొల్పిన ఆ కంపెనీ.. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కార్ల తయారీని చేపట్టేందుకు కొత్త ప్లాంట్ ఏర్పాటుకు పూనుకుంది. ఏటా 40 లక్షల కార్ల తయారీని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 17 మోడళ్లను 650 రకాల వేరియంట్లను మారుతీ దేశ, విదేశీ మార్కెట్లలో విక్రయిస్తోంది. 2025లో 22.55 లక్షల కార్లను మారుతీ ఉత్పత్తి చేసింది.

**CHANGE OF NAME**

I, Sudhagoni Sarvaiah Goud S/o Rajaiah GoudR/o Ramnagar, Karimnagar, Telangana-505001 have changed my name from S Sarvaiah to Sudhagoni Sarvaiah Goud vide Affidavit dated 16/01/2026.

**CHANGE OF NAME**

I, Sudhagoni Devamma W/o Sudhagoni Sarvaiah GoudR/o Ramnagar, Karimnagar, Telangana-505001 have changed my name from S Devamma to Sudhagoni Devamma vide Affidavit dated 16/01/2026.

# పౌరసత్వ హక్కుల చోరీయే సర్ లక్ష్యమా?

**ఉత్తరప్రదేశ్‌లోని బులంద్ షహర్ జిల్లా అధికార యంత్రాంగం ఈ గురువారం ఒక దర్యాప్తు ప్రారంభించింది. ప్రతి చోటా ప్రభుత్వ పనుల్లో ఎక్కడో ఏదో ఒక అవకతవకో, అవినీతో, అక్రమమో జరిగిందనే వార్త బైటికి పొక్కడమూ, దాని మీద జిల్లా అధికార యంత్రాంగం లేదా ఇంకా పై అధికారులు దర్యాప్తుకు ఆదేశించడమూ మామూలే. కాని ఈ ప్రత్యేక సందర్భం తీగ లాగితే డొంక కదులుతుంది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కసరత్తు తర్వాత విడుదల చేసిన ముసాయిదా వోటర్ల జాబితాలో అవకతవకలున్నాయనే ఫిర్యాదు నిజానిజాలు తేల్చడం ఈ దర్యాప్తు లక్ష్యం.**

జిల్లాలోని షికార్‌పూర్ తహసీల్‌లో పహాసు అనే చిన్న పట్టణంలో పఠాన్‌టోలా అనే బస్తీ ఉంది. ఆ బస్తీవాసులు చాలా మంది ఈ ముసాయిదా జాబితాలో తమ పేర్లు గల్లంతయ్యాయని, తమ ఇళ్ల నంబర్ల మీద తమకు తెలియని ఎవరెవరి పేర్లో ఉన్నాయని ఫిర్యాదు చేశారు. ఆ బస్తీవాసి సాగిర్ ఖాన్ జిల్లా అధికారులకు ఒక లిఖిత పూర్వక ఫిర్యాదు ఇచ్చాడు. సర్ ప్రక్రియ జరగక ముందు వోటర్ల జాబితా కచ్చితంగా ఉండిందని, కాని గత నెల జరిపిన సర్ ప్రక్రియ తర్వాత ప్రచురించిన ముసాయిదా జాబితాలో 56 మంది హిందువుల పేర్లు కొత్తగా వచ్చాయని, అవి కూడా అరడజను ముస్లిం గృహాల ఇంటి నంబర్ల మీద ఉన్నాయని ఆయన ఫిర్యాదులో రాశాడు.

"మా బస్తీలో కనీసం ఎనిమిది ఇళ్ల నంబర్ల మీద వోటర్ల సంఖ్యలో అనూహ్యమైన పెరుగుదల ఉంది. ఇంటి నంబర్ 125 అనే నా సొంత ఇంటిలోనే ఏడు కొత్త పేర్లు చేరాయి. ఆ ఏడూ కూడా హిందువుల పేర్లే. మరొక ఎనిమిది ఇళ్లలో కూడా ఇటువంటి పెరుగుదల ఉంది. మొత్తం మీద మా ప్రాంతంలో 56 కొత్త పేర్లు వచ్చి చేరాయి" అని ఆయన రాశాడు. ఈ ఫిర్యాదు తర్వాత షికార్ పూర్ సబ్ డివిజనల్ మెజస్ట్రేట్ అరుణ్ కుమార్ ఈ వోటర్ల జాబితా అవకతవకలను ఫామ్ 8 (వోటర్ల జాబితాలో సవరణ కోరుతూ సమర్పించే దరఖాస్తు) ద్వారా సవరిస్తున్నామని, సక్రమమైన ఫిర్యాదులన్నిటినీ అలా సవరిస్తామని అన్నారు. "దర్యాప్తు జరుపుతున్నాం. ఈ పనికి బాధ్యులైన అధికారుల మీద చర్యలు తీసుకుంటాం" అని కూడా ఆయన హామీ ఇచ్చారు. "ఇవి ముసాయిదా వోటర్ల జాబితాకు సంబంధించిన పొరపాట్లే తప్ప అంతకన్న ఎక్కువ కాదు" అని కూడా ఆయన కలిపారు. కాని "అంతకన్న ఎక్కువ", ఉద్దేశపూర్వకమైన మార్పులు చేర్పులు ఏమైనా జరిగాయా, జరుగుతున్నాయా, జరగబోతున్నాయా అనేదే ఇవాళ దేశం ముందున్న ప్రశ్న. ఇది కేవలం ఒక ఇంట్లో, ఒక కుటుంబంలో, ఒక బస్తీలో, ఒక గ్రామంలో, ఒక పట్టణంలో జరుగుతున్న సమస్య కాదు, ఇది దేశంలో మొత్తం ఎన్నికల వ్యవస్థను తలకిందులు చేసే ప్రశ్న. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామిక ఎన్నికలు మూలంలోనే, వోటర్ల జాబితా స్థాయిలోనే, అక్రమాల పునాది ఏర్పాటవుతున్నదా అనే ప్రశ్న.




అటువంటి పునాది మీద ఎటువంటి విషవృక్షాలు మొలిచి వటవృక్షాలుగా ఎదగబోతున్నాయి అనే ప్రశ్న. అందువల్ల మన సమాజ పాలన ప్రాతినిధ్య ప్రజాస్వామిక పద్ధతిలో కొనసాగుతుందా, అక్రమాలకు నిలయంగా మారుతుందా అనే ప్రశ్న.

ఆ ప్రశ్నకు జవాబు వెతికే ముందు మరొక రాష్ట్రంలో మరొక ఘటన కూడా చూడాలి. రాజస్థాన్ లోని జైపూర్ హవా మహల్ శాసనసభ నియోజకవర్గంలో ఒక బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఒ) గా ఉన్న కీర్తి కుమార్ "ఇలాగైతే నేను కలెక్టర్ ఆఫీసుకు వచ్చి అక్కడ ఆత్మహత్య చేసుకుంటాను" అని ఫోన్ లో అరుస్తున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల మీద మూడు నాలుగు రోజుల కింద కనబడడం మొదలయింది.

ఆ ఫోన్‌లో అవతల సురేష్ సైని అనే భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్ ఉన్నారు. "బహుశా నేను మొత్తం బస్తీ వోట్లు తొలగిస్తే మీకు తృప్తి కలుగుతుందేమో. అలాగైతే మహరాజ్ సులభంగా గెలుస్తారని మీరు అనుకుంటున్నారేమో" అని కూడా కీర్తి కుమార్ ఆ ఫోన్ సంభాషణలో అన్నాడు. 'మహరాజ్ఞ' అంటే ప్రస్తుత స్థానిక బిజెపి ఎంఎల్ఎ బాలముకుంద్ ఆచార్య. ముస్లిం వోటర్లు అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న హవామహల్ నియోజకవర్గంలో ఆయన 2023 ఎన్నికలలో 974 వోట్ల ఆధిక్యతతో గెలిచారు. ఆయన జైపూర్ లోని దక్షిణ్ ముఖీ బాలాజీ ఆలయ ప్రధాన పూజారి కూడా. ముస్లింలకు వ్యతిరేకంగా చేసిన అనేక పనులకూ, వ్యాఖ్యలకూ ఆయన ఇప్పటికే వార్తలకెక్కారు.

ఇప్పుడు రాజస్థాన్ లో జరుగుతున్న సర్ ప్రక్రియలో, ప్రచురించిన ముసాయిదా వోటర్ల జాబితా నుంచి 470 వోట్లు, అంటే ఆ బూత్ లో మొత్తం వోట్లలో 40 శాతం తొలగించమని తన మీద ఒత్తిడి వస్తున్నదని కీర్తి కుమార్ చెపుతున్నారు. స్థానిక పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ఈ బిఎల్ఒ తాను అప్పటికే పరీక్షించి ధృవీకరించిన వోటర్ల జాబితా నుంచి వందలాది పేర్లు తొలగించడం ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నిస్తున్నారు. అలా తొలగించమని తనను ఒత్తిడి చేస్తున్నవారు భారతీయ జనతా పార్టీ నాయకులని కూడా ఆయన చెపుతున్నారు. గత రెండు నెలలుగా రాజస్థాన్ లో సర్ ప్రక్రియ జరుగుతుండగా, అనేక మంది బిఎల్ఒ లు తమ మీద ఒత్తిడి గురించి ఫిర్యాదు చేస్తున్నారు. ఇటువంటి ఒత్తిడి వల్లనే ఇప్పటికే ముగ్గురు బిఎల్ఒ లు ఆత్మహత్య చేసుకోవడమో, గుండెపోటుతో మరణించడమో జరిగిందని వార్తలు వస్తున్నాయి. ఉత్తర ప్రదేశ్ నుంచి కూడా బిఎల్ఒలు పనిభారం, ఒత్తిడి గురించి ఫిర్యాదు చేస్తున్నారు.

అంటే మొత్తం మీద సర్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ సాధారణంగా జరిపే వోటర్ల జాబితా సవరణ ప్రక్రియ మాత్రమే కాదని ఈ వార్తలు తెలియజేస్తున్నాయి. పాత వోటర్ల జాబితా నుంచి మరణించినవారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లి, మరోకచోట వోటర్‌గా నమోదైనవారి పేర్లు, కమిషన్ కోరిన సమాచారం ఇవ్వనివారి పేర్లు తొలగించడం, కొత్తగా 18 ఏళ్లు నిండినవారి పేర్లు, కొత్తగా శాశ్వత నివాసం కోసం వలస వచ్చి, మరొకచోట జాబితా నుంచి పేరు తొలగించుకున్నవారి పేర్లు నమోదు చేయడం సర్ ప్రక్రియ ప్రకటిత లక్ష్యాలు. కాని ఇప్పటికి జరిగిన, జరుగుతున్న తతంగం, వినబడుతున్న ఆరోపణలు చూస్తే అధికార పార్టీ తనకు వోటు వెయ్యబోరని కచ్చితంగా అనుమానం ఉన్నవారి పేర్లు తొలగించడం, తాము దొంగ వోట్లు వేయించడానికి వీలుగా ఏవో కొన్ని అబద్ధపు పేర్లు జోడించడం చేయాలని బిఎల్ఒ ల మీద ఒత్తిడి తెస్తున్నది. పైన చెప్పుకున్నవి ఇటు ఉత్తరప్రదేశ్ నుంచీ, అటు రాజస్థాన్ నుంచీ ఈవారం వచ్చిన వార్తలు. కాని మొత్తంగా దేశంలో "అంతకన్న ఎక్కువ" జరిగిందనీ, జరుగుతున్నదనీ, జరగబోతున్నదనీ ఎన్నో ఆధారాలున్నాయి. బిహార్ సర్‌లో మొత్తం ఏడు కోట్ల అరవై ఆరు లక్షల వోటర్ల నుంచి యాభై ఎనిమిది లక్షల మంది వోటర్ల పేర్లను తొలగించి ఏడు కోట్ల ఎనిమిది లక్షల వోటర్లతో జాబితా తయారుచేసి ఎన్నికలు జరిపారు. తొలగించబడిన 58 లక్షల మందిలో ఏ మతానికి చెందిన వోటర్లు ఎందరో ఎన్నికల కమిషన్ బైట పెట్టలేదు గాని, స్వతంత్ర పరిశోధకులు పేర్లను బట్టి గుర్తించమని సాఫ్ట్ వేర్ ద్వారా అడగగా 25 శాతం ముస్లింలు కావచ్చునని తేలింది. అధికారికంగా తొలగించిన 3.66 లక్షల వోటర్లలో 34 శాతం ముస్లింలు అని తేలింది. దేశ జనాభాలో ముస్లింలు 14.2 శాతం, బిహార్ జనాభాలో ముస్లింలు 16.8 శాతం, మరి తొలగించబడినవారిలో 25 శాతం, 34 శాతం ఉన్నారంటే, వారి దామాషా కన్నా ఎక్కువ తొలగింపు జరిగిందన్నమాట. ఇదిఎలా జరిగిందో, ఎవరు చేయించారో, ఎవరు ఆదేశిస్తే తాను మౌనంగా అంగీకరించిందో ఎన్నికల కమిషన్ చెప్పాలి.

**దేశ జనాభాలో ముస్లింలు 14.2 శాతం, బిహార్ జనాభాలో ముస్లింలు 16.8 శాతం, మరి తొలగించబడిన వారిలో 25 శాతం, 34 శాతం ఉన్నారంటే, వారి దామాషా కన్నా ఎక్కువ తొలగింపు జరిగిందన్నమాట. ఇదిఎలా జరిగిందో, ఎవరు చేయించారో, ఎవరు ఆదేశిస్తే తాను మౌనంగా అంగీకరించిందో ఎన్నికల కమిషన్ చెప్పాలి.**

అలాగే కొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్ సర్ ప్రక్రియలో ముస్లింలు అత్యధికంగా ఉండే ప్రాంతాలలోనే సంజాయిషీ నోటీసులు ఎక్కువగా వస్తున్నాయి. ఉదాహరణకు జనాభాలో 66 శాతానికి పైగా ముస్లింలు ఉన్న ముర్షిదాబాద్ జిల్లాలో, 30 శాతానికి పైగా నోటీసులు అందుకున్నారు. మరొక పక్క జనాభాలో అతి తక్కువగా 8 శాతంగా ముస్లింలు ఉన్న బంకురా జిల్లాలో నోటీసులు అందుకున్న వోటర్లు 13 శాతానికన్న ఎక్కువ లేరు. రెండో దశలో, ఉత్తరప్రదేశ్ తో పాటు తమిళనాడు, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, కేరళ, గుజరాత్ లతో సహా పన్నెండు రాష్ట్రాలలో సర్ ప్రక్రియ సాగుతున్నది. ఈ దశలో మొత్తం 51 కోట్ల వోటర్లకు సంబంధించిన తుది జాబితాలు 2026 ఫిబ్రవరి నాటికి వెల్లడిస్తారు. బిహార్ ఉదాహరణ చూస్తే, ఈ 51 కోట్లలో ఐదారు కోట్ల మంది పేర్లను తొలగించవచ్చు. తమకు అనుకూలంగా ఉండరని, వోట్లు వెయ్యరని అనుమానం ఉన్న ముస్లింల మీద, దళితుల మీద, కొన్ని ప్రాంతాలలో బీసీల మీద ఎక్కుపెట్టి వారి వోటు హక్కును రద్దు చేయడానికి సంఘ్ పరివార్ చేస్తున్న ప్రయత్నమే సర్ అని ఇప్పటికే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ముస్లింల పౌరసత్వాన్ని అనుమానాస్పదం చేయడానికి తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర జాబితాల నాటి నుంచీ సంఘ్ పరివార్ ఈ ప్రయత్నాలు చేస్తున్నది. దేశవ్యాప్త ఆందోళనల వల్ల ఆ ప్రయత్నాల వేగం తగ్గినా, సర్ ద్వారా ఆ లక్ష్యం నెరవేర్చుకుంటున్నారు. దీనికి మూలం, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సిద్ధాంతవేత్త ఎంఎస్ గోల్వాల్కర్ 1939లో రాసిన 'వి ఆర్ అవర్ నేషన్ హుడ్ డిఫైన్డ' పుస్తకంలో ఉంది. ఆయన మాటలు చూడండి: "హిందుస్థాన్ లో నివసించే విదేశీ జాతులు హిందూ సంస్కృతినీ, భాషనూ అలవరచుకోవాలి. హిందూ మతాన్ని గౌరవించాలి, ఆరాధించాలి. హిందూ దేశపు హిందూ జాతినీ, సంస్కృతినీ ప్రశంసించడం మినహా మరే ఆలోచనా చేయగూడదు. హిందూ జాతిలో కలిసిపోవడానికి తమ ప్రత్యేక మనుగడను వదులుకోవాలి. అలా కాకుండా దేశంలో ఉండదలచుకుంటే, హిందూ జాతికి సంపూర్ణంగా లొంగిపోయి ఉండాలి. ఏమీ కావాలని కోరగూడదు. వారికి ఏ హక్కులూ దక్కవు. వారి పట్ల ప్రత్యేకంగా వ్యవహరించాలనడానికి-చివరికి పౌరులకు ఉండే హక్కులకు కూడా వీలు లేదు. ఇది కాకుండా వారు అనుసరించడానికి మరొక మార్గమే లేదు, ఉండదు". ఇంకా బ్రిటిష్ పాలిత దేశంగా ఉండగానే, తమకు అధికారం రాకముందే గోల్వాల్కర్ అక్షరాలా రాసిన కాషాయ విషం ఇది. సంఘ్ పరివార్ వంద సంవత్సరాలుగా వ్యాపింపజేస్తున్న విషం ఇది. కొన్ని నెలల్లో సర్ తెలంగాణకు కూడా వస్తుంది. సిద్ధంగా ఉన్నామా?



**ఎన్ వేణుగోపాల్**
**ఎడిటర్, వీక్షణం**

---

## విశ్వ శక్తులు – మానవ ఆలోచనలు

# శాస్త్రీయ ఆలోచన

మానవ జీవితం విశ్వంతో విడదీయలేని సంబంధంలో కొనసాగుతున్నదనే భావనకు ఆధునిక శాస్త్రం క్రమంగా దగ్గరవుతోంది. భూమి మీద జీవుల ఉనికి సూర్యుని శక్తిపై ఆధారపడి ఉన్నదనే విషయం 1800 తరువాతి పరిశోధనలతో స్పష్టమైంది. సూర్యుని నుండి భూమికి చేరే కిరణజాలం పరిమాణంలో స్వల్ప మార్పులు సంభవించినప్పుడు వాతావరణ సమతుల్యత దెబ్బతింటున్నదని 1975 నాటి అధ్యయనాలు సూచించాయి. ఈ మార్పుల ప్రభావం జీవుల శరీర వ్యవస్థలపై కూడా కనిపిస్తున్నదని శాస్త్రవేత్తలు గుర్తించారు.

భూమి అయస్కాంత క్షేత్రంలో ఏర్పడే మార్పులు మానవ నర వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయనే అంశం 1988 తరువాత ఎక్కువ ప్రాధాన్యత పొందింది. ఆ సంవత్సరంలో జరిగిన పరిశోధనలో నిద్రలేమితో బాధపడుతున్న వ్యక్తులలో సుమారు 15% మందికి భూమి అయస్కాంత క్షేత్రంలో వచ్చిన హెచ్చుతగ్గులతో సంబంధం ఉన్నట్లు నిర్ధారించారు. నిద్ర సరైన స్థాయిలో లేకపోతే మెదడు ఆలోచనా సామర్థ్యం తగ్గిపోతుంది. దీని ఫలితంగా భావోద్వేగ అస్థిరత పెరుగుతుంది. అటువంటి పరిస్థితుల్లో ప్రతికూల ఆలోచనలు అధికమవుతాయి. ఆలోచనలు శరీరంపై చూపే ప్రభావాన్ని శాస్త్రీయంగా కొలవడం 1990 తరువాత సాధ్యమైంది. మెదడులో ఉత్పత్తి అయ్యే రసాయన ద్రవ్యాలు భావోద్వేగ స్థితిని నిర్ణయిస్తున్నాయని 1992 నాటి పరిశోధన స్పష్టం చేసింది. సానుకూల ఆలోచనలు కలిగిన వ్యక్తులలో ఆనందాన్ని కలిగించే రసాయనాల స్థాయి సుమారు 30% పెరుగుతున్నట్లు గణాంకాలు చూపించాయి. అదే సమయంలో భయాన్ని కలిగించే ఒత్తిడి రసాయనాల స్థాయి సుమారు 20% తగ్గింది.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఆలోచనలు పూర్తిగా అంతర్గత ప్రక్రియ మాత్రమే కావు. అవి బయట వాతావరణ పరిస్థితుల ప్రభావానికి లోబడి ఉంటాయి. కాంతి తీవ్రత, ఉష్ణోగ్రత మార్పులు, కాలచక్ర పరిణామాలు మానవ మానసిక స్థితిపై ప్రభావం చూపుతున్నాయని 2005 నాటి అధ్యయనంలో వెల్లడైంది. సహజ కాంతి తక్కువగా లభించే ప్రాంతాలలో నివసించే ప్రజల్లో నిరుత్సాహ భావం సుమారు 25% అధికంగా నమోదైంది. భూమిపై జీవనానికి మూలాధారం అయిన సూర్య శక్తి మానవ శరీరంలో జరిగే జీవక్రియలను సమన్వయం చేస్తుంది. సూర్య కాంతి సరిపడా లభించినప్పుడు శరీరంలో కాల్షియం శోషణ పెరుగుతుంది. దీని ప్రభావంగా ఎముకల బలం మెరుగవుతుంది. 2012 నాటి పరిశోధన ప్రకారం సరైన కాంతి లభించిన వ్యక్తులలో శారీరక చురుకుదనం సుమారు 18% పెరిగింది. శారీరక చురుకుదనం పెరిగినప్పుడు మానసిక స్థిరత్వం కూడా మెరుగుపడుతుంది. శరీరంలోని ప్రతి కణం సూక్ష్మ స్థాయిలో విద్యుత్ సంకేతాలపై ఆధారపడి పనిచేస్తుంది. ఈ సంకేతాల సమతుల్యత దెబ్బతిన్నప్పుడు వ్యాధులు ఏర్పడతాయని జీవ భౌతిక శాస్త్రం చెబుతోంది. 1999 నాటి అధ్యయనంలో దీర్ఘకాలిక ఆందోళనతో బాధపడుతున్న వ్యక్తుల కణస్థాయి విద్యుత్ చర్యలు అసమతుల్యంగా ఉన్నట్లు గుర్తించారు. అదే అధ్యయనంలో ధ్యానం చేసే వ్యక్తులలో ఈ అసమతుల్యత సుమారు 40% తగ్గినట్లు నమోదు చేశారు. ధ్యానం సమయంలో శ్వాస నియంత్రణ జరుగుతుంది. శ్వాస నియంత్రణ వల్ల రక్తంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుంది. ఇది మెదడుకు సరైన పోషణ అందిస్తుంది. మెదడు ఆరోగ్యంగా పనిచేసినప్పుడు ఆలోచనలు సహజంగా సానుకూల దిశలో సాగుతాయి. 2018 నాటి గణాంకాల ప్రకారం రోజుకు కనీసం 20 నిమిషాలు ధ్యానం చేసిన వ్యక్తులలో ఆందోళన స్థాయి సుమారు 32% తగ్గింది. విశ్వంలో జరిగే మార్పులు భూమి జీవనంపై పరోక్షంగా ప్రభావం చూపుతున్నాయనే భావనకు ఖగోళ శాస్త్ర పరిశోధనలు బలమిస్తున్నాయి. సూర్య ఉపరితలంపై ఏర్పడే పేలుళ్ల తీవ్రత పెరిగిన సంవత్సరాలలో భూమి వాతావరణంలో అస్థిరతలు ఎక్కువగా నమోదయ్యాయి. 2001 సంవత్సరంలో ఈ పేలుళ్ల ప్రభావంతో భూమి అయస్కాంత క్షేత్రం సుమారు 7% వరకు మార్పులకు గురైంది. అదే సంవత్సరంలో నిద్ర సమస్యలపై ఫిర్యాదులు ప్రపంచ వ్యాప్తంగా పెరిగినట్లు గణాంకాలు చూపించాయి. ఈ పరిశీలనలు ఒక విషయాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయి. మానవ జీవితం పూర్తిగా స్వతంత్ర వ్యవస్థ కాదు. అది విశ్వంలోని శక్తి ప్రవాహాలతో అనుసంధానమై ఉంది. అయితే ఈ అనుసంధానం ప్రత్యక్ష నియంత్రణ రూపంలో కాకుండా పరోక్ష ప్రభావాల రూపంలో పనిచేస్తోంది. పాజిటివ్ ఆలోచనలు కలిగిన వ్యక్తులు ఈ ప్రభావాలకు తక్కువగా లోనవుతున్నారని 2016 నాటి అధ్యయనం వెల్లడించింది.

సానుకూల దృక్పథం ఉన్నవారు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువగా కలిగి ఉంటారు. ఈ సామర్థ్యం మెదడులో ఏర్పడే అనుకూల నాడీ మార్గాల వల్ల ఏర్పడుతుంది. దీర్ఘకాలంగా సానుకూలంగా ఆలోచించే వ్యక్తుల మెదడులో ఈ మార్గాలు బలపడతాయని 2020 నాటి నాడీ శాస్త్ర అధ్యయనం నిర్ధారించింది. ఈ వ్యక్తులలో నిర్ణయ సామర్థ్యం సుమారు 27% మెరుగ్గా ఉన్నట్లు తేలింది. ఈ మొత్తం విశ్లేషణ చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. కోస్మిక్ స్థాయిలో ఉన్న శక్తులు భూమి జీవనానికి నేపథ్యంగా పనిచేస్తున్నాయి. మానవ ఆలోచనలు శరీర వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ రెండు మధ్య సమన్వయం ఏర్పడినప్పుడు జీవన నాణ్యత మెరుగుపడుతుంది. శాస్త్రం ఇప్పటికీ అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేకపోయినా, ఇప్పటివరకు లభించిన గణాంకాలు ఈ దిశలో బలమైన సూచనలను అందిస్తున్నాయి. భవిష్యత్తులో 2030 నుంచి 2050 మధ్య జరిగే పరిశోధనలు ఈ అనుసంధానాన్ని ఇంకా స్పష్టంగా వివరించే అవకాశం ఉంది. అప్పటికి మానవ శరీర శక్తి వ్యవస్థలపై మరింత లోతైన అవగాహన ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అప్పటివరకు పాజిటివ్ ఆలోచన లు కలిగిన జీవనశైలి అనుసరించడం శాస్త్రీయంగా సురక్షిత మైన మార్గమని చెప్పవచ్చు.



**డాక్టర్.రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**సీనియర్ పాత్రికేయులు**

---

# చరిత్రలో రక్తంతో తడిసిన చేతులతో అమెరికా

ప్రపంచ చరిత్రలో, అమెరికా సంయుక్త రాష్ట్రాలు తన జాతీయ భద్రత పేరుతో ప్రపంచ వ్యవస్థపై తన ప్రాబల్యాన్ని నిలబెట్టుకోవడానికి వివిధ దేశాల నేతలపై రకరకాల పొంతన కుదరని ఆరోపణలు చేసి, వారిపై చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఈ చర్యలు తరచుగా జాతీయ భద్రత, మానవ హక్కులు లేదా ప్రజాస్వామ్యం వంటి విలువల రక్షణ కోసం చేపట్టినవిగా చిత్రీకరించబడినప్పటికీ, విమర్శకులు వాటిని అమెరికా ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక ఆసక్తులను నెరవేర్చుకునే సాధనాలుగానే చూసి విశ్లేషిస్తారు.

**చారిత్రక నమూనాలు: రూపాంతరం చెందిన తీర్పు**

**పాట్రిస్ లుముంబా (కాంగో) – 1961 :** కాంగోలో ప్రథమ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రి. అతను సోవియట్ యూనియన్‌తో సన్నిహిత సంబంధాలను కలిగి ఉండి, పశ్చిమ ప్రపంచ ఆసక్తులను (దేశంలోని ఘనీభవించిన యురేనియం వనరులు) హించి కాంగో సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవాలనుకున్నాడు. అయితే అమెరికా అతని రాజకీయ ప్రత్యర్థులకు మద్దతు ఇవ్వడం, రహస్య చర్యల ద్వారా అతని పాలనను పడగొట్టడంలో సి.ఐ.ఎ ను ఉపయోగించింది. అది చురుకైన పాత్రను పోషించింది. 2001లో స్థాపించబడిన యు.ఎస్. కాంగో కమిషన్ నివేదిక, లుముంబా హత్యకు సి.ఐ.ఎ అలాగే బెల్జియన్ మిలిటరీ ఇంటలిజెన్స్ రహస్యంగా పాల్గొన్నట్లు తేల్చింది. అమెరికా ప్రత్యక్షంగా చంపలేదు, కానీ అతన్ని అణచివేయడానికి రూపురేఖలు వేసింది, ఆ తర్వాత అతని ప్రత్యర్థులు అతన్ని హత్య చేశారు.

**సాల్వడోర్ అలెండే (చిలీ) – 1973**

'చిలీ'కి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన సోషలిస్ట్ అధ్యక్షుడు. అతని జాతీయకరణ విధానాలు (ఉదా: రాగి ఖనిజం) అమెరికా కంపెనీల హితాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి.అప్పుడు అమెరికా డీక్లాసిఫై చేసిన దస్తావేజులు సి.ఐ.ఎ 'చిలీ' లో "రాజకీయ అస్థిరతను ప్రోత్సహించడానికి" గరిష్టంగా ప్రయత్నించిందని నిరూపించాయి. ఇందులో ఆర్థిక పతనాన్ని ప్రోత్సహించడం, ప్రతిపక్ష మీడియాకు నిధులు అందించడం అలాగే సైనిక కుట్రదారులతో సంప్రదింపులు నిర్వహించింది అనడానికి సాక్ష్యాలు ఉన్నాయి. 1973 సెప్టెంబర్ 11న జరిగిన సైనిక తిరుగుబాటు సమయంలో అలెండే ఆత్మహత్య చేసుకున్నాడు (అధికారిక వర్ణన), ఆ తర్వాత 'ఆగస్టో పినోచెట్ ' (అమెరికా షాడో) క్రూరమైన నియంతృత్వం స్థాపించబడింది. అమెరికా ఈ తిరుగుబాటుకు నేరుగా ఆదేశాలు ఇవ్వలేదు, కానీ అలా కార్యక్రమం జరగడానికి కావాలసిన అన్ని ఎత్తులు,జిత్తుల ప్రణాళికను, పరిస్థితులను సృష్టించింది.

**ముఅమ్మర్ గద్దాఫీ (లిబియా) – 2011**

లిబియా దీర్ఘకాలిక నాయకుడు. 2000ల ప్రారంభంలో పశ్చిమ దేశాలతో సంబంధాలు మెరుగుపరచుకున్నప్పటికీ, అతను ఒక అణచివేత పాలకుడిగా అమెరికా మీడియా కథనాలతో విషం ప్రచారం చేసింది.ప్రజా ప్రతిఘటనను హింసాత్మకంగా అణచివేసేవాడిగా అమెరికా మీడియా విస్తృతంగా ప్రచారం చేసి ఒక అనుకూల వాతావరణాన్ని సృష్టించింది.

**అమెరికా పాత్ర :** 2011లో "అరబ్ స్ప్రింగు నిరసనల తరువాత, నాటో (అమెరికా నేతృత్వంలో) గద్దాఫీ సైన్యంపై



సైనిక దాడులు చేపట్టింది, "మానవ హక్కుల" రక్షణ కోసం. ఈ జోక్యం అనే ప్రాపగాండాతో గద్దాఫీ పాలన పతనానికి దారితీసింది అలాగే అతను ప్రతిపక్ష బలగాల చేతులలో హింసాయుతమైన హత్యకు గురైనాడు. లిబియా నేటికీ గందరగోళంలో ఉంది, ఇది సైనిక జోక్యం దీర్ఘకాలిక ఫలితాలను గురించి ప్రశ్నలను లేవనెత్తింది. ఈ చర్యలను సమర్థించడానికి "ప్రపంచ శాంతి", "ప్రజాస్వామ్య వ్యాప్తి", "మానవ హక్కులు" వంటి పెద్ద పెద్ద పరిభాషను అమెరికా తన ప్రచార, ప్రసార మాధ్యమాలతో ప్రాపగాండాను ఉపయోగించే వారు. అయితే, అనేక సందర్భాల్లో, అమెరికా మద్దతు ఉన్న నియంతలు కూడా (చిలీలో పినోచెట్ వంటివారు) క్రూరమైన అణచివేత పాలనలో నిమగ్నమై ఉండడం ఈ సిద్ధాంతాలకు విరుద్ధంగా నిలిచింది. ఇలాంటి అమెరికా పాలకుల చర్యలను రష్యా – చైనా దేశాలు ఎందుకు ప్రతిఘటించలేదు? రష్యా – చైనా దేశాల ప్రతిస్పందన ఎందుకు మౌనంగా ఉంది? ఎందుకు అమెరికాను ప్రత్యక్షంగా ఎందుకు ఎదురుదెబ్బ తీయలేదు ? అనే ప్రశ్నలు ప్రపంచం అంతటా వినిపించాయి. అయితే రష్యా (మాజీ సోవియట్ యూనియన్), చైనా తమ స్వంత మార్గాల్లో ప్రతిస్పందించాయి. వారి ప్రతిస్పందన వారి స్వంత రాజకీయ-వ్యూహాత్మక ఆలోచన ద్వారా నియంత్రించబడింది:

**జాతీయ ఆసక్తులు, ప్రతిస్పందన ధోరణి**

రష్యా, చైనా దేశాలు ప్రత్యక్ష సైనిక ఘర్షణను నివారించే విధానాన్ని అనుసరిస్తాయి. ప్రత్యేకించి అమెరికా ప్రత్యక్షంగా ప్రమేయం చూపించనప్పుడు. వారి ప్రాథమిక ప్రతిస్పందనలు డిప్లొమాటిక్ నిరసన, ఐక్యరాజ్యసమితిలో వీటో హక్కు వినియోగం, లేదా ప్రత్యామ్నాయ ఆర్థిక/రాజకీయ మద్దతు (వారి ప్రభావ వలయాన్ని విస్తరించడానికి అవకాశంగా) అవుతుంది.

**ఆసక్తుల గణాంకాలు**

20వ శతాబ్దపు మధ్యకాలంలో, రష్యా (సోవియట్ యూనియన్) మరియు చైనా తమ స్వంత అంతర్గత సవాళ్లు (సోవియట్ యూనియన్ క్షీణత, చైనా ఆర్థిక మార్పు), ప్రాంతీయ ఘర్షణలతో (ఆఫ్ఘనిస్తాన్, వియత్నాం) బాధపడ్డాయి. ప్రతి సందర్భంలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం వారి వ్యూహాత్మక లక్ష్యాలకు దూరం చేసే ప్రమాదకర, ఖరీదైన ప్రయత్నం అయ్యేది.

**పరోక్ష ప్రతిస్పందన**

వారు తమ ప్రత్యర్థులకు (క్యూబాకు సోవియట్ యూనియన్ లేదా నికరాగువాకు రష్యా వంటివి) సైనిక, ఆర్థిక సహాయం అందించడం ద్వారా "ఎదుర్కొన్నారు". వారి ప్రధాన లక్ష్యం అమెరికా ప్రభావాన్ని సమతుల్యం చేయడం మరియు తమ ప్రభావ వలయాన్ని రక్షించుకోవడం, ప్రతి చిన్న సంఘర్షణలో ప్రత్యక్షంగా పోరాడడం కాదు.

**సమకాలీన దృశ్యం,భవిష్యత్తు: ట్రంప్‌ను ఎవరు ఎదుర్కోగలరు?**

నేటి ప్రపంచం సోవియట్ యూనియన్ వంటి ఒకే ప్రత్యర్థి లేని ప్రపంచం కాదు. ఇది బహుళధృవ ప్రపంచం, ఇక్కడ అమెరికా శక్తి సాపేక్షంగా తగ్గింది. చైనా (ఆర్థికంగా), రష్యా (వ్యూహాత్మకంగా), ఇండియా, బ్రెజిల్ వంటి ఇతర శక్తులు తమ స్వంత ఆసక్తులను ముందుకు తీసుకువెళ్తున్నాయి. ట్రంప్ లేదా ఏదైనా అమెరికన్ నాయకుడిని "ఎదుర్కోవడం" అంటే బహుముఖ సంఘర్షణ వేదికపై, పరోక్ష మరియు మరింత సూక్ష్మమైన చర్యల ద్వారా జరుగుతుంది.

**"ఎదుర్కోవడం"ఆధునిక రూపాలు :** ప్రత్యక్ష సైనిక ఘర్షణ వద్దు. ఆధునికంగా "ఎదుర్కోవడం" అంటే: ఆర్థిక నిర్బంధాలు, వాణిజ్య యుద్ధాలు (చైనా నుండి). సైబర్ యుద్ధం మరియు ప్రచారం (రష్యా నుండి). ప్రత్యామ్నాయ అంతర్జాతీయ సంస్థలను నిర్మించడం (బ్రిక్స్, షంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్).సాంకేతిక స్వాతంత్ర్యంపై పోరాటం (సెమీకండక్టర్లు, 5G).


**అమెరికాతో మిత్రదేశాలపై ప్రభావం**

ట్రంప్ విధానం (మిత్రదేశాలను విమర్శించడం, నాటోపై సందేహం) అమెరికా శక్తికి పునాదిగా ఉన్న మిత్రదేశాల మద్దతును కూడబెట్టగలదు. అంటే, అతనికి వ్యతిరేకంగా నిలబడేవారు బాహ్య శత్రువులు మాత్రమే కాదు, సంప్రదాయ మిత్రదేశాలు కూడా (ఉదా., ఐరోపా సంఘం వ్యాపార విధానంలో ఏకంగా నిలబడటం) కావచ్చు.

చివరిగా.. అమెరికా విదేశీ నేతలపై చర్యలు అనేక దశాబ్దాలుగా నిరంతరాయంగా కొనసాగుతూ, ప్రపంచ వ్యవహారాలలో దాని ప్రాబల్యాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ చర్యలను అమలు చేసే పద్ధతులు ప్రత్యక్ష సైనిక జోక్యం నుండి ఆర్థిక నిర్బంధాలు, రహస్య కార్యకలాపాలు, బహిరంగ బెదిరింపుల వరకు మారాయి. అయితే, వాటి లక్ష్యం తరచుగా ఒకేలా ఉండేది. అమెరికా జాతీయ ఆసక్తులను సాధించడం మరియు ప్రపంచ వ్యవస్థలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడం.

**21వ శతాబ్దంలో, శక్తి మరింత సంక్లిష్టంగా మారింది**

ఇది ఆర్థిక, సాంకేతిక, సైబర్, మృదు శక్తి (సంస్కృతి, విధానం)ల మిశ్రమం. ఈ కొత్త వాతావరణంలో, "ఎదుర్కోవడం" అనేది ఒకే దేశం చేత సాధ్యమయ్యే పని కాదు, కానీ అనేక దేశాలు మరియు బహుముఖ వ్యూహాలు కలిసి చేయగల సవాలు. చారిత్రకంగా, ఈ చర్యలు ప్రపంచవ్యాప్తంగా అస్థిరత, సంఘర్షణ మరియు అమెరికా విలువల పట్ల నమ్మకం కోల్పోవడానికి దోహదం చేశాయి. వ్యక్తిగత నేతలపై చర్యల ద్వారా సంక్లిష్టమైన అంతర్జాతీయ సవాళ్లను పరిష్కరించలేమనేది చరిత్ర నేర్పిన పాఠం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

---

## ఎవరి ఆమోదం

ఎవరి ఆమోదం
సాగుతున్న నరమేధం
హద్దులు చెరిపిన ప్రమాదం
దిగరా.. ఆధిపత్యభావాలలోంచి
ఒకరి మాట ఒకరు వినరా
పాశవికంగా అణచివేసే నిరంకుశ
విధానాలు వీడరా
భీషణ ప్రతిజ్ఞలు
అణువు పరీక్షలు
ఘర్షణంటే
అభివృద్ధి కనుమరుగు
ప్రగతి అధోగతివైపుగా సాగి
తెరమరుగు
ఇంకా.. జీవరక్షకులు కరువైన వేళ
నా నా దిక్కులకు శరణార్థులుగా
పరుగు
ప్రపంచం ఇప్పుడు దట్టంగా
కప్పబడిన యుద్ధమేఘాల
ఆకాశంలా ఉంది
మహా నిస్తేజంగా ఉంది
పైగా కోపంగా బలంగా
బుసకొడుతూ తన శక్తిని
శత్రుదేశం మీద ప్రదర్శిస్తూ ఉంది
సమాధుల లోపల పూడ్చిన శవాలు
కూడా యుద్ధం వద్దంటున్నాయి
శాంతికి శరణమన్నట్టుగా
గాయపడిన వీధులు
కూలిన అంతస్తులు చెబుతున్నాయి
ఈ ఆకాశాన్ని
క్షిపణులతో డ్రోన్లతో నింపకండి
అవనిని రక్తంతో తడపకండి
రేపైన శాంతి చట్రంలో
యుద్ధపక్షి బంధి ఐపోతుంది

**కోటం చంద్రశేఖర్**
**9492043348**

# డెడికేషన్ కమిషన్ నివేదిక అనుగుణంగా రిజర్వేషన్లు

- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 17 (జనంసాక్షి) :** డెడికేషన్ కమీషన్ నివేదికను అనుసరిస్తూ ఎన్నికల కమీషన్ సూచనలకు అనుగుణంగా రిజర్వేషన్ల కేటాయింపులు చేశామని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.శనివారం జిల్లా సమీకృత కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. జిల్లాలోని ఆమన్ గల్ మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులు, చేవెళ్ళ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులు, మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 26 వార్డులు, షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డులు, శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల స్థానాల కోసం ఎస్టీ, ఎస్టీ(మహిళా), ఎస్సీ, ఎస్సీ (మహిళా),బీసీ, బీసీ(మహిళా), అన్ రిజర్వుడు, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీల రిజర్వేషన్లను వీడియో రికార్డింగ్



మధ్యన, నిబంధనలను అనుసరిస్తూ ఖరారు చేశారు.ఆమన్ గల్ మున్సిపాలిటీ పరిధిలో 7 వార్డులకు, చేవెళ్ళ మున్సిపాలిటి పరిధిలో 9 వార్డులకు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటి పరిధిలో 12 వార్డులకు, మొయినాబాద్ మున్సిపాలిటి పరిధిలో 13 వార్డులకు, షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలో 14 వార్డులకు,శంకర్ పల్లి మున్సిపాలిటి పరిధిలో 7 వార్డులకు మహిళా కేటగిరికీ కేటాయించడం జరిగిందాని తెలిపారు.ఖరారైన రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి,రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు నివేదించడం జరుగుతుందన్నారు. ఈ రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియలో జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి,డిపివో సురేశ్ మోహన్, పిడి మెప్మా వెంకట నారాయణ, అమన్ గల్, చేవెళ్ళ, ఇబ్రహీంపట్నం,మొయినాబాద్, షాద్ నగర్, శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్లు ఎస్.వెంకటేష్, ఏ.యోగేశ్, వి.సునీత, బి.సత్యనారాయణ రెడ్డి, ఏం.శంకర్, ఎండికే మొయిజుద్దీన్, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, సిపిఐ(ఎం) నుండి బోడ సామెల్, సిహెచ్.ఎల్లేష, కాంగ్రెస్ నుండి చల్లా నర్సింహా రెడ్డి,బండారి అగిరెడ్డి,జంగారెడ్డి, బీఆర్ఎస్ నుండి మదుపు వేణుగోపాల్, నిట్టూ జగదీశ్వర్,వెంకట్ రెడ్డి, బీజేపీ నుండి విజయ్ కుమార్, దేవేందర్ రెడ్డి, కొండా మధుకర్ రెడ్డి గుర్తింపు పొందిన పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ప్రశాంతతను అందిస్తాయి



**దోమ, జనవరి 17 (జనం సాక్షి) :** క్రీడలు మానసిక శారిరా వికాసానికి ఎంతో దోహదపడతాయని దోమ మండల జేఏసీ చైర్మన్ గోవర్ధన్ ముదిరాజ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటు గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. అయినాపూర్ గ్రామానికి చెందిన శివ టీం ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి సద్దాం టీమ్ గెలుపొందాయి . ఓటమికి నంది గెలుపు అన్నారు. ఓటమిపాలైన లో దిగులు చెందరాదన్నారు. క్రీడల ద్వారా స్నేహభవం ఎంతో పెంపొందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ రాజ్ కుమార్, మహేష్,శ్రీనివాస్ దసరత్,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మాఘ అమావాస్యకు పకడ్బందీగా ఏర్పాట్లు



**మెదక్, జనవరి 17 (జనంసాక్షి) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. ఆదివారం మాఘ అమావాస్య పురస్కరించుకొని ఏడుపాయల వనదుర్గా క్షేత్రంలో దేవాదాయ శాఖ,పోలీస్,రెవెన్యూ,వైద్య,పంచాయతీ రాజ్,విద్యుత్ శాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. శనివారం మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఏడుపాయల గోకుల్ ఫంక్షన్ హాల్ లో సుమారు 250 మంది సిబ్బంది కీ తగు సూచనలు చేశారు. జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ ఏడుపాయలలో హెల్త్ క్యాంపు లో మాత్రలను పరిశీలించి సిబ్బందికీ తగు సూచనలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. స్నానజల్లులు,బారికేడ్లు,విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేశారు.లడ్డు,పులిహోర ప్రసాద కేంద్రాలను సిద్ధం చేశారు. సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు.

## లక్ష్యంతో కూడిన విద్యే విద్యార్థి భవిష్యత్తుకు బాట

- అడిషనల్ రంగారెడ్డి జిల్లా సెషన్ జడ్జ్ బృంగి శ్రీనివాసులు



**చేవెళ్ల, జనవరి 17 (జనంసాక్షి) :** విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో క్రమశిక్షణగా చదువుకుంటేనే విజయం సాధ్యమవుతుందని అడిషనల్ రంగారెడ్డి జిల్లా సెషన్ జడ్జ్ బృంగి శ్రీనివాసులు తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన శ్రీచైతన్య జూనియర్, డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, పోటీ ప్రపంచంలో విద్యే వ్యక్తి ఎదుగుదలకు పునాది అని అన్నారు. నిర్లక్ష్యం, చెడు సహవాసం, బద్ధకం వంటి అలవాట్లు భవిష్యత్తును దెబ్బతీస్తాయని తెలిపారు. గొప్ప చదువు చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఉద్బోధించారు. చేవెళ్ల డిటెక్టివ్ సీఐ ఉపేందర్ మాట్లాడుతూ...ప్రతి తల్లిదండ్రి తన బిడ్డ మంచి స్థాయికి చేరాలని కోరుకుంటారని, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగం కుటుంబ భవిష్యత్తును మార్చే శక్తి కలిగిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చేవెళ్ల ఎస్సైలు వనం శిరీష, బి.శిరీష, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, కరస్పాండెంట్ శ్రీకాంత్, డైరెక్టర్ మనోహర్ రెడ్డి, మల్గారి రఘుపతి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భద్రేశ్వర కాంప్లెక్స్‌ను రీ టెండర్ విధానం చేయాలి

- ఐదు సంవత్సరాలకోసారి రియాక్షన్ నిర్వహించాలి
- ఇష్టానుసారంగా చైర్మన్ వ్యవహరించడం సరికాదు
- భద్రేశ్వర కాంప్లెక్స్‌లో ఎవరికి వారిదే ఇష్టా రాజ్యం
- ఆలయ పూజారులకు నిలువ నీడ కరువు
- వీరశైవ సమాజం సభ్యులు పటేల్ ప్రవీణ్ కుమార్

**తాండూరు, జనవరి 17 (జనంసాక్షి) :** పట్టణంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రేశ్వర కాంప్లెక్స్ ను రీ టెండర్ విధానం చేయాలని వీరశైవ సమాజం సభ్యులు పటేల్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవ



సమాజం సభ్యులు పటేల్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భద్రేశ్వర కాంప్లెక్స్ ను ఐదు సంవత్సరాలకు ఒకసారి రియాక్షన్ నిర్వహించాలన్నారు.ఇష్టానుసారంగా చైర్మన్ వ్యవహరించడం సరికాదన్నారు. రెనివేషన్ కమిటీ సభ్యులకు కూడా దుకాణం కట్టించడం పట్ల విమర్శలు ఉన్నాయన్నారు. భద్రేశ్వర కాంప్లెక్స్ పునర్నిర్మాణంలో ఎవరిది రాజ్యం వారిదే అన్నట్టుగా ఉందన్నారు. భద్రేశ్వర స్వామికి నిత్య పూజలు నిర్వహించే పూజారులకు నిలువ నీడ కరువైందని అన్నారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బద్వేశ్వరుని జాతర ఉత్సవాల సామాగ్రికి స్థలం కరువైందన్నారు. భద్రేశ్వర స్వామి జాతర ఉత్సవాల సామాగ్రి ఎండలో ఎండుతూ వానలో తడుస్తూ ఉన్నాయని గుర్తు చేశారు. నూతన కాప్లేక్స్ విదానం పై స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మరియు ఆర్బిఓఎల్ సీఈఓ శ్రీనివాస్ రెడ్డిలను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. రేనియేషన్ కమిటీ సభ్యుల కాలపరిమితి ముగిసినప్పటికిని హడావిడి చేసి శిలాఫలకాలు వేసి కాంప్లెక్స్ ప్రారంభోత్సవం చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై సంబంధించిన అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దాసోహం అసంపూర్తిగా వదిలేసారు. దాతల సహకారంతో నిర్మంచారు .దీనిలో కుడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు.

# సీఎం కప్ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోండి

**రాజేంద్రనగర్, జనవరి 17 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ శివరాంపల్లి నుంచి సీఎం కప్ క్రీడా పోటీల జ్యోతి ర్యాలీని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్థానిక తహశీల్దార్ బొమ్మ రాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. మండల స్థాయి పోటీలు జనవరి 28 నుంచి 31 వరకు, శాసనసభ నియోజకవర్గ స్థాయి ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు, జిల్లా స్థాయి పోటీలు ఫిబ్రవరి 9 నుంచి 12 వరకు జరుగుతాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనాలనుకునే వారు తప్పనిసరిగా ఆన్లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఆన్లైన్ నమోదు




లేని వారు జోనల్, జిల్లా స్థాయికి అర్హులు కాదని స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిస్ట్రిక్ట్ యూత్, స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ శంకర్ రాథోడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీను నాయక్, రాజేంద్రనగర్ జోనల్ ఇన్‌చార్జి గాంగ్య నాయక్ మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతాయని తెలిపారు. జాతీయ స్థాయి సర్టిఫికెట్ పొందిన క్రీడాకారులకు ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ జ్యోతి ర్యాలీ శివరాంపల్లి హైస్కూల్ నుంచి 294 పిల్లర్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిఎచ్ఎం భూక్య శ్రీను నాయక్, పడమటి శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి గాంగ్య నాయక్ , జోనల్ సెక్రటరీ యూనియన్ నాయకులు సుదర్శన్, వెంకటయ్య, యాదగిరి, జనార్దన్ చారి ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## టోర్నమెంట్ క్రీడాల స్ఫూర్తిని పెంపొందిస్తాయి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 17 (జనం సాక్షి) :** క్రికెట్ టోర్నమెంట్ పోటీలు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని బూర్గుల గ్రామ సర్పంచ్ రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు.బూర్గుల గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు శనివారం బహుమతులను,ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాశీరెడ్డి గూడ గ్రామ సర్పంచ్ రామలింగం గౌడ్, ఉప సర్పంచ్ శివలీల రాజేందర్,మాజీ వైస్ ఎంపీపీ మౌనిక హరికృష్ణ గౌడ్, ప్రభాకర్ యాదవ్,గంగాపురం రమేష్, పెంటయ్య, వెంకటయ్య, జగన్, శివకుమార్ యాదవ్, తరుణ్, గణేష్, బాలు, పవన్,కుంటుల్ల కవిత పరశురామ్,మంగలి సత్యనారాయణ, తేజశ్రీ రామ్, పవన్ కుమార్, సంతోష్ కుమార్ గౌడ్, హరీశ్వర్, శేఖర్, జంగమ్మ జంగయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ పరిధిలో చిన్నారులు, మహిళల భద్రతకు పెద్దపీట

**శేరిలింగంపల్లి, జనవరి 17 (జనంసాక్షి) :** మహిళలు, చిన్నారుల భద్రత కోసం సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ విభాగం డిసిపి సృజన కరణం తెలిపారు. ఈ మేరకు శనివారం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్-12 లో భాగంగా సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా(10.01.2026 నుండి 16.01.2026) వరకు నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో 50 జెజె చట్టం కేసులు నమోదు చేసి 220 మంది బాలురను మరియు 06 మంది బాలికలను విజయవంతంగా రక్షించగలిగామన్నారు. సైబరాబాద్ షీ టీం బృందాలు వారం రోజుల వ్యవధిలో మొత్తం 139 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 29 మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో 28 పై పిటీ కేసులు నమోదు కాగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ చేశామన్నారు. అదేవిధంగా మహిళల నుండి అందిన 19 ఫిర్యాదులను షీ టీం బృందాలు సవాలుగా స్వీకరించాయన్నారు. భార్యాభర్తల మధ్య తలెత్తిన కుటుంబ సమస్యలను పరిష్కరించే దిశగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు/సిడిఈడబ్ల్యూ కేంద్రాలు కీలకపాత్ర పోషించాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా 13 కుటుంబాలను తిరిగి కలిపి వారి కుటుంబాల్లో వెలుగులను నింపడం జరిగిందన్నారు. సైబరాబాద్ పరిధిలో వివిధ ప్రాంతాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీం బృందాలు మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మహిళలను వేధించడం, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, మహిళలను నిరంతరం వెంబడించడం, భిక్షాటన, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, సైబర్ మోసాలు




వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించామన్నారు. మొత్తం 2802 మందికి అవగాహన కార్యక్రమాలను అందించడం జరిగిందని డిసిపి తెలిపారు. దీంతోపాటు మహిళల హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డయల్ 100, సైబర్ సహాయం కోసం 1930 వంటి సేవల ప్రాముఖ్యతనుసైతం కమిషనరేట్ పరిధిలోని ప్రజలకు వివరంగా తెలియజేయడం జరిగిందన్నారు.

# విమర్శలకు అభివృద్ధితోనే సమాధానం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్

**గోదావరిఖని, జనవరి 17 (జనంసాక్షి) :** విమర్శలకు అభివృద్ధితోనే సమాదానం చెప్తామని రామగుండం శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. శనివారం రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎయిట్ ఇంక్ లైన్ కాలనీ లో రూ 30.00 లక్షలతో డైలీ మార్కెట్ అభివృద్ధి పనులు , గోదావరి ఖని చౌరస్తా లో రూ 50.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వీధుల పేర్ల సూచిక బోర్డులు ప్రారంభించారు. అనంతరం రామగుండంలో రూ 20.00 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంఖు స్థాపన చేశారు. ఈ సంధర్భంగా రామగుండం మజీద్ కార్నర్ వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అక్కడ గడిపిన రోజులు , తన బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్ లో ఉన్నప్పటికీ స్థానికులతో సంబంధాలు కొనసాగిస్తూ రాజకీయాలకు అతీతంగా సహాయం చేశానని అన్నారు. నాటి పాలకుల నిర్లక్ష్యానికి గురై ప్రాభవం కోల్పోతున్న ఈ ప్రాంతానికి పునర్ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో పట్టు వదలకుండా పోరాటం చేసి ఎం ఎల్ ఏ గా ఎన్నికయ్యాయని అన్నారు. తనపై విశ్వాసంతో గెలిపించిన



ప్రజలకు కృతజ్ఞతగా ఎంఎల్ఏగా ఎన్నికైన నాటి నుండి రోజుకు 18 గంటలు పని చేస్తూ నగరాభివృద్ధికి కృషి చేస్తున్నానని అన్నారు. రామగుండం పట్టణం నుండి నలువైపులా లింగాపూర్, అంతర్గాం, కుందనపల్లి, గోదావరి ఖని వైపు ప్రదాన రహదారులన్నీ వెడల్పు చేసి ఒక ముఖ్య కేంద్రంగా రూపు దిద్దుతున్నామని అన్నారు. ఉత్తర తెలంగాణలో పెద్ద నగరాలైన వరంగల్ , కరీం నగర్ వంటి పట్టణాలకు ధీటుగా రామగుండం నగరాన్ని తీర్చి దిద్దాలన్నదే తన ధ్యేయమని అన్నారు. రామగుండం నగరాన్ని విద్య , వైద్య , పారిశ్రామిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, జిల్లా మంత్రివర్యుల సహకారంతో వేలాది కోట్ల రూపాయల విలువైన నిధులు, ప్రాజెక్ట్ లు మంజూరవుతున్నాయని అన్నారు. సింగరేణి , ఎన్ టి పి సి , ఆర్ ఎఫ్ సి ఎల్ తదితర పరిశ్రమల సి ఎస్ ఆర్ నిధులతో స్థానికంగా పలు అభివృద్ధి పనులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సుమారు 16 వేల కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ ప్రాజెక్ట్ లు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. తద్వారా రామగుండం నగరంలో ఉపాధి ఉద్యోగావకాశాలు పెరుగుతాయని అన్నారు. సుమారు 150 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మిస్తున్నామని అన్నారు. గుండె పోటు వస్తే హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లవల్సిన అవసరం లేకుండా క్యాత్ లాబ్ సదుపాయం రామగుండం లోనే అందుబాటులోకి తీసుకువస్తున్నామని అన్నారు. రూ 230 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రామగుండం నగరంలో సాంకేతిక కళాశాలల తో పాటు ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు కూడా ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. ఈ రెండేళ్ల స్వల్ప కాలంలోనే నగరంలో ఇంత మార్పు పస్ఫుటంగా కనిపిస్తుంటే విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ ఎస్ . ఇ . గురువీర , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పి వి రామన్ , సెక్రెటరీ ఉమా మహేశ్వర్ తో పాటు నాయకులు మనాలి రాజ్ ఠాకూర్ , మహంకాళి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలి



**దోమ, జనవరి 17 (జనం సాక్షి) :** యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సర్పంచ్ అనంతయ్య సూచించారు. శనివారం దోమ మండల పరిధిలోని బాస్పల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలు ముగియడంతో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి, మొమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది సంక్రాంతి ఉత్సవాలు గ్రామంలో వైభవంగా నిర్వహిస్తామన్నారు. యువత ఎక్కువగా క్రీడా పోటీల్లో పాల్గొని ఉత్సహంగా క్రీడలు ఆడుతారన్నారు. ఈ క్రీడలకు తమ వంతుగా సహయంగా మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండవ బహుమతి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించామన్నారు. టోర్నమెంట్ మొత్తంలో బాస్పల్లి సూపర్ కింగ్స్ టీం మొదటి విజేతగా నిలువగా రూ. 20 వేల నగదు బహుమతిని గెలుపొందారు. అందలో నుంచి రూ.15 వేల నగదు డబ్బును గ్రామంలోని సలోన్పల్లి హనుమాన్ టెంపులు క్రీడాకారులు విరాళంగా అందించగా గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మల్లారెడ్డి, దేవాలయ ధర్మకర్త వెంకటదాసు, టీం కెప్టెన్ నరేశముదిరాజ్, వైస్ కెప్టెన్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిబసు జీవితం అందరికీ ఆదర్శం



**సంగారెడ్డి టౌన్, జనవరి 17 (జనం సాక్షి) :** సిపిఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతి బసు జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కృష్ణ అన్నారు. జ్యోతిబసు 16వ వర్ధంతి సందర్భంగా జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులుర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ జ్యోతి బసు ముఖ్యమంత్రిగా ఉండగా 24 లక్షల ఎకరాల మిగులు భూములు భూమిలేని పేద కుటుంబాలకు పంపిణీ చేసి దేశవ్యాప్తంగా అందరి మన్ననలు పొందారన్నారు. భారతదేశ రాజకీయాలలో తనదైన ముద్ర వేసిన ప్రజా నాయకుడు, కష్టజీవుల పక్షపాతిగా జీవితాంతం పోరాడిన శ్రామిక నేత జ్యోతిబసు అన్నారు. అట్టడుగు ప్రజల అభివృద్దే ఆలంబనగా ప్రభుత్వం నడిపారన్నారు. కార్మిక హక్కులు కాపాడడంలో, రైతాంగం ప్రయోజనాల రక్షణలో, మహిళలకు సమాన హక్కులు కల్పించడంలో, దళితులు, మైనార్టీలకు తోడు నీడగా సాగడంలో, స్థానిక సంస్థలకు నిధులు, విధుల కేటాయింపులో జ్యోతిబసు పాలనాస్ఫూర్తి ఎన్నటికీ మరువనిదన్నారు. ఆయన ఏ ఆశయ సాధన కోసం అయితే పరితమించారో ఆ ఆశయ సాధనకు అందరూ కృషి చేయడమే ఆయనకు అర్పించే ఘన నివాళు ౣన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాలరాజు, రాజు, దత్తు, సాయిలు, మంజుల, సుజాత, సంగన్న తది తరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తాం

- సీఎం ప్రవాసి ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జా అమరేందర్ రెడ్డి

**ఉప్పునుంతల, జనవరి 17 (జనం సాక్షి) :** రైతులు తమ పొలాలకు పోవడానికి ఇబ్బందులేకుండా చూస్తాం అని సీఎం ప్రవాస ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి అన్నారు మండల పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామంలో కేఎల్ఐ కాల్వల ద్వారా వచ్చే నీళ్ల కాల్వలో చెత్త పేరుకుపోయి అక్కడక్కడ కాల్వ కట్ట మధ్యలో మట్టి కొట్టుకుపోయే నీళు రోడ్డుమీద ఏరులై పారి చెరువుల మారడాన్ని వారు సంబంధిత శాఖ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేఎల్ఐ కాలువ అక్కడ ఎండు కావడం వల్ల ఆ నీళ్లు మొత్తం నాక్ష బాట వెంబడి రావడం వల్ల అక్కడున్న రోడ్డు మార్గం రాకపోకలకు అంతరాయం ఏర్పడి రైతులకు ఇబ్బందికరంగా మారిందని రైతులు అందరూ వాళ్ల సొంత డబ్బులు వేసుకుని వేసుకున్న రోడ్లు తెగిపోవడం వల్ల ఆ రోడ్ అంతా చెరువుల మారి రైతులకి వాళ్ళ పొలాలకి వెళ్ళటానికి త్రివుర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు కృష్ణ సహకారంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వారితో కలిసి పరిశీలించడం జరిగిందని త్వరలోనే సమస్యను పరిష్కరించి రైతుల రాకపోకలకు ఇలాంటి ఇబ్బంది కలవకుండా చూస్తామని వారు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో వారితో పాటు రైతులు గ్రామ ప్రజలు సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## "జనంసాక్షి" క్యాలెండర్‌ను ఆవిష్కరించిన శ్రీకాశీనాథ్ బాబా



**న్యాల్‌కల్, జనవరి 17 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోనే సుప్రసిద్ధ క్షేత్రంగా విరాజిల్లుతూ.. భక్తుల కోరిన కోరికలు తీరుస్తూ ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పంచవటి, పంచవటేశ్వర్ ల క్షేత్రాల పీఠాధిపతి శ్రీ కాశీనాథ్ బాబా.. "జనం సాక్షి" 2026 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. శనివారం మనూర్ మండలం, పంచగామ పంచవటి, న్యాల్ కల్ మండలం, రాఘవపూర్ గ్రామ శివారులోని పంచవటి క్షేత్రంలో స్థానిక భక్తకణంతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీ వైకుంఠ దత్తు మహారాజ్, సిద్రాం పాటిల్, మల్లారెడ్డి, విట్టల్ రెడ్డి, పలువురు తాజా మాజా ప్రతినిధులు, నాయకులు, కళాకారులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి



**సంగారెడ్డి, జనవరి 17 (జనం సాక్షి) :** యువత క్రీడలో రాణించాలని సంగారెడ్డి హెూప్ న్యూరో కార్డియాటిక్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి సూచించారు. శనివారం సింథోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంటుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. క్రీడలు మానసికుల్లాసం, దేహదారుడ్డానికి దోహదపడతాయన్నారు. యువత క్రీడల్లో రాణించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భాస్కర్, వట్టిపల్లి ఏఎంసి మాజీ డైరెక్టర్, బూత్కూర్ తలారి శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**సదాశివపేట, జనవరి 17 (జనం సాక్షి) :** మండల పరిధి నందికంది గ్రామంలోనీ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని కలెక్టర్ ప్రావిణ్య సోమవారం సందర్శించారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. తరువాత ఆలయ చరిత్ర గురించి కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాచర్ల స్రవంతి విజయభాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్,వార్డు మెంబర్లు, ఆర్ ఐ గంగాధర్,గ్రామస్తులు పాల్గొన్నారు.

# తూప్రాన్ మున్సిపల్ వార్డు రిజర్వేషన్లు ఖరారు


**తూప్రాన్, జనవరి 17 (జనం సాక్షి) :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ...మున్సిపాలిటీ వార్డుల మహిళా రిజర్వేషన్ ఖరారు చేయడం జరిగిందని లిజిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో...రిజర్వేషన్ ఖరారు ప్రక్రియ ని పారదర్శకం గా కలెక్టర్ నిర్వహించారు. జిల్లా లోని తూప్రాన్ మున్సిపాలిటీలో 16 వార్డులకు రిజర్వేషన్ ఖరారు లో భాగం గా మున్సిపాలిటీ కి సంబందించి వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ బీసీ ల డెడికేషన్ కమిషన్ ప్రకారం, ఎస్.సి, ఎస్.టి లది 2011 జనాభ లెక్కల ప్రకారం, మహిళ రిజర్వేషన్ ను...జీవో 9 ప్రకారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ ద్వారా కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా రిజర్వేషన్ కేటాయింపులు చేశామని ఈ సందర్బంగా కలెక్టర్ స్పష్టం చేసారు. మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీకి సంబంధించిన వార్డు రిజర్వేషన్ల ప్రక్రియ శనివారం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో పారదర్శకంగా పూర్తయ్యింది. ఈ ప్రక్రియ అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు, నాయకుల సమక్షంలో నిర్వహించబడింది. తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 16 వార్డులకు గాను రిజర్వేషన్లను అధికారికంగా ఖరారు చేసినట్లు అధికారులు ప్రకటించారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి: 1వ వార్డు జనరల్ మహిళ, 2వ వార్డు జనరల్, 3వ వార్డు జనరల్, 4వ వార్డు ఎస్టీ, 5వ వార్డు బీసీ జనరల్, 6వ వార్డు మహిళా జనరల్, 7వ వార్డు బీసీ జనరల్, 8వ వార్డు బీసీ మహిళ, 9వ వార్డు బీసీ జనరల్, 10వ వార్డు ఎస్సీ మహిళ, 11వ వార్డు ఎస్సీ జనరల్, 12వ వార్డు బీసీ మహిళ, 13వ వార్డు జనరల్, 14వ వార్డు మహిళా జనరల్, 15వ వార్డు మహిళా జనరల్, 16వ వార్డు మహిళా జనరల్‌గా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నాగేష్, స్పెషల్ ఆఫీసర్ సంధ్య, తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై రిజర్వేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు , మున్సిపల్ కమిషనర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఉద్యానవన పంటల అభివృద్ధికై రైతులకు రాయితీ

- జహీరాబాద్ డివిజన్ ఉద్యానవన శాఖాధికారి పండరి

**న్యాల్‌కల్, జనవరి 17 (జనం సాక్షి) :** "వర్షాధార అభివృద్ధి పథకం"లో భాగంగా.. ఉద్యానవన పంటల అభ్యున్నతికి రైతులకు శత శాతం రాయితీపై అవసరమైన పరికరాలు, మొక్కలు, విత్తనాలు, ఉద్యానవన ఆధారిత యంత్రాలు, పరికరాలు, తదితరులను అర్హులైన రైతులకు అందజేయనున్నట్లు జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల ఉద్యానవన శాఖాధికారి పండరి స్పష్టం చేశారు. శనివారం న్యాల్ కల్, అత్నూర్ గ్రామాల్లో ఆసక్తిగల పలువురు రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం డప్పుర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 2025 / 26 ఆర్థిక సంవత్సరానికి గాను న్యాల్ కల్ మండలంలో 100 గురు రైతులకు గాను, ఒక్కో రైతుకు రూ:30 వేల చొప్పున శతశాతం రాయితీపై నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం రూ:30 లక్షల వ్యయంతో ఉద్యానవన పంటల అభ్యున్నతికి దృష్టి సారించిందని స్పష్టం చేశారు. ఆసక్తిగల రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది మార్చి చివరి నాటికి "వర్షాధార అభివృద్ధి పథకం" ను ఉద్యానవన పంటల అభ్యున్నతికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికార సిబ్బంది విట్టల్, గుండయ్య, విజయ్ కుమార్, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ గౌడ్, రైతులు సలీం సాబ్, హణయ్య, ఈరన్న, నర్సింలు, వీరిశెట్టి, ఖాజామీయా, అరుణ్ గౌడ్, ప్రేమ్, చంద్రప్ప, బాబు మియా, తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐ ఖమ్మం సభను విజయవంతం చేయండి

- సిపిఐ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల

**కొడంగల్, జనవరి 17 (జనం సాక్షి) :** సీపీఐ శతాబ్ది ముగింపు సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పీర్ మహమ్మద్, సిపిఐ నియోజకవర్గ నాయకులు గంటి సురేష్ కుమార్ లు పిలుపునిచ్చారు, సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సిపిఐ నియోజకవర్గ నాయకుడు గంటి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో కోడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో శతాబ్ది ముగింపు సభ పోస్టర్ విడుదల చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ముగింపు బహిరంగ సభ ఈనెల 18న ఖమ్మంలో ఏర్పాటు చేస్తున్నామని, జిల్లాలోని పార్టీ, ప్రజా సంఘాలు ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు ప్రతీ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర ప్రధానంగా ఉందన్నారు, జనవరి 18న మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మంలో లక్షలాదిమందితో ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు, ఈ చారిత్రాత్మక సభకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి కార్మికులు, కర్షకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు, ఈ కార్యక్రమంలో బాబు. సావిత్రమ్మ. శ్యామప్ప. మల్కప్ప. శంకర్ నాయక్. శైలజ అబశ్రీశ్రీ కనకప్ప. పాండ్యా నాయక్. ఆశమ్మ. హనుమంతు. నరహరి. బాబా తదితరులు పాల్గొన్నారు.



## క్రీడా జ్యోతితో సీఎం కప్ ర్యాలీ



**చిలప్‌చేడ్, జనవరి 17 (జనంసాక్షి) :** క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సీఎం కప్ పోటీలకు సంబంధించి మండల కేంద్రమైన చిలప్ చేడ్ లో శనివారం క్రీడా జ్యోతితో నిర్వహించారు. ముందుగా మండల అధికారులందరూ కలిసి గ్రామ సర్పంచ్ అనిల్ చేతుల మీదుగా క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం క్రీడాకారులు విద్యార్థులు అధికారులు కలిసి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుండి గ్రామంలోని విధుల గుండా తిరుగుతూ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.శారీరక మానసిక దృఢత్వం కావాలంటే ప్రతి ఒక్కరు క్రీడలు ఆడటం తప్పనిసరి అని,రాష్ట్రం నుంచి ఒలంపిక్స్ ప్రాతినిధ్యం వహించేలా చేయడం లక్ష్యంగా ఈ సీఎం కప్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రశాంత్,ఎంఆర్వో సహదేవ్,ఆర్ఐ సునీల్ చౌహన్,ఎంఈఓ విట్టల్,ఏపిఎం గౌరీ శంకర్,ఎంపిఓ తిరుపతి,మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు సుధీర్ రెడ్డి,ఉపాధ్యక్షులు దుర్గచలం,కార్యదర్శులు కృష్ణ,నాగరాజు, అశోక్, జితేందర్,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**అచ్చంపేట, జనవరి 17 (జనం సాక్షి) :** మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక లక్ష్యం అని మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ ఇమ్మడి సైదులు అన్నారు బల్మూరు మండల మహాదేవపూర్ గ్రామంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదింటి పెద్దన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళల పట్ల చిత్తశుద్ధి చాటుకున్నారని రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు కల్పించారని అదేవిధంగా పెట్రోల్ బంకులు ఆర్టీసీ బస్సులు మహిళా సంఘం గ్రూపులకి అప్పజెప్పి ఉపాధి కల్పిస్తూ వారి బతుకులు భరోసా నింపారని వారు అన్నారు అంతేకాకుండా మహిళా క్యాంటీన్లు వడ్డీ లేని రుణాలు అందించి మహిళా అభివృద్ధికి తోడ్పడ్డారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ద్యాసని లలితమ్మ బల్మూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెల్లమల్ల రాంప్రసాద్ గౌడ్ వార్డ్ మెంబెర్స్,మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు కల సాకారం

**మక్తల్, జనవరి 17 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణంలో నూతనంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు కావడంతో మక్తల్ ప్రాంత ప్రజల కల సాకారమైందని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. కోర్టు ఏర్పాటు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శనివారం కోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జాతీయ జెండాలను చేతబట్టి పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. మంత్రి నివాసం నుంచి భారీ ర్యాలీగా తరలివచ్చి 167వ జాతీయ రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతఅబశ్రీశ్రీరం పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కోర్టు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారన్నారు. కర్ణాటక సరిహద్దున ఉన్న మండలంలో చివరి గ్రామాలు నారాయణపేట కోర్టుకు వెళ్లేందుకు 75 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదన్నారు. దీంతో చాలా వ్యయ ప్రయాసలకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రాంతంలో కోర్టు ఏర్పాటు కావాలని చాలా కాలంగా కోరుతున్నప్పటికీ కోర్టు ఏర్పాటు కలగానే మిగిలిపోయిందన్నారు. ఎట్టకేలకు జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు సముదాయం ఏర్పాటు కావడం శుభపరిణామన్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజల కల నెరవేరిందన్నారు. కోర్టు ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి. లక్ష్మారెడ్డి, కట్ట సురేష్ కుమార్, బి. గణేష్ కుమార్, బోయ రవికుమార్, కోళ్ళ వెంకటేష్, కావాలి తాయప్ప, నూరుద్దీన్, తదిగోవర్ధన్, గాయత్రి అనిల్ కుమార్, ఉసామోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# దేవాలయ అభివృద్ధికి పాటుపడాలి

**మల్దకల్, జనవరి 17 (జనంసాక్షి) :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి విలేకరులు తమ వంతు పాత్ర వహించి అభివృద్ధికి కృషి చేయాలని దేవాలయ చైర్మన్ వ్యవస్థాపక వంశీయులు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు తెలిపారు. శనివారం దేవాలయ ప్రాంగణంలో మల్దకల్ మండలానికి చెందిన విలేకరులను ఘనంగా శాలువా పూలమాలతో సత్కరించి స్వామివారి మోమెంటులు అందజేశారు. అంతకు ముందు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ బ్రహ్మోత్సవాలు దేవాలయ బ్రహ్మోత్సవాలు వైకుంఠ ఏకాదశి పర్వదినాల సందర్భంగా ఆయా దినపత్రికలలో ప్రముఖంగా ప్రచురించి దేవాలయ విశిష్టతను ప్రజలకు తెలిపారని అన్నారు. అపర తిరుపతిగా వెలసిల్లుతున్న మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామి క్షేత్రం భవిష్యత్తులో ఇంకా అనేకమంది భక్తులు సందర్శించి స్వామివారి కృప కటాక్షాలకు నోచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన జర్నలిస్టులతోపాటు చంద్రశేఖరరావు,తాటికుంట రామచంద్రారెడ్డి, బాబురావు, నరేందర్, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## నాంచారి మదూరు గ్రామాన్ని మండలంగా చేయాలి

- జాతీయ రహదారిపై రాస్తారోకో ధర్నా నిర్వహించిన గ్రామస్తులు



తొర్రూరు, జనవరి 17 (జనంసాక్షి) : మహబూబాద్ జిల్లా తొర్రూరు మండలం పరిధిలో కలిగిన నాంచారి మదూరు గ్రామంను ప్రత్యేక మండలం చేయాలని గ్రామంలో ఉన్న యువకులు, వ్యాపారవేత్తలు, విద్యావంతులు వరంగల్ టు ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. నాంచారి మదూరు గ్రామం మండలానికి అన్ని అర్హతలు కలిగి ఉంది. టిజిజివిపిబ్యాంకు కలదు దీని పరిధిలో 14 గ్రామాలు, తండా గ్రామపంచాయతీలో సహా ఉన్నాయి. ఈ గ్రామాలన్నింటిని కలిపి మండలంగా ప్రకటించాలని ఊరు ప్రజలు డిమాండ్ చేశారు. వాణిజ్య వ్యాపారానికి, విద్యారంగానికి, రహదారి మార్గానికి ప్రయాణికులకు హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, పాలకుర్తి, కొడకండ్ల స్టేషన్ఘన్పూర్ వెళ్లడానికి కూడలిగా ఉంటుంది. అన్నిటికీ అర్హత కలిగిన గ్రామం గనుక మండలం చేయాలని గ్రామంలోని ప్రజలు యువత, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు మహిళా సంఘాలు జాతీయ రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహించి ప్రత్యేక మండలం కోసం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలం నూతన సాధన కమిటీ అధ్యక్షులు ఆకుతోట యాకన్న ,ఉపాధ్యక్షులు గుంటుక కుమారస్వామి, మంచె సుమన్, కర్ర విజయకుమార్, దానం బుచ్చయ్య, అధికార ప్రతినిధులు ఇమ్మడి రమేష్, పప్పోజు డాక్టర్ సోమన్న, ప్రధాన కార్యదర్శి సనికినేని శ్రీనివాస్, మంద యాకమల్లు, దుస్స వీరన్న ,మడిపెద్ది శ్రీనాథ్, కార్యవర్గ సభ్యులు ,యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఆపద్భాందవులుగా 108 సిబ్బంది

- మేడారం మహా జాతర భక్తుల అత్యవసర సేవలు
- అధికారుల, భక్తుల ప్రశంశలు



ములుగు బ్యూరో, జనవరి 17 (జనం సాక్షి): ఆసియా ఖండంలోనే అది పెద్ద గిరిజనుల జాతరగా,తెలంగాణ కుంభమేళా గా పేరుగాంచిన శ్రీ సమ్మక్క సారక్క మహా జాతర ముఖ్యమైన తేదీలు అది దగ్గరగా సమీపిస్తుండటంతో ముందస్తు మొక్కులు తీర్చు కోవడానికి రాష్ట్ర నలుమూల నుండి భక్తులు అధిక సంఖ్యలో లెక్కకు మించి వస్తుండడంతో ఇసుక పోస్తే రాలనంత జనం ఎక్కడ చూసినా మాంసపు వ్యర్థపదార్థాలు, దుమ్ము ధూళితో సతమత మవుతున్న భక్తులు,సరిగా ఊపిరి కూడా పీల్చుకోలేని వాతావరణ కలుషిత నీరు, అపరి శుభ్రమైన ప్రదేశాల్లో వంట వార్పు చేసి తినేస్తున్న భక్తులకు అకస్మాత్తుగా, కడుపునొప్పి, విరేచనాలు, వాంతులు,కళ్ళు తిరిగిపడి పోవడం, మూర్ఛ, జ్వరం దగ్గు, మొదలగు బాధితుల పక్షాన మేమున్నాం అని భరోసానిచ్చి ఆపద్బాంధవులుగా నిలుస్తూ అత్యవసర సేవలు అందిస్తున్న అంబులెన్స్ సేవకులు, ఆదుకునే ఉపకారులు. ఎన్నోరకాల ప్రమాదాలు,రోడ్డు ప్రమాదాలు,సమ్మక్క,సారక్క గద్దెల వద్ద క్యూ లైన్ లో నిలుచుని సొమ్మసిల్లి పడిపోయిన బాధితులకు తక్షణమే అత్యవసర చికిత్స అందించి అధికారుల అభినందనలు అందుకుంటున్నారు. శనివారం రోజున సమ్మక్క ప్రధాన ద్వారం వద్ద విధుల్లో ఉన్న ఓ పోలీసు అధికారికి మూర్ఛ వచ్చి అక్కడే కుప్ప కూలిపోయిన విషయాన్ని కమాండ్ కంట్రోల్ పోలీస్ శాఖ వారి నుండి తెలుసుకున్న 108 సిబ్బంది తక్షణమే స్పందించి ఊపిరి పోశారు. ప్రాణాదదాతలుగా నిలిచి వందల మంది అధికారులు ప్రశంశలు పొందారు. ఈ మహాజాతరకు అదనంగా మరో 24 అత్యవసర అంబులెన్స్ వాహనాలతో పాటు బైక్ అంబులెన్స్ సేవలు కూడా అతి చేరువలో అందిస్తాయని రాష్ట్ర అత్యవసర అంబులెన్స్ సంస్థ అధికారులు తెలిపారు.

## ద్విచక్ర వాహనాల ఘరానా దొంగ అరెస్టు

- 4 లక్షల విలువచేసే, 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- 12 మంది అరెస్ట్
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : జిల్లాలో వరుసగా ద్విచక్రవాహనాలు దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను శనివారం జిల్లా పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. ఈమేరకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆసుపత్రిలే టార్గెట్ గా దొంగతనాలు చేస్తున్న తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని జల్సా లకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్న ఘరానా దొంగ చౌహాన్ శ్రావణ్ కుమార్ రమేష్ ను అరెస్టు చేసి అతని వద్ద నుండి 12 ద్విచక్ర వాహనాలను తిరిగి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఇతని వద్దనుండి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల విలువ 3,86,000 వేల వరకు ఉంటుందని తెలిపారు. ద్విచక్ర వాహనాలు ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి వద్ద, మరియు నిర్మల్ లోని ఆసుపత్రుల వద్ద దొంగలించి పలువురికి విక్రయించడం జరిగింది. దొంగ బండ్లను ఎలాంటి పత్రాలు లేకుండా కొనుగోలు చేసిన 12 మంది పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరు ముఖ్యంగా వాహన నంబర్లను చెరిపివేసి నకిలీ నంబర్ ప్లేట్లను తప్పుడు నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకొని తప్పించుకుంటూ తిరుగుతున్నట్లు అదే విధంగా వాహనాలకు ఉన్నటువంటి చేసిస్ నెంబర్లను చెరిపేసి వాహనాలపై సంచరిస్తున్నట్లు తెలిపారు. దొంగ బండ్లను తెలిసిన కొనుగోలు చేసి వాటిని వినియోగిస్తున్న అందరిపై కేసు నమోదు చేసినట్లు 12 మందిలో 11 మందిని అరెస్టు చేసినట్టు, ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరందరిని రిమాండ్ కై జిల్లా న్యాయస్థానానికి తరలించడం జరుగుతుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల ఆస్తికి నష్టం కలిగించేలా వ్యవహరించేలా ప్రవర్తించిన వారిని విడిచి పెట్టేది లేదని కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ వాహనాలను దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఎలాంటి పత్రాలు లేకుండా వాహనాలను కొనుగోలు చేయవద్దని ఎస్పీ సూచించారు. వాహన పత్రాలు లేకుండా కొనుగోలు చేసినట్లయితే కొనుగోలుదారులు కూడా నిందితులుగా పరిగణింపబడతారని తెలిపారు. సరైన పత్రాలు లేకుండా వస్తువులను, నగలను, వాహనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, ఎస్సైలు పీర్ సింగ్, విష్ణు ప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతరలోపు పనులు పూర్తి చేయాలి

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం
- హైమాస్ లైట్లు మంజూరు చేసిన ఎంపీ కడియం కావ్య



స్టేషన్ ఘన్పూర్, జనవరి 17 (జనంసాక్షి) : ఈ నెల 10వ తేదీన స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని మినీ సమ్మక్క సారలమ్మ జాతరల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో జాతర ప్రాంతాలలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా అధికారులతో, జాతర కమిటీ సభ్యులతో, సర్పంచులతో చర్చించారు. జాతర ప్రాంతాలలో ఫార్మేష న్ రోడ్లు, విద్యుత్, త్రాగు నీరు, పారిశుధ్యం వంటి పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. ఈ సమీ క్షలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్టేషన్ ఘనపూ ర్ మండలంలోని జిట్టేగూడెం,ఇప్పగూడెం చిల్పూ ర్ మండలం లోని గార్లగడ్డ తండ, లింగంపల్లి, శ్రీపతిపల్లి, చిల్పూర్ మినీ సమ్మక్క సారలమ్మ జాతరలలో ఎంపీ నిధుల ద్వారా హైమాస్ లైట్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు 6జాతరలలో 9లక్షల రూపాయలతో 6 హైమాస్ లైట్లను మంజూరు చేయించారు. 25వ తేదీలోపు అన్ని పనులు పూర్తి చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవం తంగా నిర్వహిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, మార్కెట్ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఏసీపి బీమ్ శర్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 15 ఏండ్ల నిరీక్షణకు ముగింపు

- ఎమ్మార్వో మానవీయ చొరవకు పట్టా న్యాయం
- ప్రజలకు దగ్గరైన పరిపాలనకు ఇది ఉదాహరణ
- క్షేత్రస్థాయిలో మార్పు తీసుకొచ్చిన రెవెన్యూ అధికారి
- భూభారతి పోర్టల్‌తో భూహక్కు భరోసా
- ఎమ్మార్వో చొరవకు పలువురి అభినందనలు



పర్వతగిరి, జనవరి 17 (జనంసాక్షి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో ఎమ్మార్వో చూపిన మానవీయ చొరవ, పరిపాలనా నిబద్ధత రాష్ట్ర ప్రభుత్వ "ప్రజా పాలన" లక్ష్యాలకు ప్రతిబింబంగా నిలుస్తోంది. పర్వతగిరి గ్రామ శివారులోని సర్వే నెం.541 లో 2.10 ఎకరాల వ్యవసాయ భూమి చీదురు సాయిలు పేరిట ఉండగా,ఆయన 04-10-2011 తేదీన మరణించారు. అనంతరం ఆయన కుమారుడు చీదురు ఏకంబ్రం హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ పక్షవాతం బారిన పడి తీవ్ర అనారోగ్యానికి గురవడంతోపాటు ఆర్థికంగా బలహీన స్థితిలోకి వెళ్లారు. ఈ కారణంగా తన తండ్రి ఆస్తికి సంబంధించిన వారసత్వ పట్టా మార్పిడి ప్రక్రియను గత 15 సంవత్సరాలుగా పూర్తి చేసుకోలేకపోయారు. ఇటీవల బాధిత కుటుంబ సభ్యులు తమ దుస్థితిని ఎమ్మార్వో దృష్టికి తీసుకురాగానే,ఆయన ఫైల్ కోసం ఎదురుచూడకుండా, దరఖాస్తుదారుడి పరిస్థితిని స్వయంగా అర్థం చేసుకొని తక్షణమే స్పందించారు. భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తును నమోదు చేయించి,అన్ని రికార్డులను పరిశీలించి,క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేసి అత్యంత వేగంగా పట్టా మార్పిడి ప్రక్రియను పూర్తి చేశారు. శనివారం రోజు చీదురు ఏకంబ్రం పేరిట డ్రాఫ్ట్ పట్టాదార్ పాస్‌బుక్‌ను అధికారికంగా ఎమ్మార్వో కార్యాలయంలో అందజేయడం జరిగింది. ఇది కేవలం ఒక పట్టా మార్పిడి మాత్రమే కాకుండా, 15 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్న ఒక అనారోగ్య బాధిత కుటుంబానికి లభించిన భరోసాగా మారింది. ప్రభుత్వ సేవలు కార్యాలయాలకే పరిమితం కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి సంకల్పానికి, పరిపాలనలో మానవీయతను ప్రధానంగా ఉంచాలన్న చీఫ్ సెక్రటరీ ఆదేశాలకు, క్షేత్రస్థాయిలో కలెక్టర్ దిశానిర్దేశాలకు ఈ చర్య పూర్తి అనుగుణంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పత్రాలు లేవనే కారణంతో సమస్యలను పక్కన పెట్టకుండా, అర్హత ఉన్న పేద కుటుంబానికి న్యాయం చేయాలన్న దృఢ సంకల్పంతో పనిచేసిన ఎమ్మార్వో సేవలు రెవెన్యూ వ్యవస్థకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇటువంటి అధికారులే ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెంచుతారని స్థానికులు కొనియాడుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాల గేటుకు తాళం!

- మాజీ ఎస్ఎంసి చైర్మన్ నమిండ్ల సురేష్ ఆందోళన
- చేసిన పనులకు డబ్బులు రాకపోవడంతో నిరసన
- ఇంటి దారి పట్టిన ఉపాధ్యాయులు, విద్యార్థులు



చెన్నారావుపేట, జనవరి 17 (జనంసాక్షి) : మన ఊరు- మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులను చేపడితే చేసిన పనులకు డబ్బులు రాకపోవడంతో మాజీ ఎస్ఎంసి చైర్మన్ నమిండ్ల సురేష్ పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేసిన సంఘటన లింగాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... లింగాపురం ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన నమిండ్ల సురేష్ 3 సంవత్సరాల క్రితం ఎస్ఎంసి చైర్మన్ గా ఉన్నాడు. ఆ సమయంలో మన ఊరు- మనబడి కార్యక్రమం కింద పాఠశాలలో బిల్డింగ్ పైకప్పు సీలింగ్ మరమ్మత్తులు, నూతన ఫ్యాన్ల ఏర్పాటు, విద్యుత్ మరమ్మత్తు పనులు, గదులలో నూతనంగా ఫ్లోరింగ్ బండల ఏర్పాటు, చేతులు కడుక్కోవడానికి ప్లాట్ ఫామ్ నిర్మాణం, తాగునీటి కోసం సంపు, మోటర్ ఏర్పాటు, పాఠశాలలోని గదులలో ప్యాచ్ వర్క్ లు, మరుగుదొడ్ల మరమ్మత్తులు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, పాఠశాల ముందు గేటు ఏర్పాటు లాంటి అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపాడు. మొత్తం రూ. 10 లక్షల వరకు పాఠశాలలో అభివృద్ధి పనులను చేశానని చేపట్టిన మొదటి సంవత్సరంలో రూ.4 లక్షల బిల్లులు వచ్చినట్లు తెలిపాడు. అప్పటినుండి ఇప్పటివరకు మిగతా రూ. 6 లక్షల బిల్లులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పుల భారంతో తనకు ఉన్న ట్రాక్టర్ కూడా అప్పుల వాళ్లు గుంజుకొని పోయారని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. విద్యాశాఖ అధికారుల చుట్టూ తిరిగిన చేసిన పనులకు బిల్లులు రావడం లేదని అందుకే పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపాడు. వెంటనే తనకు రావలసిన రూ. 6 లక్షల బిల్లులను వెంటనే జిల్లా విద్యాశాఖ, సంబంధిత అధికారులు అందించాలని వేడుకుంటున్నాడు. పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేయడంతో చేసేది ఏమీ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇంటిదారి పట్టారు.



## జె-పిఏఎల్ ప్రాజెక్టు రైతులకు ఆర్థిక ప్రోత్సాహకం

భీమదేవరపల్లి, జనవరి 17 (జనంసాక్షి) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జె-పిఏఎల్ ప్రాజెక్టు ద్వారా తడి-పొడి (ఏడబ్ల్యుడీ) విధానంలో సుస్థిర వరి సాగు చేసిన రైతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేశారు. శనివారం సంఘ ఆవరణలో జరిగిన సమావేశానికి సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అధ్యక్షత వహించారు. సాటిలైట్ మానిటరింగ్ ఆధారంగా ఎంపికైన 216 మంది రైతులకు సుమారు రూ.8.15 లక్షల ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట సీనియర్ సైంటిస్ట్ డా. యన్.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, తడి--పొడి విధానంతో నీటి వినియోగం, సాగు వ్యయం తగ్గి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రతిష్ఠాత్మక జె-పిఏఎల్ ప్రాజెక్టుకు ములుకనూరు రైతులను ఎంపిక చేయడం గర్వకారణ మన్నారు. సుస్థిర వరి సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలంలో ఆర్థిక లాభాలు చేకూరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జనరల్ మేనేజర్ యం.రాంరెడ్డి, జె-పిఏఎల్ సౌత్ ఏషియా రీసెర్చ్ మేనేజర్ నితీష్ భరద్వాజ్,రీసెర్చ్ అసోసియేట్ నయన్ చంద్రా,రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ల డ్రా


- పరకాల మున్సిపల్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు...
- రిజర్వేషన్ల డ్రా తీసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్..



హనుమకొండ ప్రతినిధి, జనవరి 17 (జనంసాక్షి) : హనుమకొండ జిల్లా పరకాల మున్సిపల్ కు సంబంధించిన 22 వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు లో పరకాల మున్సిపల్ పరిధిలోని 22 వార్డు స్థానాలకు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ పద్ధతిన రిజర్వేషన్లకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ డ్రా తీశారు. డ్రా తీసిన వార్డుల రిజర్వేషన్ల జాబితాను కలెక్టర్ ప్రకటించారు. 1వ వార్డు అన్ రిజర్వ్, 2వ వార్డు జనరల్ మహిళ, 3వ వార్డు బీసీ మహిళ, 4వ వార్డు ఎస్సీ మహిళ, 5వ వార్డు బీసీ మహిళ, 6వ వార్డు జనరల్ మహిళ, 7వ వార్డు అన్ రిజర్వుడ్, వార్డు అన్ రిజర్వుడ్, 9వ వార్డు అన్ రిజర్వుడ్, 10వ వార్డు జనరల్ మహిళ, 11 వ వార్డు ఎస్సీ జనరల్, 12వ వార్డు జనరల్ మహిళ, 13వ వార్డు జనరల్ మహిళ, 14వ జనరల్ మహిళ, 15వ వార్డు బీసీ జనరల్, 16వ వార్డు బీసీ జనరల్, 17వ వార్డు ఎస్సీ మహిళా, 18వ వార్డు జనరల్ మహిళ, 19వ వార్డు ఎస్సీ జనరల్, 20వ వార్డు ఎస్టీ జనరల్, 21వ వార్డు ఎస్సీ జనరల్, 22వ వార్డు బీసీ మహిళ కు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. ఈ సందర్భంగా పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య గత రిజర్వేషన్లు, ప్రస్తుత రిజర్వేషన్ల కేటాయింపు గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నెమురుగొమ్ముల రవి, పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ.వి. శ్రీనివాసరావు, ఆర్పి జయంత్ లాల్, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్, రజనీకాంత్, ప్రవీణ్ కుమార్, సయ్యద్ ఫైజుల్లా, రాజు, వెంకట్, నేహాల్, శ్రీనివాస్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి మున్సిపాలిటీని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా

- మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా
- రూ.50కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం
- సీఎం నిధులతో మరింత అభివృద్ధి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): అభివృద్ధిలో భూపాలపల్లి మున్సిపాలిటీకి ఢోకా లేదని, రాష్ట్రం లోనే ఈ మున్సిపాలిటీని నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతానని, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, ఇప్పటికే రూ.50కోట్లతో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని, సీఎం నిధుల నుండి వంద కోట్లు మంజూరు చేయించి మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి, పెద్దకుంటపల్లి, జంగేడులో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్ల విస్తరణ, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, కమ్యూనిటీ హాల్స్ తదితర పనులు ఈ అభివృద్ధి కార్యక్రమాలలో భాగమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన భూపాలపల్లి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా సహకరించి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జవహార్ నగర్ శివారులో ప్రజల సౌకర్యార్థం నూతన రోడ్డు ఏర్పాటు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

### కొత్త రేషన్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే..

మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శనివారం ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే మాట్లాడారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందజేయాలన్నదే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులు సులభంగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రేషన్ సరుకులు పొందేందుకు అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని, సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు.

### జంగేడు క్రికెట్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే..

యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జంగేడు క్రికెట్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని క్రికెట్ ఆడారు. అనంతరం కేకు కట్ చేసి పలువురు క్రీడాకారులకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రికెట్ వంటి క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జంగేడు క్రికెట్ అసోసియేషన్ సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.

### పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే..

పేదల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం ఉదయం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భూపాలపల్లి, గణపురం మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 77 మంది లబ్ధిదారులకు రూ.22,59,500ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల కష్టాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని, భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, నాయకులు బుర్ర కొమురయ్య, ముంజాల రవీందర్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, రవీందర్, తోట రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
18 జనవరి 2026

# హాలియా మున్సిపాలిటీలో రిజర్వేషన్లు ఖరారు

- ఎన్నికల హడావుడి మొదలు

**హాలియా, జనవరి 17 (జనం సాక్షి) :** రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హాలియా పురపాలక పరిధిలో వార్డుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. మొత్తం 12 వార్డులకు సామాజిక వర్గాల వారీగా, మహిళా రిజర్వేషన్లు, సాధారణ విభాగాల కేటాయింపులు అధికారికంగా ప్రకటించడంతో రాజకీయ అనిశ్చితి తొలగింది.

ఛైర్మన్ పదవి ఈసారి జనరల్ విభాగానికి కేటాయించబడింది. గత ఎన్నికలతో పోలిస్తే రిజర్వేషన్ కేటాయింపుల్లో కొన్ని మార్పులు చోటు చేసుకోవడం గమనార్హం.

### వార్డు వారీ రిజర్వేషన్ వివరాలు ఇలా ఉన్నాయి:

1వ వార్డు – బీసీ (జనరల్), 2వ వార్డు – జనరల్ (మహిళా), 3వ వార్డు – జనరల్ (జనరల్), 4వ వార్డు – జనరల్ (మహిళా), 5వ వార్డు – జనరల్ (మహిళా), 6వ వార్డు – ఎస్సీ (జనరల్), 7వ వార్డు – జనరల్ (జనరల్), 8వ వార్డు – జనరల్ (మహిళా), 9వ వార్డు – బీసీ (జనరల్), 10వ వార్డు – బీసీ (మహిళా), 11వ వార్డు – ఎస్టీ (జనరల్), 12వ వార్డు – ఎస్సీ (మహిళా).

### రాజకీయ పార్టీల పావులు వేగం..

రిజర్వేషన్ ప్రకటన వెలువడిన వెంటనే ప్రధాన రాజకీయ పార్టీలు గ్రౌండ్ స్థాయి వ్యూహాలను వేగంగా మార్చుకుంటున్నాయి. ప్రతి పార్టీ తమకు అనుకూలమైన వార్డుల్లో బలమైన అభ్యర్థులను నిలబెట్టే ప్రయత్నాలు ప్రారంభించాయి.

స్థానిక నాయకులు అనుచరులతో భేటీలు, ఇంటింటి సందర్శనలు, అభ్యర్థుల ఎంపికపై ఆంతర్య చర్చలు




మొదలుపెట్టడంతో ఎన్నికల హడావుడి స్పష్టంగా కనిపిస్తోంది. అలాంటి పరిస్థితుల్లో మహిళా రిజర్వేషన్ ఉన్న వార్డులలో కొత్త ముఖాలను ప్రోత్సహించాలా? లేక సీనియర్లనే ముందుకు తేవాలా? అన్న దానిపై పార్టీల్లో గట్టిగా చర్చ జరుగుతోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

### వర్గాల వారీ అనిశ్చితి తొలగింపు...

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించిన వార్డుల కేటాయింపులతో ఆయా వర్గాల నాయకుల్లో కొంత ఉపశమనం వ్యక్తమవుతోంది. గత నెల రోజుల నుంచి రిజర్వేషన్ అంశంపై అనేక ఊహాగానాలు వెల్లువెత్తాయి. అనేక బస్తీలలో, కాలనీలలో దారితీరు మారుతుందన్న భావన రాజకీయ చర్చలకు దారి తీసింది. ఇప్పుడు కేటాయింపులు స్పష్టత వచ్చిన నేపథ్యంలో ఆ అవకాశాలు తగ్గాయి.

### ఛైర్మన్ కుర్చీపై ఆసక్తి...

ఈసారి ఛైర్మన్ స్థానాన్ని జనరల్ విభాగానికి కేటాయించడంతో పలువురు ఆశావహులలో ఉత్సాహం ఎక్కువయింది. గతంలో రిజర్వేషన్ కారణంగా పోటీ చేయలేకపోయిన నాయకులు ఈసారి బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఒకటి కంటే ఎక్కువ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.

### పెరిగిన నాయకుల సందర్శనలు..

ఈనెల ప్రారంభం నుండి నగరంలోని ప్రధాన కాలనీలు, గ్రామాలు, బస్తీలలో పలువురు రాజకీయ నాయకులు ప్రత్యక్షమవుతున్నారు. పాత అనుబంధాలు మరల మమకారంగా చూపిస్తూ, కొత్త పుంతలు తొక్కే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజల సమస్యలు, మౌలిక వసతులు, డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు వంటి అంశాలు ప్రధాన చర్చగా మారాయి.

పరిశీలకుల విశ్లేషణ..

### ప్రాంతీయ రాజకీయ విశ్లేషకుల అంచనా ప్రకారం

రిజర్వేషన్ ప్రకటన ఎప్పుడూ ఎన్నికల సమీకరణలను మార్చుతుంది. కొన్ని వార్డుల్లో బలమైన అభ్యర్థులు మార్చబడవచ్చు. మహిళా, బీసీ రిజర్వేషన్ భాగం పెరగడం ద్వారా కొత్త రాజకీయ నాయకత్వం వెలుగులోకి రావచ్చు అని అభిప్రాయపడుతున్నారు.

### ప్రజల్లో పెరిగిన ఆసక్తి..

అనధికారికంగా ఎన్నికల పనులు మొదలైన నేపథ్యంలో ఓటర్లలో కూడా ఎన్నికలపై చర్చలు పెరిగినట్లు గమనించవచ్చు. ప్రత్యేకంగా యువతలో సోషల్ మీడియా ద్వారా రాజకీయ ప్రచారం పెరుగుతుందని స్థానిక మీడియా వర్గాలు చెబుతున్నాయి.

## సూర్యాపేట మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ఖరారు



**సూర్యాపేట, జనవరి 17 (జనంసాక్షి) :** సూర్యాపేట మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ఖరారయ్యాయి. శనివారం జిల్లా కలెక్టరేట్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వార్డుల రిజర్వేషన్లను ప్రకటించారు. 1వ వార్డు – ఎస్టీ జనరల్,2వ వార్డు – బీసీ, జనరల్, 3వ వార్డు – ఎస్సీ జనరల్, 4వ వార్డు – జనరల్ మహిళ, 5వ వార్డు ఎస్టీ మహిళ, 6వ వార్డు – జనరల్,7వ వార్డు ఎస్సీ జనరల్,8వ వార్డు – ఎస్సీ మహిళ,9వ వార్డు – జనరల్ మహిళ,10వ వార్డు –జనరల్,11వ వార్డు బీసీ మహిళ,12వ వార్డు – బీసీ జనరల్, 13వ వార్డు ఎస్టీ మహిళ, 14వ వార్డు – బీసీ జనరల్,15వ వార్డు – బీసీ మహిళ,16వ వార్డు – జనరల్,17వ వార్డు – బీసీ మహిళ,18వ వార్డు – జనరల్,19వ వార్డు – ఎస్సీ జనరల్,20వ వార్డు – జనరల్ మహిళ,21వ వార్డు – ఎస్సీ మహిళ,22వ వార్డు – జనరల్ మహిళ,23వ వార్డు – జనరల్ మహిళ,24వ వార్డు – జనరల్,25వ వార్డు – జనరల్ మహిళ,26వ వార్డు – జనరల్ మహిళ,27వ వార్డు – జనరల్ మహిళ,28వ వార్డు – ఎస్సీ,29వ వార్డు – జనరల్ మహిళ,30వ వార్డు – ఎస్సీ మహిళ,31వ వార్డు – జనరల్,32వ వార్డు – ఎస్టీ జనరల్,33వ వార్డు – జనరల్,34వ వార్డు – బీసీ జనరల్,35వ వార్డు – జనరల్ మహిళ,36వ వార్డు – బీసీ మహిళ, 37వ వార్డు – జనరల్, 38వ వార్డు – జనరల్, 39వ వార్డు – బీసీ మహిళ, 40వ వార్డు – జనరల్, 41వ వార్డు – బీసీ, 42వ వార్డు – జనరల్, 43వ వార్డు – బీసీ మహిళ, 44వ వార్డు – జనరల్ మహిళ, 45వ వార్డు – జనరల్ మహిళ, 46వ వార్డు – జనరల్ మహిళ, 47వ వార్డు – బీసీ జనరల్, 48వ వార్డు – బీసీ జనరల్.

## ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న కారు బోల్తా

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు





**తుంగతుర్తి, జనవరి 17 (జనం సాక్షి) :** ప్రమాదవశాత్తు కారు ప్రమాదానికి గురై కారులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులు ఇద్దరు మృత్యువాత పడడంతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సూర్యాపేట జిల్లా అర్వపల్లి హైవేపై సోమవారం ఉదయం చోటు చేసుకుంది, వివరాల్లోకి వెళితే సంక్రాంతి సెలవుల అనంతరం విధుల్లో చేరేందుకు కారులో ప్రయాణిస్తున్న నల్లగొండకు చెందిన నలుగురు ప్రధానోపాధ్యాయులు అర్వపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం లో ఇద్దరు మహిళ ఉపాధ్యాయులు మృత్యువాత పడగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి, వీరు ప్రతిరోజు నల్లగొండ నుండి తుంగతుర్తి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జిహెచ్ఎం గా పనిచేస్తున్న అలుగు ప్రవీణ్ కుమార్, కస్తూరిబా పాఠశాలలో ప్రత్యేక అధికారిగా పనిచేస్తున్న కల్పన, రావుల పెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జిహెచ్ఎం గా పనిచేస్తున్న పోరెడ్డి గీతారెడ్డి, అన్నారం జిల్లా పరిషత్ పాఠశాలలో గెజిటెడ్ హెడ్మాస్టర్ అలుగు సునీత పనిచేస్తున్నారు, ఈ క్రమంలో సంక్రాంతి సెలవులు ముగియడంతో వీరంతా కారులో రోజువారీగా విధులకు బయలుదేరారు మార్గమధ్యంలో అర్వపల్లి వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది, ఈ దుర్ఘటనలో తుంగతుర్తి మండల కేంద్రంలో కస్తూరిబా పాఠశాలలో స్పెషలాఫీసర్ గా పని చేస్తున్న కల్పన తీవ్ర గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందింది, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు, అక్కడ పరిస్థితి విషమించడంతో వారిని హైదరాబాద్కు తరలిస్తుండగా మార్గమధ్యంలో రావులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జిహెచ్ఎం గా పనిచేస్తున్న గీత మార్గమధ్యంలో చనిపోయింది, మరో ఇద్దరు ప్రధానోపాధ్యాయులకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాదులో ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు వీరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం, కాగా అలుగు సునీత, నాలుగు ప్రవీణ్ కుమార్ అక్క తమ్ముడు, దీంతో అన్నారం, రావులపల్లి, కస్తూరి బా, తుంగతుర్తి పాఠశాలలో విషాదం నెలకొంది ఈ మేరకు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన ప్రమాదంపై విచారించారు, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

## కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడండి

- పివైఎల్ రాష్ట్ర నాయకులు నోముల భానుచందర్



**టేకులపల్లి, జనవరి 17 (జనంసాక్షి) :** టేకులపల్లి మండలంలో కోతులు,కుక్కల స్వైర విహారంతో మందలకు మందలే ఇళ్లల్లోకి జొరబడుతూ వస్తువులను ఎత్తుకెళుతూ, మనుషుల మీద ఎగబడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, కోతులు,కుక్కలు కరిసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని, ప్రభుత్వ వైద్యశాలలో వ్యాక్సిన్లు వేయించుకొని నమోదు కాబడినవి ఎన్నో ఉన్నాయన్నారు. దీంతో మండలంలోని 36 గ్రామపంచాయతీలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రగతిశీల యువజన సంఘం( పి వై ఎల్ ) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ అన్నారు. శనివారం ఒక ప్రకటనలో వివరిస్తూ కోతులు, కుక్కల వల్ల మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురుతున్నారని,వాటి మూలాన గ్రామాలలో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు గాయాల పాలవుతున్నారని అన్నారు. గత రెండు సంవత్సరాల నుండి గ్రామ పంచాయతీకి పాలక వర్గాలు లేక నిధులు విడుదల చేయకపోవ డంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయ న్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరిగి పాలక వర్గాలు ఏర్పడ్డాయి. ఎన్నికలలో పలు గ్రామపంచాయతీలలో సర్పంచులుగా బరిలో ఉన్న సమయాలలో ప్రజలకు ఇచ్చిన హామీలను గెలిచిన సర్పంచ్ లు అమలు చేయాలని, గ్రామ పంచాయతీ లో ఉన్న కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని అదే విధంగా వీధి దీపాలు, బ్లీచింగ్, ఫాగింగ్ చేయాలని,గుంతలమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులను గుర్తించి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# సామాజిక కోణం దిశగా సైబరాబాద్ పోలీస్




**శేరిలింగంపల్లి, జనవరి 17 (జనం సాక్షి) :** ప్రజలకు సురక్షితమైన, మెరుగైన జీవన సౌకర్యాలను అందించడంతోపాటు సామాజిక కోణాన్ని సైతం తరచి చూసేందుకు సైబరాబాద్ పోలీసులు నడుం బిగించారు. ఇందులో భాగంగానే కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో శనివారం స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎప్పుడూ శాంతి భద్రతల పరిరక్షణ, లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణలో నిమగ్నమై ఉండే పోలీస్ అధికారులు ఒక్కసారిగా తమ దైనందిన కార్యక్రమాలను కొద్దిసేపు పక్కన పెట్టి ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో పరిశుభ్రమైన పోలీస్ స్టేషన్ వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలోని సిబ్బంది స్వచ్ఛందంగా 'పచ్చదనం – పరిశుభ్రత ' ను చేపట్టడంతో పలు పోలీస్ స్టేషన్లలో స్పష్టమైన మార్పులు కనిపించాయి. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లలోని వాహనాలు, కోర్టు కేసులకు సంబంధించి నిలువ ఉంచిన పాత వాహనాలు, అబాండెడ్ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని వేరుచేసి ప్రత్యేకంగా కేటాయించిన వివిధ స్థలాల్లో క్రమబద్ధంగా అమర్చడం జరిగింది. పోలీస్ స్టేషన్లలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా వాటిని ఒక క్రమ పద్ధతిలో అమర్చుకోవడం జరిగింది. ఆయా పోలీస్ స్టేషన్‌లతోపాటు పరిసర ప్రాంతాలు శుభ్రంచేసి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం విశేషం.

# మున్సిపల్ రిజర్వేషన్లతో ఆశావహులకు షాక్

**భూదాన్ పోచంపల్లి, జనవరి 17 (జనం సాక్షి) :** భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీలో మొత్తం 13 వార్డులకు శనివారం ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడంతో, నెలల తరబడి ప్రజల్లో తిరుగుతూ పోటీకి సిద్ధమైన పలువురు ఆశావహులకు గట్టి దెబ్బ తగిలింది. తాము లక్ష్యంగా పెట్టుకున్న వార్డులు ఇతర వర్గాలకు రిజర్వ్ కావడంతో అనేక మంది నిరాశలో మునిగిపోయారు. మున్సిపాలిటీ వార్డు రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి. 1వ వార్డు బీసీ మహిళ, 2వ వార్డు ఎస్సీ జనరల్, 3వ వార్డు జనరల్, 4వ వార్డు జనరల్, 5వ వార్డు బీసీ జనరల్, 6వ వార్డు జనరల్ మహిళ, 7వ వార్డు జనరల్ మహిళ, 8వ వార్డు ఎస్టీ జనరల్, 9వ వార్డు బీసీ మహిళ, 10వ వార్డు జనరల్ మహిళ, 11వ వార్డు జనరల్, 12వ వార్డు బీసీ జనరల్, 13వ వార్డు జనరల్ మహిళ, మున్సిపల్ ఛైర్మన్ కు జనరల్, రిజర్వేషన్ జాబితా వెలువడిన వెంటనే స్థానిక రాజకీయ వర్గాల్లో కలకలం రేగింది. అభ్యర్థుల ఎంపికలో ముందంజలో ఉన్న పలువురు ఒక్కసారిగా పోటీకి దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. కొందరు ప్రత్యామ్నాయ వార్డుల కోసం పార్టీలను సంప్రదిస్తుండగా, మరికొందరు కుటుంబ సభ్యులను రంగంలోకి దింపేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన వారికి అవకాశం దక్కకపోవడంతో పార్టీల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అభివృద్ధి కోసం కష్టపడిన వారిని రిజర్వేషన్ మార్పులు వెనక్కి నెట్టాయని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుచరులు కూడా తమ నేతలకు అన్యాయం జరిగిందని మండిపడుతున్నారు. మరోవైపు మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించిన వార్డుల్లో కొత్త ముఖాలు రంగప్రవేశం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది. రిజర్వేషన్ల ప్రభావంతో భూదాన్ పోచంపల్లి మున్సిపల్ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. చివరి నిమిషం వరకు అభ్యర్థుల మార్పులు కొనసాగే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.


## దేవరకొండ మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

- ఛైర్‌పర్సన్‌గా బీసీ మహిళ



**దేవరకొండ, జనవరి 17 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో దేవరకొండ మున్సిపాలిలోని 20 వార్డలకు సంబంధించి రిజర్వేషన్ శనివారం జిల్లా కేంద్రంలో వివిధ పార్టీల నాయకుల సమక్షంలో జిల్లా కలెక్టర్ లాటరీ పద్ధతి ద్వారా రిజర్వేషన్లను ప్రకటించారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన రిజర్వేషన్ల ఖరారుతో పట్టణంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం కావడం, ఇప్పుడు , మున్సిపల్ ఛైర్మన్ల,వార్డ్ సభ్యుల రిజర్వేషన్లు కూడా ఖరారు కావడంతో అభ్యర్థుల వేట మొదలైంది. చైర్మన్ స్థానం మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసింది.మరో రెండు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. దీంతో పురవీధులన్నీ ఎన్నికల ప్రచారంతో హోరెత్తనున్నాయి.మున్సిపల్ పరిధిలోనీ 20 వార్డులలో 11629 మంది పురుష ఓటర్లు,12,200 మహిళా ఓటర్లు 1 థర్డ్ జెండర్ తో కలిపి 23,830 ఓటర్లు ఉన్నారనీ అధికారులు వెల్లడించారు.

## హెల్మెట్ వాడుదాం..ప్రమాదాలు నివారిద్దాం..



**నూతనకల్, జనవరి 17 (జనం సాక్షి) :** ప్రయాణ సమయంలో ముందస్తు జాగ్రత్తలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తమ వంతు కృషి చేస్తామని రోడ్లపై ఇతరులకు ఇబ్బంది కలిగించమని అతివేగంగా వెళ్ళమని పౌరులచే ఎస్సై నాగరాజు ప్రతిజ్ఞ చేయించారు. మండల కేంద్రంలో ప్రమాద స్థలాల వద్ద ప్రజలకు శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి రోడ్డు నియమ నిబంధనలు పాటించి సురక్షిత గమ్యం చేరడం పట్ల అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో హెల్మెంటు ధరించాలని బైక్ రైడర్స్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రయాణికులు, బైకు రైడర్స్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 17 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.శనివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో సూర్యాపేట, కోదాడ,హుజూర్ నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల పరిధిలోని 141 వార్డులకు ఆయన రిజర్వేషన్ ప్రక్రియను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వార్డుల వారీగా రిజర్వేషన్లు కేటాయించామని తెలిపారు.గత ఎన్నికల రిజర్వేషన్,ఎస్టి, ఎస్సి, బిసి జనాభా లెక్కలు, రొటేషన్ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు అస్కారం లేకుండా రాజకీయ పార్టీ ప్రతినిధుల మధ్య రిజర్వేషన్లను పారదర్శకంగా ప్రకటించటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, మున్సిపల్ కమిషనర్లు హన్మంతరెడ్డి, రమాదేవి, శ్రీనివాస్ రెడ్డి,



ఆశోక్ రెడ్డి, మున్వర్ పాషా, రాజకీయ పార్టీ ప్రతినిధులు,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా ఎస్పీ నరసింహ

**తుంగతుర్తి జనవరి 17 (జనం సాక్షి) :** రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు, సోమవారం అర్వపల్లి మండలం శివారు ముదిరాజ్ కాలనీ వద్ద ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైన రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు, ప్రమాదం జరగడానికి కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ముందస్తు జాగ్రత్తలు పాటించడం వల్లనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు, రహదారుల వెంట ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు, ప్రమాదం జరిగిన తీరు ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు, ప్రమాదం పై నివేదిక తయారుచేయాలని ఆదేశించారు. అజాగ్రత్త గా వాహనం నడపడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదం



సంభవించి ప్రాణం నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా అధికారులకు స్థానిక ప్రజలకు ఎస్పీ సూచనలు చేశారు. ఎస్పీ గారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల నిరంతరం పనిచేస్తూ ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం అని తెలిపారు, రోడ్డు ప్రయాణ సమయంలో ఆజాగ్రత్తల వల్ల ప్రమాదాలు సంభవించి ప్రాణ నష్టం జరుగుతుందని తెలిపారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో నివారణ చర్యలు తీసుకుంటూ రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేస్తున్నాము అని తెలిపారు. రోడ్లపై వేగనియంత్రణ సూచికలు, గ్రామ హద్దు సూచికలు, ప్రమాద స్థల సూచికలు, లైటింగ్, మలుపు సూచికలు, నియమాల సూచికలు ఏర్పాటు చేయాలని రహదారుల నిర్వహణ అధికారులకు సూచించారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలి అని ద్విచక్ర వాహనం పై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలి, సీట్ బెల్ట్ పెట్టుకోవాలి, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దు, అతివేగంగా వెళ్ళవద్దు, పరిమితికి మించి వ్యక్తులను వాహనాల్లో ఎక్కించవద్దు అని కోరారు ఎస్పీ వెంట.నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, స్థానిక ఎస్సై సైదులు, ట్రాన్స్పోర్ట్ అధికారులు, రహదారి నిర్వహణ అధికారులు ఉన్నారు.

## మానవత్వం చాటుకున్న పీర్లకొట్టం బజార్ కబడ్డీ టీం విజేతలు



**నూతనకల్, జనవరి 17 (జనం సాక్షి) :** గ్రామీణ క్రీడల్లో చత్తా చాటిన క్రీడాకారులకు బహుమతులు అందచేశారు. మండలపరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ మరియూ పీడీఎస్ యూ, పీవైఎల్ రెండు వేరు వేరుగా క్రీడలు నిర్వహించారు. ఈ మేరకు పీర్లకొట్టం బజార్ టీం రెండు చోట్ల విజేతలుగా నిలిచారు. రెండుచోట్ల ద్వితియ బహుమతి అందుకున్నట్టు టీం సభ్యులు తెలిపారు. విజేతలకు నిర్వహన కమిటీ తరుపున షీల్డ్ తో పాటు ప్రైజ్ మనీని అందచేశారు. ఈ సందర్భంగా విజేతలకు వచ్చిన రూ. 5000 ప్రైజ్ మనీని ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన గుణగంటి పరమేష్ కు అదించి మానవత్వం చాటుకున్నారు. మానవత్వం చాటుకున్న పీర్లకొట్టం బజార్ కబడ్డి టీంను గ్రామస్థులు అభినందించారు.. ఈ కార్యక్రమంలో కబడ్డీ టీం సభ్యులు పుసుల మహేష్, రేసు మహేష్, వెల్మకంటి గణేష్, శిగ మహేష్, బిక్కి సతీష్, పిల్లి మనోజ్, పులుసు ఉమేష్, కారుపోతుల సాయిమంజున్, బొలగాని ఉదయ్, బొలగాని ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.




# రిలయన్స్ పైపైకి..

- రిలయన్స్ లాభం రూ.18,645 కోట్లు
- ఆదాయం రూ.2.69 లక్షలు




**హైదరాబాద్:**అన్ని వ్యాపార విభాగాలు బలోపేతమై, సమర్థంగా రాణించాయి. జియో చందాదార్లు, ఆ విభాగ ఎబిటా గణనీయంగా పెరిగాయి. రిటెయిల్ వ్యాపారం కొత్త బ్రాండ్లు, ఉత్పత్తులను సమకూర్చుకుంది. ఈ వ్యాపార విభాగాన్ని విభజించే ప్రక్రియ ఈ త్రైమాసికంలో చేపడతాం. ఏఐ - కొత్త ఇంధన విభాగాలతో వాటాదార్లకు మరింత విలువ జతచేరుస్తాం.రిలయన్స్ ఇండస్ట్రీస్, డిసెంబరు త్రైమాసికంలో రూ.18,645 కోట్ల (షేరుకు రూ.13.78) నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.18,540 కోట్ల (షేరుకు రూ.13.70)తో పోలిస్తే, దాదాపు మార్పేమీ లేనట్లే. గ్యాస్ ఉత్పత్తి తగ్గడం, రిటెయిల్ వ్యాపారం బలహీనంగా సాగడం ఇందుకు కారణమని పేర్కొంది. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ ప్రయోజనం పెద్దగా కనపడలేదు. కార్యకలాపాల ఆదాయం రూ.2.43 లక్షల కోట్ల నుంచి రూ.2.69 లక్షల కోట్లకు పెరిగింది. పన్నుకు ముందు లాభం (ఎబిటా) 6.1% వృద్ధితో రూ.48,003 కోట్లుగా నమోదైంది. సంస్థ నికర రుణాలు మార్పేమీ లేకుండా రూ.1.17 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఈ త్రైమాసికంలో రూ.33,826 కోట్ల మూలధన వ్యయాలను సంస్థ చేసింది. ఓ2సితో పాటు కొత్త ఇంధన వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతున్నామని, జియో-రిటెయిల్ నెట్‌వర్క్-మౌలిక వసతుల్లోనూ ఇవి కొనసాగుతాయని వివరించింది. గ్రూప్‌నకు చెందిన చమురు రిఫైనరీలు, పెట్రో రసాయనాల కాంప్లెక్సులను నిర్వహించే చమురు-రసాయనాల (ఓ2సి) వ్యాపారాదాయం 8.4% పెరిగింది. మార్జిన్ల వృద్ధి, రిటెయిల్ నెట్‌వర్క్‌ను మరింత విస్తృతం చేయడం ఇందుకు నేపథ్యం. అయితే కేజీ క్షేత్రాల నుంచి ఉత్పత్తి తగ్గినందున, చమురు-గ్యాస్ విభాగ ఎబిటా 13% తగ్గి, రూ.4857 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో ఇక్కడ ఉత్పత్తి దాదాపు 10% తగ్గిందని, ధర కూడా తక్కువగానే ఉందని పేర్కొంది. కేజీ-డీ6 క్షేత్రంలో రోజుకు 261. మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్, 18,400 బ్యారెళ్ల ముడిచమురు ఉత్పత్తి అయ్యింది.

34% పెరిగిన డేటా వినియోగం

గ్రూప్‌నకు చెందిన టెలికాం, డిజిటల్ వ్యాపారాలను నిర్వహించే జియో ప్లాట్‌ఫామ్స్ ఆదాయం 13% పెరిగింది. కొత్త చందాదారులు జతచేరడం, ప్రతి వినియోగదారుపై వచ్చే సగటు ఆదాయం (ఆర్పు) పెరగడం ఇందుకు కారణం. సంస్థ ఏకీకృత నికరలాభం 11.3% వృద్ధితో రూ.7629 కోట్లకు, అనుబంధ/సంయుక్త సంస్థల ప్రభావం తీసేశాక.. నికరలాభం రూ.6857 కోట్లకు చేరింది. సంస్థ ఆదాయం రూ.33,074 కోట్ల నుంచి 12.7% పెరిగి రూ.37,262 కోట్లకు చేరింది. చందాదార్ల సంఖ్య సెప్టెంబరు త్రైమాసికంలో 50.64 కోట్లు కాగా, డిసెంబరు ఆఖరుకు 51.53 కోట్లకు పెరిగారు. ఇదే సమయంలో ఆర్పు రూ.211.4 నుంచి రూ.213.7కు పెరిగింది. ఏడాది క్రితం ఆర్పు రూ.203.3 మాత్రమే. డేటా వినియోగం కూడా గణనీయంగా పెరిగినట్లు సంస్థ పేర్కొంది. అయితే 5జీలో అపరిమిత ఆఫర్లు ఇవ్వడం, ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ సేవల్లో ఇచ్చిన ఆఫర్ల వల్ల ఆర్పు పెరుగుదల పరిమితమైనట్లు వివరించింది. ఒక చందాదారు వినియోగించిన డేటా నెలకు సగటున 40.7 జీబీకి చేరింది. 2024-25 ఇదే కాలంతో పోలిస్తే, డేటా వినియోగం 34% అధికమైనట్లు సంస్థ వెల్లడించింది. జియో 5జీ చందాదార్ల సంఖ్య 25 కోట్లని మించగా, ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ ఖాతాదార్లు 2.5 కోట్ల కంటే అధికంగా ఉన్నారు.

జియో హాట్‌స్టార్ ఆదాయం రూ.8010 కోట్లు

జియో హాట్‌స్టార్ ఆదాయం రూ.8010 కోట్లని, ఎబిటా (ఇతరాదాయంతో కలిపి) రూ.1303 కోట్లని సంస్థ తెలిపింది. నెలకు సగటున 45 కోట్లమంది యాక్టివ్ చందాదార్లున్నారని వెల్లడించింది. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, వీరి సంఖ్య 13% అధికమైంది. సంస్థ నికరలాభం రూ.888 కోట్లుగా ఉంది.

రిటెయిల్ ఆదాయం రూ.97,605 కోట్లు

రిలయన్స్ రిటెయిల్ వ్యాపార నికరలాభం 2.7% పెరిగి రూ.3551 కోట్లుగా, స్థూల ఆదాయం 8.1% అధికమై రూ.97,605 కోట్లుగా నమోదైంది. కార్యకలాపాల ఆదాయం రూ.79,595 కోట్ల నుంచి 9.2% పెరిగి రూ.86,951 కోట్లకు చేరింది. కొత్తగా 431 కొత్త విక్రయశాలలను ప్రారంభించామని, క్విక్ కామర్స్ విభాగం ద్వారా రోజుకు 16 లక్షల ఆర్డర్లు లభించాయని వివరించింది. 50,000కు పైగా ఉత్పత్తులు తమ విక్రయశాలల్లో లభిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

## మరింత వేగంగా ఫిర్యాదుల పరిష్కారం




**హైదరాబాద్:**
బ్యాంకింగ్ సేవల్లో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థంగా, వేగంగా మార్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులతో పాటు, ఇతర నియంత్రిత సంస్థల ఖాతాదారుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా 'రిజర్వ్ బ్యాంక్-సమగ్ర అంబుడ్స్‌మన్ పథకం -2026'ను తీసుకురానుంది. ఇందుకోసం 'రిజర్వ్ బ్యాంక్- అంబుడ్స్‌మన్ స్కీం 2025'కు కొన్ని సవరణలతో ముసాయిదాను శుక్రవారం విడుదల చేసి, ప్రజల అభిప్రాయాలు కోరింది. ఇవి కూడా వచ్చాక, క్రోడీకరించి, నిబంధనలు ఖరారు చేస్తుంది. కొత్త పథకం 2026 జులై 1 నుంచి అమల్లోకి రానుంది. ఫిర్యాదిదారులకు తక్కువ ఖర్చుతో, వేగవంతమైన పరిష్కారాన్ని అందించడమే దీని ప్రధాన లక్ష్యమని ఆర్‌బీఐ పేర్కొంది. విచారణలు క్లుప్తంగా ఉంటాయని, ఇవి సాధారణ సాక్ష్యాధారాల నిబంధనలకు లోబడి ఉండవని స్పష్టం చేసింది. ఈ బాధ్యతలను నిర్వహించేందుకు ఆర్‌బీఐ తన అధికారుల నుంచి ఒకరు లేదా అంతకంటే ఎక్కువమందిని ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్, ఆర్‌బీఐ డిప్యూటీ అంబుడ్స్‌మన్‌లుగా నియమిస్తుంది. సాధారణంగా వీరి నియామక కాలపరిమితి ఒకేసారి మూడేళ్ల వరకు ఉంటుంది.ఫిర్యాదుల స్వీకరణ, పరిశీలన కోసం ఆర్‌బీఐ ఒకటి లేదా పలు చోట్ల సీఆర్‌పీసీ (సెంట్రలైజ్డ్ రిసీప్ట్ అండ్ ప్రాసెసింగ్ సెంటర్)లు ఏర్పాటు చేయనుంది. వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్ ద్వారా సులభంగా సమర్పించే వీలుంటుంది. నూతన విధానంలో వివాదానికి సంబంధించిన మొత్తంపై గరిష్ఠ పరిమితి విధించలేదు. అంబుడ్స్‌మన్ లేదా డిప్యూటీ అంబుడ్స్‌మన్ ఆ వివాదాలపై రాజీ కుదర్చడం లేదా తగిన తీర్పు (అవార్డు) ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరిస్తారు. ఖాతాదారులకు కలిగిన నష్టానికి సంబంధించి, గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పరిహారం చెల్లించాలని ఆదేశించే అధికారం అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. దీనికి అదనంగా మరో రూ.3 లక్షల వరకు పరిహారం అందించే వీలుందని ఆర్‌బీఐ వెల్లడించింది.

## అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ నుంచి పోటీ..

### డెలివరీ ఫీజు తొలగించిన బ్లింకిట్

**న్యూఢిల్లీ:**క్విక్ కామర్స్ రంగంలో రోజురోజుకూ పోటీ తీవ్రమవుతోంది. ముఖ్యంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల నుంచి స్టార్టప్ సంస్థలకు గట్టి పోటీ ఎదురవుతోంది. ఈ రెండు దిగ్గజ సంస్థలు మార్కెట్‌లోకి వేగంగా దూసుకొస్తుండటంతో ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కంపెనీలు అప్రమత్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే క్విక్ కామర్స్‌లో మార్కెట్‌లీడర్‌గా ఉన్న బ్లింకిట్ గురుగ్రామ్, బెంగళూరు, ముంబయి వంటి ఎంపిక చేసిన మార్కెట్లలో డెలివరీ ఫీజును తొలగించింది. బలంగా వేళ్లూనుకున్న మార్కెట్లలో కొత్తగా వచ్చే ప్లేయర్లకు సవాల్ విసిరేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.క్విక్ కామర్స్ విభాగంలో జెప్టో, స్విగ్గీ ఇప్పటికే కనీస కార్ట్‌వాల్యూతో పాటు, వివిధ రకాల ఫీజులను తొలగించాయి. హ్యాండ్లింగ్ ఫీజు, సర్‌ఛార్జ్ వంటి ఫీజులను జెప్టో గతేడాది తొలగించింది. కనీస ఆర్డర్ విలువను కూడా రూ.99గా నిర్ణయించింది. ఆ మొత్తం దాటితే ఫ్రీ డెలివరీ అందిస్తోంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సైతం ఇదేబాటలో పయనిస్తోంది. బ్లింకిట్ మాత్రం ఈ ఛార్జీల విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్లిప్‌కార్ట్ మినిట్స్, అమెజాన్ నౌ పేరిట.. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలు ఈ రేసులోకి ఎంట్రీ ఇవ్వడంతో బ్లింకిట్ అప్రమత్తమైంది. వాటినుంచి పోటీ తట్టుకోవడానికి డెలివరీ ఫీజు తొలగించి ఖాతాదారులను నిలుపుకొనే ప్రయత్నాలను మొదలుపెట్టింది. సగటున రెండు డార్క్ స్టోర్ల ఏర్పాటే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఫ్లిప్‌కార్ట్ కూడా దూకుడుగా ముందుకెళుతోంది.




**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,31,450 | ₹ 1,43,400 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 3,06,000

# సైనిక చర్య లేనట్టే!?

- ఇరాన్‌పై ఇప్పట్లో దాడి చేయబోమని ట్రంప్ సంకేతాలు
- నిరసనకారులకు మరణశిక్షలపై టెహ్రాన్ మెత్తబడటమే కారణం!
- ఫలించిన ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల ప్రయత్నాలు

**వాషింగ్టన్:** ఇరాన్‌పై సైనిక చర్య తప్పదంటూ ఇటీవల వరుస హెచ్చరికలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతానికి వెనక్కి తగ్గినట్టే కనిపిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టిన నిరసనకారుల అణచివేత విషయంలో టెహ్రాన్ మొత్తబడినట్లు కనిపిస్తోందని పేర్కొన్న ఆయన.. సమీప భవిష్యత్తులో ఆ దేశంపై దాడి చేయబోమన్న సంకేతాలిచ్చారు! ఇరాన్‌పై దాడులకు దిగితే ఆ దేశంలో అనిశ్చితి మరింత పెరిగే ముప్పుండటం, ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తే అవకాశాలు ఉండటం, వాషింగ్టన్ పరిమిత స్థాయి సైనిక చర్యతో ఆగిపోకుండా దీర్ఘకాలం పాటు దాడులు కొనసాగించక తప్పని పరిస్థితులు తలెత్తొచ్చన్న అంచనాలు.. ఇవన్నీ సైనిక చర్యపై ట్రంప్ నిర్ణయం మార్పునకు కారణమైనట్లు తెలుస్తోంది. నిరసనకారులపై ఉక్కుపాదం మోపితే ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ పదేపదే హెచ్చరించారు. 24 గంటల్లోనే టెహ్రాన్‌పై వాషింగ్టన్ సైనిక చర్యకు దిగడం ఖాయమనీ విశ్వసనీయ వర్గాలు బుధవారం వెల్లడించాయి. గతంలో ఇరాన్ విధించిన మరణశిక్షల తాలూకు వీడియోలను ట్రంప్ వీక్షించారని.. తాజా నిరసనల్లో పాల్గొన్నవారికి అలాంటి పరిస్థితి తలెత్తనీయబోమన్న కృతనిశ్చయంతో ఆయన ఉన్నారని తెలిపాయి. పశ్చిమాసియాలోని పలు



వైమానిక స్థావరాల నుంచి అమెరికా హడావుడిగా తన బలగాలను కొంతమేర ఉపసంహరించుకోవడమూ సైనిక చర్య తప్పదన్న వార్తలకు బలాన్నిచ్చాయి. అయితే గురువారంకల్లా పరిస్థితి మారిపోయింది. "ఇరాన్‌లో హత్యలు ఆగిపోయాయని ఆవలి వైపు నుంచి చాలా ముఖ్యమైన వర్గాల ద్వారా సమాచారం అందింది" అని ట్రంప్ ప్రకటించారు. దీంతో- ప్రస్తుతానికి సైనిక చర్య ప్రయత్నాలు నిలిచిపోయినట్టే కనిపిస్తున్నాయి. ఒక్కరోజులో ట్రంప్ స్వరం మారడం చూసి అమెరికా సైనిక వర్గాలూ ఆశ్చర్యపోయినట్లు తెలుస్తోంది. నిజానికి ఆ సమయానికి ఇరాన్‌లో నిరసనకారులపై హత్యాకాండ నిలిచిపోయినట్లు అమెరికా నిఘావర్గాలేమీ నివేదించలదని సమాచారం. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో చురుగ్గా పాల్గొన్న ఎర్ఫాన్ సొల్తానీ అనే 26 ఏళ్ల యువకుడికి ఈ నెల 14న మరణశిక్ష అమలు చేయాలని ఇరాన్ తొలుత భావించింది. కానీ చివరి నిమిషాల్లో ఆ శిక్ష అమలును నిలిపివేసింది. సైనిక చర్యపై ట్రంప్ వెనక్కి తగ్గడానికి ఇది బాగా ఉపయోగపడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్‌పై దాడుల విషయంలో ట్రంప్ వెనక్కు తగ్గడానికి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు కూడా ఓ ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ ఇద్దరు నేతలూ బుధవారం మధ్యాహ్నం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం- ఇరాన్ అంత తేలికగా తలొగ్గబోదని ట్రంప్‌నకు నెతన్యాహు చెప్పారు. దాడులు మొదలుపెడితే.. దీర్ఘకాలంపాటు కొనసాగించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతానికి తమ దేశ క్షిపణి రక్షణ వ్యవస్థల పరిస్థితి అంత బాగోలేదని నివేదించారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్‌పై దాడులకు దిగకపోవడమే మేలని హితవు పలికారు. గతంలో టెహ్రాన్‌పై సైనిక చర్యను కోరిన నెతన్యాహుయే ఇప్పుడు దాడులు వద్దని స్వయంగా చెప్పడం ట్రంప్‌ను పునరాలోచనలో పడేసింది.

మిత్రదేశాల దౌత్యమంత్రం

గల్ఫ్‌లో అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ వంటి దేశాలతో పాటు ఈజిప్టు కూడా సైనిక చర్య నివారణకు ట్రంప్‌తో ముమ్మరంగా దౌత్య ప్రయత్నాలు చేశాయి. ఇరాన్‌పై దాడులు ప్రాంతీయంగా యుద్ధమేఘాలకు కారణమవుతాయని, దానివల్ల అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదుపులకు లోనవుతుందని ఆయనకు సూచించాయి. అయితే ఇరాన్‌లో నిరసనకారులపై హత్యాకాండను ఆపడమే తన ప్రాథమిక లక్ష్యమని ఆయా దేశాల అధికారులతో ట్రంప్ తెలిపారు. టెహ్రాన్ ఆ దిశగా సంకేతాలిస్తే సైనిక చర్యకు దిగబోనని స్పష్టం చేశారు. ఆపై కొన్ని గంటలకే ఎర్ఫాన్ సొల్తానీ మరణశిక్షను టెహ్రాన్ నిలిపివేయడం, 'ఇది శుభవార్త.. ఇదే కొనసాగుతుందని ఆశిస్తున్నా' అంటూ అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యలు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిరసనకారుల మరణశిక్షలను నిలిపివేసినందుకు ఇరాన్‌కు ట్రంప్ కృతజ్ఞతలు తెలపడం గమనార్హం.

## విమానాలకు అమెరికా హెచ్చరికలు..

- మెక్సికోపై ట్రంప్ దాడి కోసమేనా?

వాషింగ్టన్: అమెరికా విమానయాన సంస్థలకు అగ్రరాజ్య ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరికలు జారీ చేసింది. మెక్సికో సెంట్రల్ అమెరికా, పనామా సహా తూర్పు పసిఫిక్ మహా సముద్రంలోని కొన్ని ప్రాంతాల గగనతలం మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. సైనిక కార్యకలాపాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ముప్పు ఎదురయ్యే అవకాశం ఉందని ఎయిర్‌లైన్లను హెచ్చరించింది.ఈ మేరకు అమెరికాకు చెందిన అన్ని విమానయాన సంస్థలకు అడ్వైజరీ నోటీసు జారీ చేసింది. ఈ నోటీసు 60 రోజుల వరకు అమల్లో ఉంటుందని పేర్కొంది. "విమానం ఎంత ఎత్తులో ఉన్నా.. ల్యాండింగ్, టేకాఫ్ దశల్లో ఉన్నా సరే.. వాటికి ముప్పు ఎదురయ్యే ప్రమాదం ఉంది" అని ఎఫ్ఏఏ ఆ నోటీసుల్లో స్పష్టం చేసింది. సాధారణంగా సమీప ప్రాంతాల్లో యుద్ధం లేదా ఉద్రిక్త పరిస్థితులు ఉన్న సమయంలో ఇలాంటి నోటీసులు జారీ చేస్తుంటారు.ఇటీవల మెక్సికోపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యక్షంగానే తీవ్ర హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. ఆ దేశంలో ఉన్న మాదకద్రవ్యాల ముఠాలు, స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భూతల దాడులు చేస్తామంటూ హెచ్చరించారు. లాటిన్ అమెరికాలోని మెక్సికో సహా క్యూబా, కొలంబియా వంటి దేశాలు మాదకద్రవ్యాలను తయారు చేస్తూ అమెరికాలోకి అక్రమంగా సరఫరా చేస్తున్నాయని అగ్రరాజ్య అధ్యక్షుడు ఆరోపించారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే వెనెజువెలా పరిస్థితే ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరుతో ఇటీవల వెనెజువెలాపై మెరుపుదాడులు చేసిన అమెరికా సైన్యం.. ఆ దేశాధినేతగా ఉన్న నికోలస్ మదురో, ఆయన భార్యను బంధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మిగతా లాటిన్ అమెరికా దేశాలకూ ఆయన వార్నింగ్ ఇచ్చారు. ఈ పరిణామాల వేళ తాజాగా ఎయిర్‌లైన్లకు ఎఫ్ఏఏ అడ్వైజరీ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మెక్సికోపై దాడి చేసేందుకే విమానాలకు ఈ హెచ్చరికలు చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## మళ్లీ 'వందేభారత్ స్లీపర్'ను ప్రారంభించిన మోదీ

వ్యవస్థ, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. విమానంలో ప్రయాణించిన అనుభూతిని కలిగించేలా ఇందులో సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ఇందులో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటి వాటిని ఇందులో అనుమతించరు.

## యుద్ధం ఇప్పుడే మొదలైంది

అది ఎప్పటికీ సాధ్యం కాదని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ 64 స్థానాలను కైవసం చేసుకుందని తెలిపారు. ముంబయిలో శివసేన (ఖః÷) నుంచి మేయర్‌ను నియమించాలనేది తన కల అని.. అదే జరగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. 227 స్థానాలున్న బృహన్‌ముంబయి (బీఎంసీ)లో అధికారాన్ని కైవసం చేసుకోవడానికి అవసరమైన 114 సీట్ల కన్నా అధికంగానే భాజపా, శివసేన (శిందే)తో కూడిన కూటమి సీట్లు సాధించింది. భాజపా 89 స్థానాల్లో విజయం సాధించింది. శిందే నేతృత్వంలోని శివసేన 27 చోట్ల గెలుపొందింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన 64 స్థానాలను కైవసం చేసుకుంది. రెండు దశాబ్దాల పాటు విడివిడిగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే (మహారాష్ట్ర నవ నిర్మాణ సేన) ఈ ఎన్నికలకు ముందే జట్టుకట్టినా మహాయుతి విజయాన్ని అడ్డుకోలేకపోయారు.

## నోబెల్ పురస్కారం.. కొందరు వేలం వేస్తే.. ఇంకొందరు అమ్మేశారు!

**జనంసాక్షి:**నోబెల్ ప్రైజ్.. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోవాలని ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది శాస్త్రవేత్తలు, రచయితలు కలలు కంటారు. ఈ అవార్డు అందుకోవడం అత్యంత గౌరవంగా భావిస్తారు. అలాంటి పురస్కారాన్ని వెనెజువెలా విపక్ష నేత మారియా కొరీనా మచాడో.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇచ్చేశారు. దీంతో ఇదికాస్తా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే, వచ్చిన 'నోబెల్'ను వదులుకోవడం కొత్తేం కాదు. గతంలో పలువురు గ్రహీతలు అనేక కారణాలతో వాటిని వేలం వేయడం, విక్రయించడం వంటివి చేశారు. ఆ సందర్భాలేంటో చూద్దాం..!2021లో రష్యా జర్నలిస్టు దిమిత్రి మురాటోవ్ నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. అయితే, ఆ మరుసటి ఏడాదే దాన్ని ఆయన వేలం వేయగా.. రికార్డు స్థాయిలో 103.5 మిలియన్ డాలర్లు పలికింది. ఆ మొత్తాన్ని ఉక్రెయిన్ శరణార్థుల్లో ఉన్న చిన్నారుల సంక్షేమం కోసం యునిసెఫ్‌కు విరాళంగా ఇచ్చారు.అమెరికా శాస్త్రవేత్త జాన్ నాష్ ఆర్థికశాస్త్రంలో నోబెల్ తీసుకున్నారు. ఆ అవార్డును 2019లో క్రిస్టీస్ ఆక్షన్ సంస్థ వేలం వేయగా.. 7,35,000 డాలర్లు పలికింది. ఈ మొత్తాన్ని జాన్ నాష్ పేరిట ఏర్పాటుచేసిన ట్రస్ట్‌కు ఇచ్చేశారు. నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్‌నకు ఇచ్చేసిన మచాడో 1962లో అమెరికా శాస్త్రవేత్త జేమ్స్ డి.వాట్సన్ వైద్యశాస్త్రంలో నోబెల్ అందుకున్నారు. అయితే, శాస్త్రీయ పరిశోధనల కోసం విరాళాలు సేకరించే క్రమంలో ఆ పురస్కారాన్ని ఆయన విక్రయించగా.. రష్యాకు చెందిన బిలియనీర్ అలిషెర్ ఉస్మనోవ్ కొనుగోలు చేశారు. ఆ పురస్కారాన్ని అలిషెర్ తన వద్ద ఉంచుకోకుండా తిరిగి వాట్సన్‌కే ఇచ్చేశారు ఈ అవార్డు శాస్త్రవేత్త వద్ద ఉండటమే సరైందని నాడు బిలియనీర్ అన్నారు.1939లో సోవియెట్ యూనియన్ ఫిన్‌లాండ్‌ను ఆక్రమించింది. ఆ సమయంలో ఫిన్‌లాండ్ ప్రజల కోసం విరాళాలు సేకరించేందుకు డెన్మార్క్ శాస్త్రవేత్తలు నీల్స్ బోర్, ఆగస్ట్ క్రోగ్ తమ నోబెల్ పురస్కారాలను వేలం వేశారు. ఈ వేలంలో అవార్డు కొనుక్కున్నవారు కొంతకాలం తర్వాత డెన్మార్క్ మ్యూజియంలకు వాటిని ఇచ్చేశారు.నీల్స్ బోర్ కుమారుడు ఆగే బోర్ కూడా 1975లో ఫిజిక్స్‌లో నోబెల్ అందుకున్నారు. దాన్ని 2011లో వేలం వేశారు. అయితే, 2019లో ఆయనకు మరోసారి




నోబెల్ దక్కడం విశేషం.నాజీ సానుభూతిపరుడైన నార్వే రచయిత నట్ హామ్సన్‌కు 1920లో నోబెల్ సాహిత్య పురస్కారం దక్కింది. దాన్ని ఆయన రెండో ప్రపంచ యుద్ధం సమయంలో నాజీ జర్మనీ మంత్రి జోసెఫ్‌కు బహుమతిగా ఇచ్చేశారు.అమెరికా పర్యటనలో ఉన్న మచాడో తన నోబెల్‌ను ట్రంప్‌నకు ఇచ్చిన సంగతి తెలిసిందే. వెనెజువెలా ప్రజల స్వేచ్ఛ కోసం కృషి చేస్తున్న ట్రంప్‌నకు ఇది గుర్తింపు అని ఆమె పేర్కొన్నారు. ఈ పరిణామాలపై నోబెల్ కమిటీ కూడా స్పందించింది. ఇలా తన పురస్కారాన్ని మరొకరికి ఇవ్వడం చట్టబద్ధం కాదని స్పష్టంచేసింది. నార్వే నోబెల్ ఇనిస్టిట్యూట్, నోబెల్ కమిటీ నిబంధనల ప్రకారం.. ఒకసారి నోబెల్ ప్రకటించిన తర్వాత.. దాని రద్దు, బదిలీ చేయడం లేదా ఇతరులతో పంచుకోవడం కుదరదు. అయితే గ్రహీతలు తమ మెడల్ లేదా నగదు బహుమతిని ఏదైనా చేసుకునే స్వేచ్ఛ ఉంటుంది. కానీ, అధికారికంగా మాత్రం పురస్కారం వారి పేరు మీదే ఉంటుంది.

## 'మండలి' సంస్కరణకు చొరవ చూపండి

### బలమైన దేశాలకు గుటెరస్ పిలుపు

### 1945 నాటి వేదికలు నేటికి నప్పవని వ్యాఖ్య

జనంసాక్షి:భద్రతా మండలిని సంస్కరించడానికి బలమైన ప్రపంచ దేశాలు చొరవ చూపాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పిలుపునిచ్చారు. "ఈరోజు ప్రత్యేక అధికారాలకు అంటిపెట్టుకొని ఉండాలని కోరుకునే దేశాలు రేపు పశ్చాత్తాప పడక తప్పదు" అని ఆయన హెచ్చరించారు. "నేటి పరిస్థితులకు అనుగుణంగా వ్యవస్థల్ని సంస్కరించాలి. 1945 నాటి సమస్యా పరిష్కార వేదికలు 2026 నాటి సమస్యలకు సమాధానం చూపలేవు" అని ఆయన గురువారం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ పేర్కొన్నారు. సమకాలిక వాస్తవికతలకు అనుగుణంగా ప్రపంచ వ్యవస్థల సంస్కరణ జరగాలని ఆయన నొక్కి చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి వాటా తగ్గిపోతుండటంతో వాటి ఆర్థిక వ్యవస్థలు రోజు రోజుకూ కుంగిపోతున్నాయని, వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలు అంతకంతకూ బలోపేతం అవు తున్నాయని ఆయన అన్నారు. దక్షిణార్ధగోళంలోని దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్యం, ఉత్తరార్ధగోళంలోని దేశాల మధ్య సాగుతున్న వాణిజ్యాన్ని మించిపోతోందన్నారు.కొన్ని దేశాలు అంతర్జాతీయ న్యాయసూత్రాల్లో తమకు నచ్చిన, అనుకూలమైన వాటిని పాటిస్తూ మిగిలిన వాటిని ఉల్లంఘిస్తున్నాయని, ఇది ప్రమాదకరమైన పరిస్థితికి దారి తీస్తుందని గుటెరస్ హెచ్చరించారు. గుటెరస్ పదవీకాలం 2026 సంవత్సరంలో ముగుస్తున్న దరిమిలా.. ఈ సంవత్సరంలోని ప్రతిదినం ఫలవంతం అయ్యేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో వివాదాలు, తమను ఎవరూ ఏమీ చేయలేరన్న భావన, అసమానత్వం, ఎప్పుడేం జరుగుతుందో తెలియని అనిశ్చిత పరిస్థితి ప్రబలిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు.

# రిజర్వేషన్లపై ఎట్టకేలకు తొలగిన ఉత్కంఠ

## మున్సిపల్ ఎన్నికలు.. వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు



**నిజామాబాద్ బ్యూరో, జనవరి 17 (జనంసాక్షి):** బల్దియా ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లపై నెలకొన్న ఉత్కంఠత ఎట్టకేలకు తొలగింది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం అధికారులు వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితా విడుదల చేసింది. పోలింగ్ కేంద్రాల లిస్ట్ సైతం ప్రకటించింది. ఇటీవల మున్సిపాలిటీల వారీగా రిజర్వేషన్లను ప్రభుత్వం ప్రకటించగా.. తాజాగా వార్డుల వారీగా అధికారులు ఖరారు చేశారు. శనివారం ఉదయం నిజామాబాద్ కలెక్టరేట్లో లక్కీ డ్రా ద్వారా వార్డుల రిజర్వేషన్లను ప్రకటించారు. ఈ మేరకు అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఖరారైన రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి.

**నిజామాబాద్ కార్పొరేషన్లో..**

నిజామాబాద్ కార్పొరేషన్లో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. ఇందులో ఎస్సీ జనరల్కు 2, 40, 44, ఎస్సీ మహిళకు 17, 39 డివిజన్లను రిజర్వ్ చేశారు. ఎస్టీ జనరల్కు 13, బీసీ జనరల్కు 7, 14, 15, 28, 38, 42, 43, 46, 48, 51, 52, 58, బీసీ మహిళకు 12, 16, 20, 22, 23, 37, 41, 45, 56, 57, 59, 60 డివిజన్లు కేటాయించారు. జనరల్కు 1, 4, 5, 8, 10, 18, 19, 25, 26, 30, 35, 47, 50, 55, జనరల్ మహిళకు 3, 6, 9, 11, 21, 24, 27, 29, 31, 32, 33, 34, 36, 49, 53, 54 డివిజన్లను కేటాయించినట్లు సమాచారం.

**ఆర్మూర్లో..**

ఆర్మూర్ మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉన్నాయి. ఇందులో ఎస్టీ జనరల్కు రెండో వార్డు కేటాయించారు. ఎస్సీ మహిళకు 8, ఎస్సీ జనరల్కు 4వ వార్డును రిజర్వ్ చేశారు. బీసీ మహిళకు 01, 06, 17, 20, 22, 27, 28, బీసీ జనరల్కు 07, 10, 14, 18, 23, 24, 25 వార్డులు కేటాయించారు. జనరల్ మహిళకు 03, 05, 12, 15, 16, 19, 21, 29, 33, 36, జనరల్కు 09, 11, 13, 26, 30, 31, 32, 34, 35 వార్డులను రిజర్వ్ చేసినట్లు తెలిసింది.

**భీమ్గల్లో..**

భీమ్గల్ మున్సిపాలిటీలో మొత్తం 12 వార్డులు ఉన్నాయి. ఎస్సీ మహిళకు రెండో వార్డు, ఎస్సీ జనరల్కు 8, ఎస్టీ జనరల్ 11, బీసీ జనరల్కు 7, 9, బీసీ మహిళకు 12 వార్డు కేటాయించారు. జనరల్కు 1, 3, జనరల్ మహిళకు 4, 5, 6, 10 వార్డులు ఖరారైనట్లు సమాచారం.

**బోధన్లో..**

బోధన్ బల్దియాలో మొత్తం 38 వార్డులు ఉన్నాయి. అందులో ఎస్సీ మహిళకు 10, ఎస్సీ జనరల్ 13, 16 వార్డులు రిజర్వ్ అయ్యాయి. ఎస్టీ జనరల్ 24, బీసీ మహిళకు 4, 7, 8, 14, 19, 23, 35, బీసీ జనరల్కు 2, 5, 6, 9, 12, 22, 26, 34 వార్డు స్థానాలను కేటాయించారు. జనరల్ మహిళ 1, 3, 11, 20, 28, 29, 31, 32, 33, 36, 38, జనరల్కు 15, 17, 18, 21, 25, 27, 30, 37 వార్డులు ఖరారు చేశారు.

# విమర్శలకు అభివృద్ధితోనే సమాధానం

### రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్



**గోదావరిఖని, (జనంసాక్షి) :** విమర్శలకు అభివృద్ధితోనే సమాదానం చెప్తామని రామగుండం శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. శనివారం రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎయిట్ ఇంక్ లైన్ కాలనీ లో రూ 30.00 లక్షలతో డైలీ మార్కెట్ అభివృద్ధి పనులు , గోదావరి ఖని చౌరస్తా లో రూ 50.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వీధుల పేర్ల సూచిక బోర్డులు ప్రారంభించారు. అనంతరం రామగుండంలో రూ 20.00 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ది పనులకు శంఖు స్థాపన చేశారు. ఈ సంధర్భంగా రామగుండం మజీద్ కార్నర్ వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అక్కడ గడిపిన రోజులు , తన బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్ లో ఉన్నప్పటికీ స్థానికులతో సంబంధాలు కొనసాగిస్తూ రాజకీయాలకు అతీతంగా సహాయం చేశానని అన్నారు. నాటి పాలకుల నిర్లక్ష్యానికి గురై ప్రాభవం కోల్పోతున్న ఈ ప్రాంతానికి పునర్ వైభవం తీసుకురావాలనే సంకల్పంతో పట్టు వదలకుండా పోరాటం చేసి ఎం ఎల్ ఎ గా ఎన్నికయ్యాయని అన్నారు. తనపై విశ్వాసంతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతగా ఎంఎల్ఏగా ఎన్నికైన నాటి నుండి రోజుకు 18 గంటలు పని చేస్తూ నగరాభివృద్ధి కి కృషి చేస్తున్నానని అన్నారు. రామగుండం పట్టణం నుండి నలువైపులా లింగాపూర్ , అంతర్గాం , కుందనపల్లి, గోదావరి ఖని వైపు ప్రదాన రహదారులన్నీ వెడల్పు చేసి ఒక ముఖ్య కేంద్రంగా రూపు దిద్దుతున్నామని అన్నారు. ఉత్తర తెలంగాణలో పెద్ద నగరాలైన వరంగల్ , కరీం నగర్ వంటి పట్టణాలకు ధీటుగా రామగుండం నగరాన్ని తీర్చి దిద్దాలన్నదే తన ధ్యేయమని అన్నారు. రామగుండం నగరాన్ని విద్య , వైద్య , పారిశ్రామిక , పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి , జిల్లా మంత్రివర్యుల సహకారంతో వేలాది కోట్ల రూపాయల విలువైన నిధులు , ప్రాజెక్ట్ లు మంజూరవుతున్నాయని అన్నారు. సింగరేణి , ఎన్ టి పి సి , ఆర్ ఎఫ్ సి ఎల్ తదితర పరిశ్రమల సి ఎస్ ఆర్ నిధులతో స్థానికంగా పలు అభివృద్ధి పనులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సుమారు 16 వేల కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ ప్రాజెక్ట్ లు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. తద్వారా రామగుండం నగరంలో ఉపాధి , ఉద్యోగావకాశాలు పెరుగుతాయని అన్నారు. సుమారు 150 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మిస్తున్నామని అన్నారు. గుండె పోటు వస్తే హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లవల్సిన అవసరం లేకుండా క్యాత్ లాబ్ సదుపాయం రామగుండం లోనే అందుబాటులోకి తీసుకు వస్తున్నామని అన్నారు. రూ 230 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రామగుండం నగరంలో సాంకేతిక కళాశాలల తో పాటు ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు కూడా ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. ఈ రెండేళ్ల స్వల్ప కాలంలోనే నగరంలో ఇంత మార్పు పస్పుటంగా కనిపిస్తుంటే విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ ఎస్ . ఇ . గురువీర , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పి వి రామన్ , సెక్రెటరీ ఉమా మహేశ్వర్ తో పాటు నాయకులు మనాలి రాజ్ ఠాకూర్ , మహంకాళి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లతో ఆశావాహుల ఆశలు అడియాసలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 17 (జనంసాక్షి):** వేములవాడ మున్సిపల్ లో వార్డుల వారిగా ఎన్నికల రిజర్వేషన్లు శనివారం ఖరారు అయ్యాయి. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు మారడంతో ఎన్నికల బరిలో ఉంటామనుకున్నా ఆశావాహుల ఆశలు అడియాశలు అయ్యాయి.

**వార్డుల వారిగా రిజర్వేషన్ల వివరాలు:**

వార్డు 1 బీసీ మహిళ, వార్డు 2 ఓసీ మహిళ, వార్డు 3 ఎస్సీ మహిళ, వార్డు 4 జనరల్, వార్డు 5 జనరల్ మహిళ, వార్డు 6 జనరల్, వార్డు 7 జనరల్, వార్డు 8 బీసీ జనరల్, వార్డు 9 జనరల్ మహిళ, వార్డు 10జనరల్ మహిళ, వార్డు 11 బీసీ మహిళ, వార్డు 12 ఎస్టీ జనరల్, వార్డు 13 ఎస్సీ మహిళ, వార్డు 14 జనరల్, వార్డు 15 బీసీ జనరల్, వార్డు 16 బీసీ జనరల్, వార్డు 17 ఎస్సీ జనరల్, వార్డు 18 జనరల్, వార్డు 19 జనరల్ మహిళ, వార్డు 20 ఎస్సీ జనరల్, వార్డు 21 బీసీ జనరల్, వార్డు 22 జనరల్ మహిళ, వార్డు 23 బీసీ మహిళ, వార్డు 24 బీసీ జనరల్, వార్డు 25 జనరల్, వార్డు 26 జనరల్ మహిళ, వార్డు 27 బీసీ మహిళ వార్డు 28 జనరల్ మహిళ గా కేటాయింపు చేశారు.

## రోడ్లపై ఇసుక లారీలు నిలిపితే కఠిన చర్యలు

### జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ



**వీణవంక జనవరి 17 (జనంసాక్షి):** వీణవంక ప్రధాన రోడ్లపై ఇసుక లారీలను నిలిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మీనారాయణ,ఎస్ఐ ఆవుల తిరుపతి లు అన్నారు.వీణవంక మండలంలోని చల్లూరు,కొండపాక, పోతిరెడ్డి పల్లి, శనివారం చర్లూర్లో ఇసుక రీచ్ క్వారీ నిర్వాహ కులతో మాట్లాడుతూ లారీల్లో ఓవర్ లోడ్ ఇసుక తరలించిన, ఇష్టాను సారంగా నిబంధనలను అతిక్రమించి రహదా రుల వెంట లారీలను పార్కింగ్ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు.ఇసుక రీచ్ యజమానులు లారీల పార్కింగ్ కొరకు ప్రత్యేకమైన స్థలాలు కేటాయించాలని అన్నారు. వెంట ఎస్ఐ ఆవుల తిరుపతి తదితరులున్నారు.

## ప్రజల్లో చైతన్యం వచ్చేవరకు పోరాటం


### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని, (జనంసాక్షి) :** ఎన్నికలు వస్తేనే అధికార పార్టీ పాలకులకు, నాయకులకు గుర్తుకు వస్తున్నాయని.. ఈసారి ఓట్ల కోసం కుల సంఘాలను మోసం చేస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. శనివారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత అక్టోబర్ మాసంలో కుల సంఘాలకు భవనాలు మంజూరు చేశారని, పాలకులకు పాలాభిషేకం చేయడం జరిగిందని.. తిరిగి అవే భవనాలకు జనవరి 12న శంఖుస్థాపనలు చేశారని విమర్శించారు. అయితే మంథని పట్టణంలోని పోచమ్మ గుడి వద్ద మేర, పూసల, స్వర్ణకార, కుమ్మరి, నాయిబ్రాహ్మణ కుల సంఘాలకు ఒకే చోట భవన నిర్మాణాల కోసం శిలాఫలకాలు వేసి శంఖుస్థాపన చేశారని, అయితే ఆ ప్రాంతమంతా వాగు ఒడ్డున ఉందని, ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. సమాజం మేల్కొనే వరకు ప్రజలను అప్రమత్తం చేయడంలో అలసత్వం నా పాత్రను పోషిస్తానని అన్నారు.

# లాటరీ ద్వారా మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**గోదావరిఖని, (జనంసాక్షి) :** లాటరీ పద్దతి ద్వారా జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మున్సిపల్ వార్డు / డివిజన్ రిజర్వేషన్ ఖరారు చేసే ప్రక్రియను శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,× మున్సిపల్ వార్డు, డివిజన్ లను రిజర్వేషన్ వారీగా కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 124 వార్డులలో 50 శాతం మహిళలకు కేటాయిస్తున్నట్లు, వీటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డ్రా పద్ధతిలో ఖరారు చేశామని అన్నారు. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల వార్డు సంఖ్యలో మార్పులు లేకపోవడంతో గత ఎన్నికల మాదిరిగానే ఎస్సి, ఎస్టీ, బీసీ లకు సీట్లను రిజర్వు చేశామని , రామగుండం పరిధిలో వార్డుల సంఖ్య 50 నుంచి 60 కు పెరగడంతో ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సి, ఎస్టీ సీట్లు, బీసి సీట్లను బీసీ డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా కేటాయింపులు చేపట్టామని అన్నారు. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల పరిధిలో రోటేషన్ పద్దతిలో రిజర్వేషన్ వార్డుల కేటాయింపు ఉంటుందని, రామగుండం పరిధిలో వార్డుల సంఖ్య పెరిగినందున రిజర్వేషన్ సీట్లు పునరావృతం అయ్యే అవకాశం ఉండవచ్చని అన్నారు. ఎస్సీల కు రామగుండంలో 13, పెద్దపల్లిలో 4, మంథని లో 2, సుల్తానాబాద్ లో 2 , ఎస్టీ లకు రామగుండం లో 1, పెద్దపల్లిలో 1, మంథని లో 1, సుల్తానాబాద్ లో 1, బీసీలకు రామగుండం లో 16, పెద్దపల్లిలో 13, మంథని లో 3, సుల్తానాబాద్ లో 4 స్థానాలు రిజర్వ్ అయ్యాయని అన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మున్సిపాలిటీలలో వార్డులవారిగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను తెలుపుతూ లక్కీ డ్రా ద్వారా మహిళలకు వార్డుల కేటాయింపు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ , మున్సిపల్ కమిషనర్లు,వెంకటేష్, రమేష్, మనోహర్ సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు



### హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రవి

**హనుమకొండ ప్రతినిధి, జనవరి 17 (జనంసాక్షి) :** గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని అదనపు కలెక్టర్ నెమురుగొమ్ముల రవి అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేస్తూ శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులచే జాతీయతా భావం పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, అధికారులు, ఉద్యోగులకు ఉత్తమ సేవాపురస్కారాల విషయంలో ఉత్తమ సేవలు, పారామీటర్స్లో సాధించిన ప్రగతిని ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై ప్రసంగ పాఠం తయారు చేసేందుకు నివేదిక వెంటనే సమర్పించాలన్నారు. పోలీసు శాఖ, హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్, కలెక్టరేట్ల వద్ద వేదిక డెకరేషన్, మార్చ్ ఫాస్ట్, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, సీటింగ్ ఏర్పాట్లు, ఆర్ అండ్ బి శాఖ అధికారులు బారికేడింగ్, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మెడికల్ క్యాంప్ ఏర్పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు జనరేటర్ ఏర్పాటు, మున్సిపల్ శాఖచే విద్యుదీకరణ, త్రాగునీరు, శానిటేషన్, ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి.గణేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రవి, హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి రాథోడ్ రమేష్, జిల్లా పంచాయితీ అధికారి లక్ష్మి రమాకాంత్, విద్య, వైద్య, విద్యుత్, పోలీసు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**ముత్తారం జనవరి 17(జనంసాక్షి):** తెలంగాణ మోడల్ స్కూల్ లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ తెలిపారు. ఆరో తరగతిలో 100 సీట్లకు,7 నుంచి 10 తరగతిలో ప్రవేశాలకు జనవరి 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ లోపు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మండల పరిధి లోని విద్యార్థిని విద్యార్థులు అవకాశం సద్వినియోగ పరచుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## కామారెడ్డి జిల్లాలోని వివిద మున్సిపాలిటీల రిజర్వేషన్ల ఖరారు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 17 (జనంసాక్షి):** కామారెడ్డి , ఎల్లారెడ్డి, బిచ్కుంద , బాన్సువాడ మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం తెలిపారు. కామారెడ్డి జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ లాటరీ పద్ధతిలో నిర్వహించారు.రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకత తో రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టినట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు , సంబంధిత అధికారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ పూర్తయినట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలు,మార్గదర్శకాలకు అనుగుణంగా ఖరారు చేయబడ్డాయి. లాటరీ ద్వారా ఖరారైన రిజర్వేషన్ల పూర్తి వివరాలను ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల కమిషన్కి నివేదించనున్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లు విక్టర్, మధుమోహన్, సంబంధిత మున్సిపల్ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపాదికన చర్యలు



**చిగురుమామిడి జనవరి17 (జనంసాక్షి):** తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని,గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ కొంకట మౌనిక చక్రధారి ప్రజలకు సూచించారు.శనివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలోని 10,11,12వ వార్డులో ఆయా వార్డు మెంబర్లతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా వారి దృష్టికి తాగునీటి సమస్యతోపాటు సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ఆ వార్డు ప్రజలు వారికీ విన్నవించారు.గంగిరెద్దుల కాలనీలో గత కొన్నాళ్లుగా తాగునీటి సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, తమను పట్టించుకునే వారే లేకుండా పోయారని గంట రాజయ్య, గంట కొమురయ్య, నర్రావుల వెంకటేష్,పెద్ద బత్తుల బుచ్చయ్య,గట్టవ్వ,పెద్దబత్తుల ఎల్లవ్వ, ప్రవళికలు గ్రామసర్పంచ్ కొంకట మౌనిక ముందు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.త్రాగునీరు లేకపోవడంతో బోరింగుల వద్ద క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు.వారి తాగునీటి సమస్యను పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాజును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కాసర్ల హరీష్, వార్డు సభ్యులు బడుకోలు దేవేందర్ రెడ్డి, అందే సంపత్, కొంకట బిక్షపతి తదితరులు ఉన్నారు.

# బీసీ జనరల్ చేర్మెన్తో వేడెక్కిన రాజకీయం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 17 (జనంసాక్షి):** గ్రామ పంచాయతీ నుండి నగర పంచాయతీగా మారిన అప్పటినుండి చైర్పర్సన్ బీసీ మహిళ కావడంతో మహిళలకె అవకాశం దక్కింది. కానీ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీసీ జనరల్ చైర్మన్ అభ్యర్థిగా ఖరారు కావడంతో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. మున్సిపల్ చైర్మన్ పదవి బీసీ జనరల్ గా కేటాయించబడంతో ఒక్కసారిగా వేములవాడ రాజకీయ వాతావరణం వేడెక్కింది.గత రెండు పర్యాయాలుగా మహిళలే మున్సిపల్ చైర్ పర్సన్ గా సేవలందించగా,ఈసారి బీసీ జనరల్ గా మారడంతో రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. దీంతో బీసీ వర్గాలకు చెందిన ఆశావహుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది.మున్సిపల్ ఎన్నికల బరిలో దిగేందుకు పలువురు నేతలు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నట్టు సమాచారం.వార్డుల వారీగా చర్చలు, కూటముల ప్రయత్నాలు మొదలవ్వడంతో వేములవాడ మున్సిపల్ ఎన్నికలు ఈసారి తీవ్ర పోటీకి వేదికగా మారను న్నాయనే అంచనాలు వినిపిస్తున్నాయి.బీసీ జనరల్ చైర్మన్ నిర్ణయం వేములవాడ రాజకీయాలకు కొత్త మలుపు తిప్పిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.అదికార పార్టీ, బిజెపి, బిఆరెఎస్ పార్టీల మధ్య తీవ్రపోటీ నెలకొనుంది. మూడు పార్టీల లో ఏ నాయకుడికి టికెట్ వస్తుందో, ఎంతమంది నాయకులు పార్టీలు ఫిరాయింపు చేస్తారో వేచి చూడాల్సిందే మరి.

# డ్రగ్స్ మాన్పించేందుకు ప్రత్యేక సెంటర్

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మత్తు పదార్థాలకు ఎవరు బానిసలు కావద్దని, మత్తు పదార్థాలు మాన్పించేందుకు మంజూరునగర్లో ప్రత్యేక సెంటర్ ఏర్పాటు కావడం అభినంద నీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని మంజూరునగర్లో సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన డి అడిక్షన్ సెంటర్ ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాల న్నారు. వాటికి బానిసలు అయితే ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అరికిల్ల మనోహర్, భూపాలపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, నాయకులు బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, రవీందర్, తోట రంజిత్, సంస్థ మేనేజర్ సుంకరి సునీల్, డాక్టర్లు వినోద్, అక్షయ్, కోఆర్డి నేటర్లు రాజయ్య, సైకాలజిస్ట్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాటికల్లు ఆరోగ్య ఔషధం

**తాటికల్లు రుచిచూసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి**



**పాలకుర్తి జనవరి 17 (జనంసాక్షి):** తాటికల్లులో ఆరోగ్య ఔషధాలు ఉంటాయని, తాటికల్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం జనగామ జిల్లా. కొడకండ్ల మండలంలో దయాకర్ రావు పర్యటలో భాగంగా నర్సింగాపురం గ్రామం నుండి కొడకండ్ల కు వెళ్తుండగా మార్గం మధ్యలో నర్సింగాపురం గ్రామ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త చిత్తలూరు వెంకటయ్య తాటికల్లు తాగాలని దయాకర్ రావును కోరడంతో కార్యకర్త కోరిక మేరకు తాటికల్లు తాగారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ తాటికల్లులో ఔషధంగా గుణాలు ఉన్నాయని శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది అన్నారు. ఆయన వెంట మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## పంప్ హౌస్ వద్ద నిరసనలకు అనుమతులు లేవు

- జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి):** చనాక కోరట బ్యారేజి, పంప్ హౌస్ వద్ద ఎటువంటి నిరసనలు, ర్యాలీలకు అనుమతులు లేవని జిల్లా అఖిల్ మహాజన్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉన్నందున, ముందస్తు పోలీసు అనుమతులు లేనిదే ర్యాలీలకు నిరసనలు చేయరాదని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. చనాక కోరట పంపు హౌస్ వద్ద కానీ బ్యారేజ్ వద్ద కానీ నిరసనలకు తెలియజేయడానికి, బైక్ ర్యాలీలు నిర్వహించడానికి ఎలాంటి అనుమతులు లేవని, పోలీసు ముంద స్తు అనుమతులు లేకుండా నిరసనలు చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. శాంతిభద్రతలకు విగాథం కలిగించేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. యువత కేసుల బారిన పడినట్లయితే ఉద్యోగ అవకాశాలలో మరియు విదేశాలకు వెళ్లేలా పాస్ పోర్ట్ రాకుండా ఇబ్బందులు ఎదుర్కొన వలసి వస్తుందని, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచు కొని అనుమతులు లేని నిరసన కార్యక్రమాలకు పాల్గొనకుండా ఉం డాలని సూచించారు. ప్రజల రక్షణ భద్రత బాధ్యతలను పోలీసు వ్యవ స్థ సక్రమంగా నిర్వహిస్తుందని, వాటికి భంగం కలిగేలా ప్రవర్తిం చవద్దని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీసు వ్యవస్థ ప్రజల ధన,మాన, ప్రాణ రక్షణకై కృషి చేస్తుందని తెలిపారు.

## నిషేధిత ఇళ్ల జాబితాను రద్దు చేయాలి

**644 ఇళ్లపై క్రయ విక్రయాల నిషేధానికి వ్యతిరేకంగా బీసీ కాలనీవాసుల ధర్నా**



**భూదాన్ పోచంపల్లి, జనవరి 17 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలో రెవిన్యూ అధికారులు రూపొందించిన 644 నిషేధిత ఇళ్ల జాబితాను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ కాలనీ వాసులు శనివారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై 22ఏ కింద నిషేధం విధించడం వల్ల తమ ఇళ్లను అమ్ముకోవడం, బదిలీ చేయడం సాధ్యం కాక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి నివాసం ఉంటూ పన్నులు చెల్లిస్తున్నప్పటికీ అకస్మాత్తుగా నిషేధిత జాబితాలో చేర్చడం అన్యాయమని, ఇది పేదలపై మోపిన భారమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ప్రభుత్వం చట్టబద్ధంగా కేటా యించినవే అయినప్పటికీ రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం వల్ల అవసర సమయాల్లో అప్పులు తీయలేక, అమ్మకాలు జరపలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ వైస్ చైర్మన్ బత్కా లింగస్వామి, గోరిగంటి నరసింహ, తంతరపల్లి రంగయ్య, ఇంజమూరి యాదగిరి, పొన్నం సహదేవ్, గోలి సిద్ధులు, రామస్వామి, యాదగిరి, గోరుగంటి అశోక్, బాత్క శ్రీను, చిటికలు నరేష్, సిద్ధిరాములు, శ్రీకాంత్, చేరాల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో కొనసాగింపు పై "నో కామెంట్"

- స్పీకర్ తీర్పును గౌరవిస్తా..
- చేవెళ్ల భీమ్ భరత్ కు మామూళ్లు ఇచ్చాను
- చించల్ పేట ఉప సర్పంచ్ నీ తిట్టిన మాట వాస్తవం
- అభివృద్ధిని చూసి ఓర్వకనే ప్రజల మధ్య చిచ్చు
- చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య హాట్ కామెంట్స్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 17 (జనంసాక్షి):** తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును గౌరవిస్తారని, బిఆర్ఎస్ పార్టీలో కొన సాగింపుపై "నో కామెంట్" అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాట్ హాట్ కామెంట్ చేశారు. వికారాబాద్ జిల్లా చించల్ పెట్ గ్రామంలో జరిగిన ఘర్షణపై శనివారం వికారాబాద్ గెస్ట్ హౌస్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు అనర్హత వేటుపై తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ స్పీకర్ తీర్పును గౌరవిస్తామని అన్నారు. అయితే ఇకనుంచి బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతారా అనే విషయమై విలేకరులు అడిగిన ప్రశ్నకు కొనసాగింపుపై నో కామెంట్ అంటూ దాటవేశారు. చేవెళ్ల నియోజకవర్గం అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రభుత్వంతో నిధుల కోసం కలిసి పనిచేసినందున కోట్ల రూపాయలతో చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఇక చేవెళ్ల నియోజకవర్గ ఇన్చార్జి కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీమ్ భరత్ పై ఎమ్మెల్యే కాలే యాదయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్లుగా చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్ కు మామూళ్లు ఇచ్చానని ఆయనకు చించల్ పేటలో పని ఏమి ఉందని వ్యాఖ్యానించారు. ఆయనకు సంబంధం లేని గొడవతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం జరుగుతుందని దీని వెనుక పరోక్షంగా ఆయన హస్తముందని వ్యాఖ్యానించారు. తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు తనపై ఫిర్యాదు చేశారని ఒక సామాన్య వ్యక్తి స్పీకర్ దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేసేంత విషయం ఉంటుందా అని ప్రశ్నించారు. తన వెనుక నుంచి భీమ్ భరత్ కథ నడిపిస్తూ స్పీకర్ కు తనపై ఫిర్యాదు చేసిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓడిన సర్పంచ్ అభ్యర్థి ఇంటిపై ఉప సర్పంచ్ బాలరాజ్ తో పాటు కొందరు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దాడి చేసిన కారణంగా ఉప సర్పంచ్ బాలరాజును మందలించి తిట్టిన మాట వాస్తవమని అంగీకరించారు. ఇంతకాలం తనతో పాటు కాంగ్రెస్ పార్టీలో క్రియ శీలక కార్యకర్తగా ఉంటూ పనిచేసిన కారణంగానే అదే చనువు తో ఉప సర్పంచ్ ను ప్రేమపూర్వకంగా తిట్టినట్లు ఆయన తెలియజేశారు. తనతో పాటు పనిచేసిన వారందరినీ అభివృద్ధి చేశానని ఇప్పుడు వారంతా ఇతరుల పంచాన చేరి గొడవలు సృష్టిస్తున్నారని అన్నారు. కలిసిమెలిసి ఉండే ప్రజల మధ్య చిచ్చు రగిలేసే ప్రయత్నం చేయవద్దని కోరారు. అట్టడుగు స్థాయి నుంచి అంచలంచలుగా ఎదుగుతూ పదవులు చేపట్టి ఇప్పుడు ఎమ్మెల్యేగా కొనసాగుతూ అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. ఇది చూసి పూర్వకనే కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులే ప్రజల్లో నాపై బురద చల్లి పరువు తీసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. చిన్న గొడవపై తాను ప్రెస్ మీట్ చేయడం దురదృష్టకరమని అన్నారు. అయినా నాపై వచ్చిన ఆరోపణలకు బాధ్యతయుతంగా ప్రజలకు తెలియాలని ఉద్దేశంతో జరిగిన సంఘటనపై వివరణ ఇస్తున్నట్లు వివరించారు.

## సకాలంలో ఆంకాలజీ చికిత్సతో ప్రాణ రక్షణ

**మలక్‌పేట్ యశోదా వైద్యులు వెల్లడి**




**నిర్మల్ రూరల్, జనవరి 17 (జనంసాక్షి) :** ఆక్యూట్ మైలోయిడ్ లుకీమియా (ఏఎంఎల్)తో అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న నిర్మల్‌కు చెందిన 34 ఏళ్ల యువకుడి ప్రాణాలను మలక్‌పేట్ యశోదా హాస్పిటల్ వైద్యబృందం సకాలంలో చికిత్స చేసి కాపాడినట్లు వైద్యులు డా,,రోహిత్ రెడ్డి తెలిపారు. శనివారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. రోగి ఫెబ్రైల్ న్యూట్రోపీనియా, తీవ్రమైన బలహీనత వంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆసుపత్రిలో చేరాడని చెప్పారు. తక్షణమే ఏఎంఎల్ గా రోగ నిర్ధారణ చేసి ఇండక్షన్ కీమోథెరపీ (3+7 రెజిమెన్)తో పాటు హిడాక్ కన్సాలిడేషన్ సైకిల్స్ నిర్వహించామని వివరించారు. ఎమ్ఆర్‌డి పాజిటివిటీ ఉన్నప్ప టికీ, 24 గంటల నిరంతర పర్యవేక్షణ, రక్త మార్పిడి, యాంటీబయోటిక్స్, సపోర్టివ్ కేర్ ద్వారా ఇన్ఫెక్షన్లు నియంత్రించి రిమిషన్ సాధించగలిగామని తెలిపారు. యశోదా ఆసుపత్రి యాజమాన్యం స్పందిస్తూ, ఏఎంఎల్ ప్రాణాపాయకరమైన రక్త క్యాన్సర్ కేసులను సమర్థవంతంగా నిర్వహించగల అత్యాధునిక ఆంకాలజీ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం, 24/7 క్రిటికల్ కేర్ సేవలు తమ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దేవరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాప్రయోజనాల కోసం జనంసాక్షి కృషి



**మహబూబ్ నగర్ టౌన్, జనవరి 17 (జనంసాక్షి) :** జనంసాక్షి దినపత్రిక క్యాలెండర్‌ను ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రజల ముందుకు తీసుకువెళ్లడంలో జనంసాక్షి పేపర్ పాత్ర అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మూడ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్, జనంసాక్షి బ్యూరో వెంకటరమణ, జిల్లా ఫోటో జర్నలిస్టు శ్రీనివాస్ తో పాటు పలువురు నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందిస్తూ, భవిష్యత్తులోనూ ప్రజా ప్రయోజనాలకు అంకితంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని



**గూడూరు,జనవరి17(జనంసాక్షి):** గూడూరు మండలంలోని తీగలవేణి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 6వ,తరగతి చదువుతున్న విద్యార్థిని జాటోతు అమ్మూలు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయులు పారుఖ్, పీడీ గొల్లపూడి రాణి తెలిపారు. ఈనెల 15న,మహబూబాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలలో పాల్గొని సబ్ జూనియర్ అథ్లెటిక్స్‌లో 60 మీటర్ల విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సంపాదిం చి,ఈనెల 18న, అదిలాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపా ధ్యాయులు పారుఖ్,ఉపాధ్యాయ బృందం,గ్రామ సర్పంచ్ దారవత్ రాజు అభినందించారు.

## గుంజపడుగు అభివృద్ధికి సింగరేణి సహకరించాలి



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగు గ్రామ అభివృద్ధికి సింగరేణి సంస్థ తమ వంతు సహకారం అందించాలని గ్రామ సర్పంచ్ దండేవేణ సంధ్య భాను ఆర్జీ 3 జీఎం మధుసూదన్ ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రభు త్వ పాఠశాల తరలింపు నిలిపివేయాలని, సోలార్ ల్యాంప్స్, స్ట్రీట్ లైట్స్, వాటర్ ప్లాంట్, కమ్యూనిటీ టాయిలెట్స్, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జీఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ సంధ్య తెలిపారు. అంతకన్నా ముందు నూతన జీఎం గా బాధ్యతలు చేపట్టిన మధుసూదన్ ను సర్పంచ్ దంపతులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆలిండియా బార్ ఎగ్జామినేషన్ ఫలితాల్లో సత్తాచాటిన బొబ్బ నవతారెడ్డి






**శేరిలింగంపల్లి, జనవరి 17 (జనంసాక్షి) :** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్(ఏఐబిఈ) ఫలితాల్లో బిఆర్ఎస్ నేత, చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఉత్తీర్ణత సాధించి తన సత్తా చాటారు. న్యాయవాద వృత్తిలో శాశ్వత ప్రాక్టీస్ కోసం అత్యంత కీలకమైన ఈ పరీక్షలో విజయం సాధించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో నవతారెడ్డి మాట్లాడుతూ... హక్కు ఉన్నచోట పరిస్కారం ఉంటుందని(వేర్ దేర్ ఈజ్ ఏ రైట్, దేర్ ఈజ్ ఏ రెమెడీ) వివరించారు. సత్యమేవ జయతే అనే న్యాయ సూత్రాన్ని తాను నమ్ముకున్నానని, ఇదే స్ఫూర్తితో న్యాయసేవలో నిరంతరం ముందుకు సాగుతానని తెలిపారు. ఈ పరీక్షలో విజయం సాధించినందుకుగాను బొబ్బ నవతారెడ్డి తండ్రి బొబ్బ విజయ్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, స్నేహితులు, తోటి న్యాయవాదులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. నిరుపేదలకు, అభాగ్యులకు, పీడితులకు న్యాయం అందేలా ఒక విశిష్ట ఆశయంతో మరింత ముందుకు సాగుతానని, భారత రాజ్యాంగ వ్యవస్థలోని చట్టం, న్యాయం ఎవరికి ప్రత్యేకమైన చుట్టం కావని, అందరికీ సమన్యాయం దక్కినప్పుడే న్యాయదేవత హర్షిస్తుందని నవతారెడ్డి అభిప్రాయపడ్డారు.

## ప్రభుత్వ ఉద్యోగికి బెదిరింపులు

- ముగ్గురు రిపోర్టర్లపై కేసు.. ఒకరి అరెస్ట్
- ఫిర్యాదుదారున్ని బెదిరించి 60 వేలు వసూలు చేసిన నిందితులు




**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి):** ప్రభుత్వ ఉద్యోగిని బెదిరించిన కేసులో ముగ్గురు రిపోర్టర్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ వివరాల ప్రకారం, ఫిర్యాదుదారు జిల్లాకు చెందిన పశు వైద్యాధికారి ఇతను 2023 సంవత్సరంలో సోనాలలో పశు వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో తన సహోద్యోగులతో కలిసి ఒక లక్ష రూపాయల చిట్టీ వేసుకున్నారు. చిట్టీ వచ్చిన రోజు పార్టీ చేసుకోవాలనే ఆచారం మేరకు, 15.07.2023 న ఫిర్యాదుదారికి చిట్టీ రావడంతో, అదే రోజు మధ్యాహ్నం గడ్డం అజయ్ రెడ్డి, తేజాపూర్ న్యూస్ రిపోర్టర్ దినేష్, ధన్నూర్-బి న్యూస్ రిపోర్టర్ పరారి బీమా ప్రవీణ్, కనుగుట్ట గ్రామం న్యూస్ రిపోర్టర్ పరారీ అనే ముగ్గురు అక్కడికి వచ్చి పార్టీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు తీసి, "మీరు ప్రభుత్వ ఉద్యోగులు, ఇవి మీడియా చానళ్లలో మరియు పత్రికల్లో ప్రచురిస్తే మీ పరువు పోతుంది" అంటూ బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారు. అనంతరం ముగ్గురికి రూ.20,000 చొప్పున మొత్తం రూ.60,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్ అవకాశాలు ఉన్నాయని, వీడియోల వల్ల నష్టం జరుగుతుందేమోనన్న భయంతో ఫిర్యాదుదారు తన చిట్టీ డబ్బుల నుండి రూ.60,000 ను నిందితుడు గడ్డం అజయ్ రెడ్డికి ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు తీసుకున్న అనంతరం వీడియోలు డిలీట్ చేస్తామని చెప్పి, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించినట్లు తెలిపారు. ఈ ఘటన వల్ల ఫిర్యాదుదారు మానసిక వేదనకు గురై, అనంతరం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకున్న కారణంగా ఆలస్యంగా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా ముగ్గురు నిందితులపై బెదిరింపులు, అక్రమ డబ్బుల వసూలు, మోసం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు, ఒకరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు గానీ, సాధారణ ప్రజలు గానీ ఇలాంటి బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్ ఘటనలకు గురైతే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని బోథ్ సీఐ డి.గురుస్వామి సందర్భంగా సూచించారు.

## బోధన్‌లో సీఎం కప్ క్రీడల కాగడా ర్యాలీ

**ప్రారంభించిన బోధన్ ఎసిపి శ్రీనివాస్**




**బోధన్, జనవరి 17 (జనంసాక్షి) :** బోధన్ మండల పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సీఎం క్రీడల కాగడా ర్యాలీని బోధన్ ఎసిపి శ్రీనివాస్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడ పోటీలలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. గ్రామస్థాయి నుండి మండల జిల్లా రాష్ట్ర స్థాయి వరకు తమ ప్రతిభను చాటి తమ నైపుణ్యానికి వెలికి తీసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏసిపి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో యాలం వేణు, పట్టణ సీఐ వెంకటనారాయణ, బోధన్ మండల గ్రామ కార్యదర్శులు, ఎంపీడీవో సిబ్బంది రమాకాంత్, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, యువకులు పాల్గొన్నారు.

## కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలపై పోరాడండి

**మాజీ ఎమ్మెల్యే ఏఐకేఎస్ నాయకులు జూలకంటి రంగారెడ్డి పిలుపు**




**వరంగల్ ప్రతినిధి, జనవరి 17 (జనంసాక్షి) :** కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశానికి అన్నం పెట్టి అన్నదాత ఆందోళన చెందుతున్నాడని, కార్మిక కర్షక వర్గాలకు విఘాతం కలిగించే చర్యలు చేపట్టిన కేంద్ర అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా నిలిచి పోరాడాలని ఏఐకేఎస్ నాయకులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సిఐటియు రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు తెలంగాణ రైతుసంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వరంగల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో దుగ్గొండి మండల కేంద్రంలో జీపు జతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఇసంపెల్లి బాబు అధ్యక్షతన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత కిసాన్ సభ నాయకులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతు నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేశానికి అన్నం పెట్టే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ యజమానులకు కట్టపెట్టడానికి మోడీ ప్రభుత్వం పనిచేస్తున్నదని రైతాంగం తమ పంటలకు పెట్టుబడులు పెట్టి సరైన దిగుబడులు రాక అప్పుల పాలై ఆత్మ అత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ప్రొఫెసర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండు చేశారు. ఎన్నో పోరాటాలతో కార్మికులు సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసి మోడీ ప్రభుత్వం కార్పొరేట్ యజమానులకు, పరిశ్రమాధిపతులకు అనుకూలంగా 4లేబర్ కోడ్లను తీసుకు వచ్చినారని ఆయన విమర్శించారు. కార్మికుల శ్రమను దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని, కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అప్1ప్రభుత్వం లో కమ్యూనిస్టుల పోరాటంతో అమలులోకి వచ్చిన మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిరుకార్చేవిదంగాచేర్పులు మార్పులు చేస్తూవ్యవసాయ కూలీలకు పనిలేకుండా కుట్రలు చేస్తూ జాతిపిత గాంధీ పేరు తీసవేయడంసిగ్గుచేటు అనిఅన్నారు. వినాశకరమైన విత్తన చట్టాన్ని, విద్యుత్ సవరణ చట్టాన్ని మోడీ ప్రభుత్వం తీసుకు వస్తున్నదని ఈ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు ప్రజాతంత్ర వాదులు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆరురీ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, అధ్యక్షులు నామిండ్ల స్వామి,. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పి. కృష్ణరెడ్డి, జిల్లా నాయకులు కొరబోయిన కుమార స్వామి, బోల కొమురయ్య అక్కపెల్లి సుధాకర్, నర్సింహ రెడ్డి, కోడెం రమేశ్,నర్సింహ స్వామి, మాదాసి శ్రీనివాస్ బోల్ల శ్రీకాంత్ పొన్నం రాజుబొజ్జ సంపత్, గొర్కటి రమేశ్, శెంచ రమేశ్,దాసరి రవీందర్, కక్కెర్ల మహేష్ పాల్గొన్నారు.

## కేసు నమోదులో నిర్లక్ష్యం ఎందుకు..?

- రాంపూర్‌లో అమాయక ప్రజలపై దాడులు
- ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఏం చేస్తున్నారు?
- నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి



**తలకొండపల్లి (జనంసాక్షి) :** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్, వెంకటాపూర్, లింగరావుపల్లి, పడకల్,గ్రామాలలో బారాస నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు చేస్తుంటే, ఫిర్యాదు ఇచ్చిన కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని,బాధితులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే నిర్లక్ష్యం వహిస్తే ఎవరికీ చెప్పుకోవాలని నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం రాంపూర్‌లో బారాస నాయకుల దాడిలో గాయపడిన లక్ష్మమ్మ,జంగయ్య,కిరణ్,శ్రీను,లను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి పరామర్శించారు.గత నెల రోజులుగా రాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసిన ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చెయ్యడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.కేసు నమోదు చేయడంలో ఎస్సై తీరును సిపి సుధీర్ బాబుకు ఎంపీ మల్లు రవి చరవాణిలో వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో దౌర్జన్యాలకు ,గూండాగిరికి చోటు లేదని,అమాయకులపై చేయి ఎత్తిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని స్పష్టంగా హెచ్చరించారు.బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడి పోరాడుతుందని ఎంపీ మల్లు రవి,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి బాధితులకు గట్టి భరోసాని ఇచ్చారు. సిపి సుధీర్ బాబు ఆదేశాలతో షాద్ నగర్ ఏసిపి శుక్రవారం రాత్రి రాంపూర్ గ్రామానికి చేరుకొని జరిగిన ఘటనలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.గాయపడిన బాధితులను పొల్యూషన్ బోర్డు మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్,కాంగ్రెస్ మండలాధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,కాకి కృష్ణ,ఆవంచ నరసింహారెడ్డి,పయ్యావుల రమేష్ యాదవ్,శ్యామ్ సుందర్ రెడ్డి,బాల్ రెడ్డి,వెంకటయ్య,కాకి శివ,తిక్కల శివ, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
18 జనవరి 2026

# మేడారంపై పోలీసుల డేగ కన్ను



- కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన మంత్రి సీతక్క
- 450 సీసీ కెమెరాలతో కట్టుదిట్టమైన నిఘా
- భద్రతా విషయంలో ఎలాంటి రాజీ వద్దు

**ములుగు బ్యూరో (జనంసాక్షి) :** మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా శాంతి భద్రతల ఏర్పాట్లపై రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మేడారంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, అక్కడి నుంచి కొనసాగుతున్న భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. జాతర ప్రాంతం అంతటా సుమారు 450 సీసీ కెమెరాల ద్వారా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై జాతర ప్రాంగణంలో జరుగుతున్న కార్యక్రమాలు, భక్తుల రాకపోకలు, జనసాంద్రత పరిస్థితులను మంత్రి సీతక్క ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరిగితే పోలీసులు ఎలా స్పందిస్తారు, ముందస్తు చర్యలు, సన్నాహాలు ఏమిటన్న అంశాలను పోలీస్ అధికారులు మంత్రికి వివరించారు. భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రతి చిన్న అంశాన్ని కూడా అప్రమత్తతతో పర్యవేక్షించాలని మంత్రి సీతక్క పోలీస్ అధికారులకు స్పష్టంగా ఆదేశించారు. భక్తులు నిర్భయంగా, ప్రశాంతంగా జాతరలో పాల్గొనేలా భద్రతా ఏర్పాట్లు ఉండాలని, పోలీస్ యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ అల్లర్ల కుట్రదారు ట్రంప్

- తీవ్ర విమర్శలు చేసిన ఇరాన్ సుప్రీం ఖమేని



**టెహ్రాన్, జనవరి 17 (జనంసాక్షి) :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్న ఆయన.. ఇరాన్‌లో ఆందోళనలకు, ప్రాణ నష్టానికి ఆయనే కారణమని ఆరోపించారు. ఇటీవల చోటు చేసుకున్న ఆందోళనల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఖమేనీ తొలిసారి ప్రస్తావించారు. ఇటీవల ఆందోళనల వెనుక అమెరికా కుట్ర దాగుంది. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడం వారి లక్ష్యం. ఆందోళనల వేళ అమెరికా అధ్యక్షుడు స్వయంగా వ్యాఖ్యలు చేస్తూ నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. అందుకే ఆయన్ను నేరస్థుడిగా పరిగణిస్తున్నాం. నిరసనల్లో పాల్గొన్నవారు అమెరికా కోసం పనిచేసిన వారే. విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేశారు. ఎంతో మందిని గాయపరిచారు' అని సుప్రీం లీడర్ ఖమేనీ పేర్కొన్నారు. ఆందోళనకారులు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న మందుగుండు సామగ్రిని వినియోగించారని ఖమేనీ ఆరోపించారు. యుద్ధం వైపు దేశాన్ని తీసుకెళ్లాలని అనుకోవడం లేదన్నారు. నేరస్థుల్లో విదేశీయులూ ఉన్నారన్నారు. నేరస్థులెవరినీ విడిచిపెట్టబోమని, కేసులను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఆందోళనల్లో పాల్గొన్న వారిలో దాదాపు 800 మందికి ఇరాన్ మరణశిక్ష అమలు చేస్తుందనే వార్తలు వచ్చాయి. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో గల్ఫ్ దేశాలు జోక్యం చేసుకోవడం తదితర పరిణామాల తర్వాత ఇరు దేశాలు వెనక్కి తగ్గినట్లు కనిపించింది. ఈ నేపథ్యంలో ఖమేనీ స్పందిస్తూ అమెరికాపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు ఇరాన్ హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3వేలకు పైగా మరణించినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.



# తిరుగు ప్రయాణంలో జనం

- రద్దీ తట్టుకునేలా ట్రాఫిక్ మళ్లింపు

**నల్లగొండ, జనవరి 17 (జనంసాక్షి) :** సంక్రాంతి రద్దీ నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. పండగ అనంతరం ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ఎన్‌హెచ్-65 విస్తరణ పనుల దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. చిట్యాల, పెద్దకాపర్తి, కొర్లపహాడ్, పంతంగి టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు ఉండటంతో.. పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలు సూచించారు. గుంటూరు నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. గుంటూరు-మిర్యాలగూడ- హాలియా- చింతపల్లి- మాల్ మీదుగా హైదరాబాద్‌కు వాహనాల మళ్లింపు చేపట్టారు. మాచర్ల- సాగర్- పెద్దవూర- చింతపల్లి- మాల్ మీదుగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. విజయవాడ నుంచి వచ్చే భారీ వాహనాలు కోదాడ-మాల్ మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు. ఎన్‌హెచ్-65పై ట్రాఫిక్ జామ్ ఏర్పడితే చిట్యాల నుంచి భువనగిరి మీదుగా వాహనాలను దారిమళ్లించనున్నారు. డ్రోన్ కెమెరాలు, సీసీ టీవీలతో ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులకు ప్లాన్

**వరంగల్, జనవరి 17 (జనంసాక్షి) :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద మహోత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు శరవేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇంటిల్లిపాది తరలివెళ్లి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతర సమీపిస్తున్న వేళ ఇప్పటికే చాలా మంది భక్తులు మేడారం బాట పడుతున్నారు. ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో మహాజాతర జరగనుండగా భక్తులను తరలించేందుకు ఆర్టీసీ అధికారులు సమాయత్తం అవుతున్నారు. జాతర జరిగే మూడు రోజుల ముందు నుంచే ప్రత్యేకంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాల మీదుగా మేడారానికి భక్తులతను సురక్షితంగా తరలించేందుకు భూపాలపల్లి ఆర్టీసీ డిపో అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ నెల 25 నుంచి మొదలై జాతర మొదలు ఫిబ్రవరి 1 వరకు ప్రత్యేక బస్సులను నడిపించనున్నారు. 8 రోజుల పాటు భక్తులను తరలించేందుకు ప్రత్యేకంగా 340 బస్సులను సిద్ధం చేశారు. రోజుకు సుమారు 50 ట్రిప్పులను నడిపించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇందుకు నాలుగు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. సకాలంలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయడంలో గతంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపించాయి. ఫలితంగా ప్రైవేటు వాహనాల్లోనే భక్తులు తరలివెళ్లడంతో అతి తక్కువ మంది ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఎదురైందనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వం మహిళల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఈ జాతరలో ఆర్టీసీలో ఉచిత ప్రయాణాలను కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న తరహాలోనే సూపర్ లగ్జరీ బస్సులు మినహా ఎక్స్‌ప్రెస్, ఆర్డీనరీల్లో మేడారానికి తరలివెళ్లే భక్తులకు ఉచిత ప్రయాణ సదుపాయం ఉంటుందని అధికారులు వెల్లడించారు. అయితే, చార్జీల పెంపు ఉంటుందనే చర్చ సాగతుండగా వాటిపై ప్రభుత్వం ఇప్పటికి స్పష్టతనివ్వలేదు. గత జాతర మాదిరిగానే చార్జీలను అమలు చేస్తారా.. లేదా పెంచుతారా? అనే విషయం తెలియాల్సి ఉంది. మరోవైపు 340 బస్సులను ఏర్పాటు చేస్తున్న అధికారులు వీటిని సమయానుకూలంతో పాటు ప్రయాణికలకు సరిపడా బస్సులను సకాలంలో అందుబాటులో ఉంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలనే డిమాండ్ భక్తుల నుంచి వ్యక్తమవుతోంది.



## నేడు మేడారంలో ముఖ్యమంత్రి పర్యటన




**ములుగు బ్యూరో, జనవరి 17 (జనంసాక్షి):** ముఖ్యమంత్రి నేడు మేడారం పర్యటించనున్న సందర్భంగా ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్ ఆధ్వర్యంలో సమగ్ర భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన భద్రతా చర్యలను ఎస్పీ సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా బాంబు డిస్పోసల్ బృందంచే విస్రుత తనిఖీలు, ట్రబుల్ మేకర్స్‌పై నిఘా,రోడ్ ఓపెనింగ్ పార్టీల ద్వారా తనిఖీలు,సబోటేజ్ చెక్స్ వంటి కీలక భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. ఎవరు కూడా పోలీసుల అనుమతి లేకుండా డ్రోన్స్ ఎగరవేయడం నిషేధిస్తున్నట్లు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ముఖ్యమంత్రి పర్యటించే ఒక్కో ప్రాంతానికి ఒక్కో అధికారిచే భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా డి-రింగ్ భద్రత, స్టేజ్ యాక్సెస్ కంట్రోల్, రూఫ్‌టాప్ సెక్యూరిటీ అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.

# పురపాలక ఎన్నికల హీట్

### నేతల్లో మొదలైన కోలాహలం

**మహబూబాబాద్, జనవరి 17 (జనంసాక్షి) :** జిల్లాలోని ఐదు పురపాలక సంఘాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. పురపాలక ఎన్నికలకు త్వరలో షద్యూల్ వెలువడనుండడంతో పాటు, రిజర్వేషన్లు కూడా కొలిక్కి వచ్చాయి. దీంతో పట్టణాల్లో సందడి మొదలయ్యింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల పురపాలక సంఘాల్లో సామాజిక వర్గాల వారీగా వార్డుల సంఖ్య కోటాను ప్రకటించింది. దీంతో ఆశావాహులు ఏ వార్డులు ఏ కేటగిరికి రిజర్వు కావచ్చు అంటూ అంచనాలు వేస్తున్నారు. దీంతో పట్టణాల్లో సర్వత్రా వార్డుల రిజర్వేషన్లపై చర్చ కొనసాగుతుంది. 2011 జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీ రిజర్వేషన్లను నిర్ణయించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. పురపాలక సంఘం అధికారులు కూడా వార్డుల రిజర్వేషన్ల ఖరారుకు కసరత్తులు చేసి సంబంధిత వివరాలను జిల్లా కలెక్టర్‌కు అందించినట్లు సమాచారం. సమావేశాలు.. సంప్రదింపులు వార్డు కౌన్సిలర్లు, ఛైర్మన్లు/ఛైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారు కానప్పటికీ ఇప్పటికే ప్రధాన పార్టీల నాయకులు ఆశావాహుల నుంచి పేర్లను తీసుకోవడంతో పాటు గెలుపు గుర్రాలు ఎవరనే అంశాలపై దృష్టి సారించారు. కాంగ్రెస్, భారాస, భాజపా, సీపీఐ, సీపీఎం పార్టీలు పుర ఎన్నికలకు సై అంటూ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. అధికార పార్టీ పురపాలక సంఘాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఇటీవల మహబూబాబాద్, డోర్నకల్‌లో పర్యటించి అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించి పట్టణంలోని కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశంచేశారు. గత నెలలో బిఆర్స్ నేత కేటీఆర్ సర్పంచుల సన్మాన కార్యక్రమానికి హాజరై పురపాలికల్లో కూడా భారాస విజయం సాధించేందుకు సమష్టి కృషి చేయాలంటూ ముఖ్యనేతలకు సూచించి ఉత్సాహాన్ని నింపారు. భాజపా నాయకులు సైతం జిల్లా, పురపాలక సంఘాలవారీగా సమావేశాలను నిర్వహిస్తున్నారు. సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా పోటీకి మేము సై అంటూ వార్డుల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు.



# యూపిలో అనూహ్య ఘటన

- పట్టుకున్న పాముతో వ్యక్తి సయ్యాటలు
- కసితీరా కాటేయడంతో మృతి

**లక్నో, జనవరి 17 (జనంసాక్షి) :** పాముతో చెలగాం ఆడిన ఓ వ్యక్తి ఏకంగా ప్రాణ్నాలు కోల్పోయాడు. ఉత్తరప్రదేశ్‌లో ఈ ఘటన జరిగింది. ఓ వ్యక్తి నాగు పామును చేతుల్లోకి తీసుకుని అతి చేశాడు. దాన్ని అటూ ఇటూ తిప్పుతూ జనం ముందు ఫోజులు కొట్టాడు. విష సర్పంతో ఆటలు.. ఏకంగా అతడి ప్రాణాలు తీసేశాయి. మూడుసార్లు అతణ్ని నాగుపాము కాటేయడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే చనిపోయాడు. ఈ సంఘటన ఉత్తర్ ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. రామ్‌పూర్‌కు చెందిన 50 ఏళ్ల రాజ్ సింగ్‌కు పొలాల దగ్గర ఓ నాగుపాము కనిపించింది. సుమారు ఆరు అడుగులు ఉన్న ఆ పామును అతడు ఏ మాత్రం భయపడకుండా పట్టుకున్నాడు. అలా పట్టుకుని.. దానితో ఆటలు ఆడటం మొదలెట్టాడు. అటూ ఇటూ తిప్పుతూ సయ్యాట ఆడాడు. తర్వాత రోడ్డు మీదకు వచ్చి మరింత దానితో గేమ్స్ ఆడాడు. పామును మెడలో వేసుకుని ఫోజులు కొడుతూ తిరిగాడు. పామును పట్టుకుని తిరుగుతున్న అతడ్ని చూసి జనం భయపడిపోయారు. అతడు దగ్గరకు వస్తుంటే దూరంగా పరుగులు తీశారు. కొంతమంది అతడికి హితవు పలికారు. పామును వదిలిపెట్టమని, లేదంటే చచ్చిపోతావని హెచ్చరించారు. అయినా కూడా రాజ్ సింగ్ వారి మాటలు పట్టించుకోలేదు. పామును చాలా ఇబ్బంది పెట్టేలా ప్రవర్తిం చాడు. సహనం నశించిన పాము మూడుసార్లు అతడ్ని కరిచిం ది. పాము కాట్ల కారణంగా అతడి పరిస్థితి విషమించింది. కొద్దిసేపటికే ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. రాజ్ సింగ్‌ను పరీక్షించిన వైద్యులు.. అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. ప్రస్తుతం రాజ్ సింగ్ పాముతో అతి చేసిన దృశ్యాల తాలూకా వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఉద్ధవ్ థాక్రేకు ప్రజలు గుణపాఠం చెప్పారు

- నటి, ఎంపీ కంగనా రనౌత్ వ్యాఖ్యలు



**ముంబై, జనవరి17 (జనంసాక్షి) :** బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో దాదాపు 25 ఏళ్ల తర్వాత ఉమ్మడి శివసేన ఆధిపత్యానికి గండిగొట్టి బీజేపీ, శివసేన మహాయుతి కూటమి ఘనవిజయం సాధించడంపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది తమ అందరికీ గొప్ప విజయమని అన్నారు. బీఎంసీ ఎన్నికల్లో సాధించిన చారిత్రక విజయానికి ప్రధాని నరేంద్ర మోదీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, పార్టీ నేతలు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారామె. ఇదే సమయంలో గతంలో ముంబైలోని తన ఆఫీసు కూల్చివేత ఘటనను గుర్తు చేసుకుంటూ ఉద్ధవ్ ఠాక్రే పార్టీపై విమర్శలు గుప్పించారు. గతంలో నన్ను వేధించిన వారిని, నా ఇంటిని కూల్చేసిన వారిని, మహారాష్ట్ర నుంచి వెళ్లిపోవాలని బెదిరించిన వారిని ఇప్పుడు రాష్ట్రమే వదిలేసింది. మహిళా విద్వేషులు, బంధుప్రీతి మాఫియాకు ప్రజలు సరైన చోటు చూపించారు' అని కంగనా రనౌత్ విమర్శించారు. బాంద్రాలోని కంగనా రనౌత్ కార్యాలయంపై కొంత భాగాన్ని 2020లో బీఎంసీ అధికారులు నిబంధనల పేరుతో కూల్చేశారు. దీనిపై ముంబై కోర్టును కంగన ఆశ్రయించడంతో బీఎంసీ చర్యను కోర్టు తప్పుపట్టింది. కూల్చివేతలను ఆపాలని, ఆమెకు జరిగిన నష్టాన్ని పూడ్చాలని ఆదేశించింది. మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 2,869 స్థానాలకు గానూ 1,372 స్థానాలను బీజేపీ సారథ్యంలోని మహాయుతి గెలుచుకుంది. బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌నూ కైవసం చేసుకుంది. బీఎంసీలోని 227 వార్డులకు మెజారిటీ మార్క్ 114 కాగా.. బీజేపీ-శివసేన కూటమి మెజారిటీ మార్కును దక్కించుకుంది.

# మున్సిపల్ ఎన్నికలకు బిజెపి సన్నద్ధం

- సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాం
- మున్సిపల్ పోరులోనూ బిజెపి హవా చాటుతాం
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా



**హైదరాబాద్, జనవరి 17 (జనంసాక్షి) :** రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేసిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు 5 వేల సర్పంచ్ స్థానాలకు పోటీ చేశామని.. గతంలో కంటే బీజేపీ సర్పంచ్‌ల సంఖ్య పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతమైందని.. ఇందుకు ఈ ఫలితాలే నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలో ముక్కలవు తుందని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని తెలంగాణ బీజేపీ చీఫ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లడం, సభలు నిర్వహించడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40 శాతం కమిషన్‌గా మారిపోయిందని, పారిశ్రామికవేత్తలను బెదిరిస్తుందని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పెద్దఎత్తున నిధులు అందిస్తోందని.. వాటితోనే అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రాజెక్టులకు, విద్యాలయాలకు భూమి కేటాయించడం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏమీ చేయలేదని రాంచందర్ రావు విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధికి ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం లేదని, కేంద్ర నిధులతోనే చేయవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర పథకాలపై అబద్దాలు ప్రచారం చేస్తోందని.. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో కేంద్ర పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల త్రివేంద్రం ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేశామని.. కేరళలో కార్యకర్తలపై దాడులు జరిగినా పట్టువదలకుండా పనిచేశామని, ముంబై కార్పొరేషన్‌లోనూ గెలిచామని గుర్తుచేశారు. బీఎంసీ ఎన్నికల్లో 29 మున్సిపాలిటీల్లో 25 స్థానాల్లో బీజేపీ గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు రాంచందర్ రావు. ప్రజల సేవకు కమిట్మెంట్‌తో పనిచేస్తామని, ప్రజలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీలకు కేటాయించిన ప్రాంతాల్లో నాయకులు అక్కడే ఉండాలని, బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370